ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 111 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | సోమవారం, 21 జనవరి 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: శుద్ధ పూర్ణిమ ఉ.11.35
నక్షత్రం: పుష్యమి రా.తె.4.36
వర్జ్యం: మ.1.38 నుండి 3.07 వరకు
దుర్ముహూర్తం: మ.12.24 నుండి 01.12 వరకు
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు

శాసనసభ నిరవధిక వాయిదా

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: నాలుగు రోజుల పాటు జరిగిన శాసనసభ సమావేశం ఆదివారం నిరవధికంగా వాయిదా పడింది. శాసనసభకు ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించడంతో పాటు స్పీకర్ ఎన్నిక, గవర్నర్ ప్రసంగం, గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం తదితర అంశాలతో ముగిసిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేసినట్టు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ నెల 17 నుంచి 20 వరకస నాలుగు రోజుల పాటు జరిగిన సభ తొమ్మిది గంటల 28 నిమిషాలు నిర్వహించినట్టు స్పీకర్ వివరించారు.



ఫైల్‌ఫొటో

హరీష్ - కేటీఆర్ ఏం మాట్లాడుకున్నారు!

- అసెంబ్లీలో ఇద్దరి మధ్య ముప్పావుగంట 'చిట్‌చాట్'
- సభ్యుల్ని ఆకర్షించిన 'భేటీ'

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: ముఖ్యమంత్రి కేసీఆర్ కుమారుడు కేటీఆర్, అల్లుడు టి. హరీష్‌రావు అసెంబ్లీ హాలులో దాదాపు 45 నిమిషాలపాటు 'చిట్-చాట్' వేయడం ఒకవైపు అధికార పక్షం సభ్యులను, మరోవైపు విపక్ష సభ్యులను విశేషంగా ఆకర్షించింది. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ చేసిన ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానాన్ని ఆదివారం శాసనసభలో టీఆర్‌ఎస్ సభ్యుడు కొప్పుల ఈశ్వర్ ప్రతిపాదించగా, టీఆర్‌ఎస్‌కే చెందిన మరోసభ్యుడు వేముల ప్రశాంతరెడ్డి బలపరిచారు. ఈ సందర్భంగా సభ్యులు ఒకవైపు ప్రసంగిస్తుండగా, హరీష్‌రావు కూచున్న కుర్చీకి కుడిపక్కనే ఈటల కూచునే కుర్చీలో కేటీఆర్ కూచున్నారు. 10.30కు సభ్యుల ప్రసంగం కొనసాగుతుండగా, హరీష్‌రావు-కేటీఆర్ 10.45 నుండి 11.30 వరకు మాట్లాడుకుంటూనే కనిపించారు. ఏ అంశాలపై చర్చించారోకానీ చర్చ మాత్రం సీరియస్‌గానే కొనసాగింది. వీరు ఇలా మాట్లాడుతుండగా ఈటల వచ్చారు. దాంతో సంభాషణ ఆపి కేటీఆర్ లేవబోయారు. ఈటల ఆయన్ని వారిస్తూ 'మీరు మాట్లాడుకోండి, నేను పక్కనే కూచుంటా'నని హరీష్‌కు ఎడమవైపున కూర్చున్నారు. తర్వాత బావా- బామ్మర్దుల సంభాషణ మరో 15 నిమిషాలు కొనసాగాయి.

ఘనగామా



ఇది కోల్‌కతాలో జరిగిన ర్యాలీ ప్రభావంలా ఉంది..!!





సోమవారం నుంచి ఐదురోజుల పాటు జరగనున్న చండీయాగానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో జరగనున్న ఈ యాగానికి సంబంధించి ఏర్పాట్లను ఆదివారం పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు. (వార్త 2లో...)

నమ్మకాన్ని నిలబెడతాం

ఏదైనా పకడ్బందీగా చేస్తాం • అందుకే ప్రజలు మళ్లీ గెలిపించారు

చీకట్లోకి బాణం వదిలే అలవాటు మాకు లేదు • హామీలన్నీ ఈ ఏడాది నుంచే అమలు
• అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టీకరణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: 'ఏది చేసినా ఒకటికి రెండుసార్లు ఆలోచించి, కసరత్తు చేశాకే పకడ్బందిగా అమలు చేయడం మా విధానం. గుడ్డిగా చీకట్లోకి బాణం వదిలే అలవాటు ఎప్పుడూ లేదు' అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. 'ఎన్నికల్లో మా కంటే ఎక్కువగా 2 లక్షల రుణ మాఫీ చేస్తామని మీరు చెప్పినా లక్ష రూపాయలు మాత్రమే చేస్తామన్నా ప్రజలు మమ్మల్నే నమ్మి అఖండ విజయం చేకూర్చారు' అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ చేసిన విమర్శలకు సీఎం కేసీఆర్ ధీటుగా సమాధానం చెప్పారు. సీఎం మాట్లాడుతూ, పింఛన్ల పెంపు, నిరుద్యోగులకు భృతి తదితర హామీలన్నింటినీ ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అమలు చేస్తామని ప్రకటించారు. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి రంధి అవసరం లేదన్నారు. వందకు వంద శాతం ఇచ్చిన హామీలన్నింటినీ నిలబెట్టుకుంటామన్నారు. వచ్చే మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి కోటి 25 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వబోతున్నామని ఆయన తెలిపారు. వీటి నిర్మాణం కోసం ఇప్పటికే రూ.99 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన వెల్లడించారు. మార్చి నాటికి మరో రూ. 7 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయడానికి మరో లక్షా 20 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నామని, ఇప్పటికే లక్షా ఏడు కోట్లు ఖర్చు చేశామని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా రెండు లక్షల 25 వేల ఖర్చు చేసి కోటి 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం ద్వారా ఆకుపచ్చ తెలంగాణగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎం కేసీఆర్ వివరించారు. తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత నీటిపారుదల, వ్యవసాయమన్నారు. రైతు రాష్ట్రంగా, రైతు ప్రభుత్వంగా తాము తెచ్చుకున్న పేరు నిలబెట్టుకుంటామన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు కూడా వేర్వేరు చోట్ల వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆదరా బాదరగా - మిగతా 6వ పేజీలో

ఆయుష్మాన్ భారత్ కంటే...

వైఎస్ ఆరోగ్యశ్రీ బెటర్

- మంచి పథకానికి కితాబు ఇవ్వడంలో భేషజాల్లేవు
- అసెంబ్లీలో వైఎస్‌పై ప్రశంసలు కురిపించిన సీఎం కేసీఆర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం కంటే దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తీసుకొచ్చిన ఆరోగ్య శ్రీ ఎన్నో రెట్లు మెరుగైందని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకొనియాడారు. ఆరోగ్యశ్రీ మంచి పథకం కాబట్టే మరింత మెరుగ్గా తీర్చిదిద్ది కొనసాగిస్తున్నామని ప్రకటించారు. 'మంచిని మంచి అనడానికి మాకు ఎలాంటి భేషజాలు లేవు'అని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం శాసనసభలో - మిగతా 6వ పేజీలో

తొలి విడత పోలింగ్ నేడు

- 3701 సర్పంచ్ స్థానాలు
- 28,976 వార్డు స్థానాలు
- ఉ. 7 నుంచి మ. 1 వరకు..
- వెంటనే లెక్కింపు.. ఉపసర్పంచ్ ఎన్నిక

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: తెలంగాణ గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి తొలివిడత పోలింగ్ సోమవారం జరుగుతోంది. మొత్తం 4,479 పంచాయతీల ఎన్నికలకోసం రిటర్నింగ్ అధికారులు ఈ నెల 7న నోటీస్ జారీచేశారు. నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, ప్రచారం తర్వాత సోమవారం పోలింగ్ నిర్వహిస్తున్నారు. అయితే 4,479 పంచాయతీల్లో 769 సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో తొమ్మిది సర్పంచ్ స్థానాలకు కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల ఎన్నికలు జరగడం లేదు. ఎన్నికలు జరుగుతున్న 3,701 గ్రామ పంచాయతీలకు 12,202 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా 39,822 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల పర్వం ముగిసిన తర్వాత 10,654 వార్డుస్థానాలకు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్టు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. 192 వార్డు సభ్యుల స్థానాలకు వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగడం లేదు. సోమవారం పోలింగ్ జరిగే 28,976 వార్డు సభ్యుల స్థానాలకు 70,094 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. పోలింగ్ సోమవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుంది. పోలింగ్ పూర్తయిన వెంటనే కౌంటింగ్ ప్రారంభమవుతుంది. విజయం సాధించిన సర్పంచ్, వార్డు సభ్యులను సమావేశపరుస్తారు. వీరు ఉపసర్పంచ్‌ను ఎన్నుకుంటారు. పోలింగ్‌కోసం 1,48,033 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్టు - మిగతా 6వ పేజీలో

అసెంబ్లీని ఎందుకు రద్దుచేశారో

ఇప్పుడైనా చెబుతారా?

- ముందస్తుకు వెళ్లాల్సిన అవసరం ఏమిటి?
- మంత్రివర్గం ఏర్పాటులో ఎందుకింత జాప్యం?
- అసెంబ్లీలో ధ్వజమెత్తిన కాంగ్రెస్ నేత గండ్ర

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: తెలంగాణ తొలి శాసనసభను తొమ్మిది నెలల ముందే ఎందుకు రద్దు చేశారో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడైనా చెబుతారా? అంటూ కాంగ్రెస్ పక్షం సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆదివారం జరిగిన చర్చలో పాల్గొంటూ, తెలంగాణ మొదటి శాసనసభ గడువు 2019 మే వరకు ఉండగా, 2018 సెప్టెంబర్ 6 న నే ఎందుకు రద్దుచేశారో ఇప్పటి వరకు కేసీఆర్ వాస్తవాలు చెప్పలేదన్నారు. గత ఐదు నెలలుగా రాష్ట్రంలో ప్రభుత్వ కార్యక్రమాలు స్తంభించిపోయాయని అన్నారు. తొలి శాసనసభ రద్దు తర్వాత మూడు నెలల పాటు ఆపద్ధర్మ ప్రభుత్వం కొనసాగిందని, ఇప్పుడు పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పాటు కాలేదని, పంచాయతీ ఎన్నికలతో పాటు, లోక్‌సభ ఎన్నికలు తదితర ఎన్నికల వల్ల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందన్నారు. దాంతో ప్రభుత్వ కార్యక్రమాలన్నీ ఆగిపోతాయని, ప్రభుత్వం ఉన్నా లేనట్టుగానే భావించాల్సి ఉంటుందన్నారు. 88 మంది ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్ నుండి ఎన్నికయ్యారని, మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారని, ఈ పరిస్థితిలో కూడా మంత్రివర్గం ఏర్పాటు చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి ఇప్పటికే 40 రోజులు గడిచిపోయాయని, మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయకపోవడానికి కారణాలు ఏమిటో కేసీఆర్ చెబుతారా అంటూ గండ్ర ప్రశ్నించారు.

రైతులకు ప్రకటించిన లక్ష రూపాయల రుణమాఫీ ఒకే దఫాలో అమలు చేయాలని గండ్ర డిమాండ్ చేశారు. రైతులకు పాస్‌పుస్తకాల పంపిణీ సరిగ్గా జరగలేదని, నేటికీ దాదాపు 30 నుండి 40 శాతం వరకు పాస్‌పుస్తకాలు ఇవ్వలేదన్నారు.

రైతులకు గిట్టుబాటుధర లభించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గండ్ర పేర్కొన్నారు. ఇటీవల మొక్కజొన్న రైతులకు క్వింటాల్‌కు 1429 రూపాయలు రావలసి ఉండగా - మిగతా 6వ పేజీలో

ఎగసిపడిన 'భగీరథ'

పగిలిన పైపులు • వృథాగా పారుతున్న కృష్ణాజలాలు • నాసిరకం పనులతోనే ఈ ఘటన

నాగర్‌కర్నూల్, జనవరి 20: మిషన్ భగీరథ ద్వారా హైదరాబాద్‌కు తాగునీటిని అందిస్తున్న పైపులు పగిలిపోవడంతో నీరంతా కూడా వృథాగా పారుతున్న ఘటన ఆదివారం సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం మేడిపూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. జిల్లాలోని కొల్లాపూర్ మండలం నార్లాపూర్ నుంచి కృష్ణాజలాలను తరలించేందుకు మిషన్ భగీరథ ద్వారా రెండేళ్ల క్రితం వేయడం జరిగింది. ఈ పైప్‌లైన్ నుంచి సజావుగా నీటి సరఫరా కొనసాగుతున్నప్పటికి, మేడీపూర్ సమీపంలో ఉన్న పైప్‌లైన్ నుంచి గత కొన్ని రోజుల నుంచి నీరు లీకవుతున్నా అధికారులు ఎవ్వరు పట్టించుకోలేదని సమీప గ్రామాల ప్రజలు, రైతులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి లీకేజీ ఎక్కువై సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పైపులు పగిలి నీరంతా కూడా పైకి ఎగిసిపడ్డాయని పలువురు రైతులు తెలిపారు. వాటర్ ఫౌంటీన్ మాదిరిగా పైపుల నుంచి నీరు పైకి ఎగిసి పడుతున్న దృశ్యం చూపరులకు ఎంతో ఆకట్టుకున్నది. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి మధ్య నడిచే వాహనాలలోని వారితో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు భారీ సంఖ్యలో ఈ దృశ్యాన్ని చూసేందుకు రావడంతో - మిగతా 6వ పేజీలో



హైదరాబాద్‌కు వెళ్లే మిషన్ భగీరథ పైపులు పగలడంతో ఎగిసిపడుతున్న కృష్ణాజలాలు



హద్దు మీరితే మైక్ కట్: పోచారం

2

అగ్రిగోల్డ్‌పై నేడు కీలక నిర్ణయం

ఏపీ ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ కుటుంబరావు

ఆంధ్రభూమి బ్యూరో

విజయనగరం, జనవరి 20: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపై సోమవారం జరిగే కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ కుటుంబరావు చెప్పారు. హైకోర్టు విభజన సమస్య వల్ల అగ్రిగోల్డ్ బాధితులకు సంబంధించి కొన్ని ఫైళ్లు రాకపోవడంతో ఏపీ సర్కార్ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయలేక పోయిందని చెప్పారు. హైకోర్టులో ఆ కేసు వచ్చేలోగానే నిధులను సమీకరించి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామన్నారు. రాష్ట్రంలో 19 లక్షల మంది అగ్రిగోల్డ్ ఖాతాలు ఉన్నాయని, వాస్తవానికి పది లక్షల మంది బాధితులు ఉన్నారని చెప్పారు. బాధితులను తగ్గించామనడం అవాస్తవమని కొట్టిపారేశారు. వచ్చేనెలా మొదటి వారంలోగా రైతు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. విజయనగరంలో మాన్సాస్ ఆధ్వర్యంలో వైద్య కళాశాల ఏర్పాటు విషయమై ఇంకా స్పష్టత రాలేదని అన్నారు. ఏ విద్యా సంస్థ కూడా అప్పులు చేసి నడపలేదని అన్నారు.

వారిది ధనశక్తి.. మనది జనశక్తి

పెంచిన కోటాకు అనుగుణంగా సీట్ల సంఖ్య పెంపు • కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ

మార్గావో (గోవా), జనవరి 20: 'వారికి ధన శక్తి ఉంటే మనకు జనశక్తి ఉంది.. ఆ కూటమి అవినీతి, అస్థిర, వ్యతిరేకతకు చిహ్నం' అని ప్రధాని నరేంద్ర మోదీ విపక్షాలపై ధ్వజమెత్తారు. అగ్రవర్ణాలకు పది శాతం కోటాను అమలు చేయడానికి ఆయా విద్యా సంస్థల్లో సీట్ల సంఖ్యను పెంచుతామని తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆయన ఆదివారం మహారాష్ట్ర, సౌత్ గోవాలోని లోక్‌సభ స్థానాలైన కొల్హాపూర్, హత్‌కంగ్లే, మాధ, సతార బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తలతో ఆదివారం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

శనివారం కోల్‌కతాలో మమతా బెనర్జీ నేతృత్వంలో విపక్షాల ర్యాలీ గురించి ఆయన ప్రస్తావిస్తూ వచ్చే ఎన్నికల్లో తమకు అపజయం తప్పదని తెలుసుకున్న విపక్షాలు తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి, ప్రజలను మభ్యపెట్టడానికి ఈవీఎంల వాడకంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. కోల్‌కతాలో వేదికను పంచుకున్న ఒక నేత గతంలో జరిగిన బోఫోర్సు కుంభకోణం గురించి ప్రస్తావించిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ నిజం నిప్పులాంటిదని, దానిని ఎవరూ దాయలేరని అన్నారు. విపక్షాలు ఏర్పరుచుకున్న మహాకూటమి పెట్టుబడిదారులు, అవినీతి,



కుంభకోణాలు, అస్థిరత్వంతో కూడుకుని ఉందని మోదీ ఆరోపించారు. విపక్షాల కూటమి వివిధ పార్టీల వారితో ఉంటే తమ కూటమి 125 కోట్ల ప్రజల ఆశలు, ఆశయాలతో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. కోల్‌కతా వేదికను అలంకరించిన వారిలో ఒక గొప్ప నాయకుడి కొడుకో, కూతురో లేక తమ కొడుకో, కూతురో రాజకీయవేత్త కావాలని కోరుకున్న నేతలే ఉన్నారు తప్ప ఒక్కరికీ ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేదని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని నమ్మలేని వారు ఇప్పుడు బహిరంగ వేదికలెక్కి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. వారికి వ్యవస్థలపై ఎలాంటి నమ్మకం లేదని, పైగా రాజ్యాంగ విలువలను తగ్గించడంలో ఎప్పుడూ బిజీగా ఉంటారని విమర్శించారు. తమ కుటుంబాలను ఎలా పైకి తేవాలా అని వారు ఆలోచిస్తుంటే జాతిని ఎలా అభివృద్ధి చేయాలా అని తాము తపన పడుతున్నామని మోదీ అన్నారు. పంచాయతీ స్థాయిలో సైతం పోటీ చేసే వ్యక్తులపై హింసకు పాల్పడిన వ్యక్తులు ఇప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ పాటపాడుతున్నారని ఆయన చెప్పారు.

10 శాతం కోటాతో వారికి నిద్రలేని రాత్రులు

సమాజంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న అగ్రకులాల వారికి ఉద్యోగాలు, - మిగతా 6వ పేజీలో

ఈసారైనా తీరు మార్చుకోరా?

కాంగ్రెస్‌పై సీఎం కేసీఆర్ మండిపాటు ◆ అప్పుడే దుకాణం షురూ జేసిండ్రా అంటూ విసుర్లు



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: 'అది చేయలేదు, ఇది చేయలేదంటూ అప్పుడే దుకాణం షురూ జేసిండ్రా?. ప్రభుత్వం ఏర్పడి ఇంకా నెల అయినా కాకుండానే అప్పుడే విమర్శలా? ఈ సారైనా మీ (కాంగ్రెస్) పంథా మార్చుకోరా? అయినా అదే పద్ధతిలో విమర్శలు కొనసాగిస్తామంటే జాలి పడటం తప్ప ఏమి చేయలేను' అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు పూర్తి చేసి అద్దాలు మాత్రమే అందజేసాం తప్ప ఆపరేషన్లు చేయలేదన్నారు. విషయం తెలుసుకోకుండానే వరంగల్‌లో కంటి వెలుగు ఆపరేషన్లు వికటించినట్టు కాంగ్రెస్ సభ్యుడు ఆరోపణలు చేయడం తగదని సీఎం కేసీఆర్ హితవు పలికారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో కాంగ్రెస్ సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి కంటి వెలుగు ఆపరేషన్లు వికటించి కళ్లు పోయాయని చేసిన ఆరోపణలపై సీఎం కేసీఆర్ తీవ్రంగా స్పందించారు. కంటి వెలుగు ఆపరేషన్లే జరగనప్పుడు వికటించే సమస్య ఎక్కడ ఉత్పన్నం అవుతుందని సీఎం ప్రశ్నించారు. కాంగ్రెస్ సభ్యుడు చేసిన ఆరోపణలో కించిత్తూ వాస్తవం లేదని సీఎం తప్పుపట్టారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల కూడా కాకముందే అది చేయలేదు, ఇది చేయలేదంటూ పాత పద్ధతిలోనే విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రైతులకు పంట రుణాల మాఫీ చేయలేదని విమర్శించే ముందు పంజాబ్, కర్నాటకలో రుణ మాఫీపై ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారా? అని కేసీఆర్ ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతు కుటుంబానికి లక్ష రూపాయల పంట రుణాల మాఫీ చేశామన్నారు. ఈ దఫా కూడా అంతే మొత్తంలో రుణ మాఫీ చేస్తామన్నారు. ఒకేసారి రుణ మాఫీ చేస్తామని తామెక్కడా చెప్పలేదని సీఎం గుర్తు చేశారు. రెండో, మూడో విడతల్లో ఇచ్చిన మాట ప్రకారం రుణ మాఫీ చేస్తాం, దీంట్లో ఎవరికి ఎటువంటి అనుమానం అక్కర్లేదన్నారు. తాము వందకు వంద శాతం ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటామన్న నమ్మకంతోనే ప్రజలు గతంలో 63 సీట్లలో గెలిపిస్తే ఈ దఫా అదనంగా 25 కలిపి 88 సీట్లలో గెలిపించారని సీఎం అన్నారు. సీఎం వ్యాఖ్యలపై ప్రతిపక్ష నాయకుడు భట్టి విక్రమార్క స్పందిస్తూ గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలపై ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, సభకు వివరణ ఇవ్వకుండా సీఎం ఇలా దెప్పి పొడిచినట్టు మాట్లాడటం సబబు కాదన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ఏడాది రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తే, అవ్వేమి జరగనట్టు సీఎం మాట్లాడటం సమంజసమా? అని భట్టి ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ స్పందిస్తూ ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే దెప్పిపొడిచినట్టు భావిస్తే తానేమి చేయలేనన్నారు. గత ప్రభుత్వాలు రైతులను వారి కర్మకు వారిని వదిలేస్తే తమ ప్రభుత్వం వచ్చాకే 15 నుంచి 16 వందల మంది అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ అధికారులను, 150 మంది సర్వేయర్లను నియమించామని సీఎం గుర్తు చేశారు. నిజాం హయాంలో జరిగిన భూ సర్వే తర్వాత తామే పూనుకుని భూ ప్రక్షాళన జరిపించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు భూ రికార్డులను సరి చేయాలనే ఆలోచన ఎందుకు రాలేదని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. ఇప్పటికే 94 శాతం భూ సర్వే పూర్తి చేసి 54 లక్షల మంది రైతులకు కొత్త పాసు పుస్తకాలు ఇచ్చామన్నారు. మిగతా వాటిని పంపిణీ చేయడానికి ఎన్నికలు రావడం వల్ల ఇవ్వలేకపోయామన్నారు. భూ రికార్డులను భద్రపర్చడానికి ధరణి వెబ్‌సైట్‌ను ప్రారంభించామని, అలాగే భూ రిజిస్ట్రేషన్ల బాధ్యతలను తాహసీల్‌దార్లకు అప్పగించబోతున్నామన్నారు. పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాక కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని పకడ్బందిగా అమలు చేస్తామన్నారు. రోడ్లపై చెత్త వేస్తే రూ. 500 జరిమానా విధించేలా కొత్త చట్టాన్ని రూపొందించామన్నారు. పంచాయతీ ఎన్నికల తర్వాత ఏ గ్రామంలో కూడా చెత్తా, చెదారం, మురికి కాలువలు కనిపిస్తే ఎన్నికైన ప్రజా ప్రతినిధులను, సంబంధిత ఉద్యోగులను బాధ్యులను చేసే విధంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎన్ని నిధులు వస్తాయో తెలియకుండా పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టలేమన్నారు. అక్కడ ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది, రాష్ట్రానికి ఏ మేరకు సాయం అందుతుందో తేలిన తర్వాతనే మూడు, నాలుగు నెలలు ఆలస్యంగా పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతామన్నారు. అప్పటి వరకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తోనే కొనసాగిస్తామని సీఎం కేసీఆర్ వివరించారు.



సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలో ఏర్పాటు చేసిన యాగశాలలు

కేసీఆర్ యాగానికి సిద్ధమైన ఎర్రవెల్లి

నేటి నుంచి ఫామ్‌హౌస్‌లో ఐదు రోజుల పాటు నిర్వహణ

200 మంది రుత్వికుల హాజరు

సిద్దిపేట, జనవరి 20 : సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మరో యాగం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల ముందే రాజ శ్యామల యాగాన్ని నిర్వహించిన కేసీఆర్ భారీ విజయంతో సాధించి మళ్లీ ముఖ్యమంత్రిగా అధికార పీఠాన్ని అధిరోహించారు. లోక కల్యాణార్థం, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవెల్లి తన వ్యవసాయ క్షేత్రంలో ఈనెల 21న సోమవారం నుండి ఐదురోజుల పాటు చతుర్వేద పురసుర మహారుద్ర సహిత సహస్ర చండీ యాగం నిర్వహించనున్నారు.

ఇందుకోసం నిర్వహకులు యాగ శాలతోపాటు, హోమ గుండాలను సిద్ధం చేయటంతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారం. ఈనెల 21 నుండి 25 వరకు ఐదు రోజుల పాటు చతుర్వేద పురసుర మహారుద్ర సహిత సహస్ర చండీయాగం గత కొన్ని రోజులుగా పనులు ముమ్మరంగా చేపట్టారు. ఇప్పటికే రెండు పర్యాయాలు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే యాగానికి సంబంధించిన పనులను రెండు పర్యాయాలు పరిశీలించారు. రాజశ్యామల యాగం, బగళ ముఖి యాగం సైతం ఇందులో భాగంగా నిర్వహిస్తున్నారు. ఈ యాగంలో రెండు వందల మంది రుత్వికులు పాల్గొని నిర్వహించనున్నట్లు సమాచారం. ఐదురోజుల పాటే సాగే యాగంలో ప్రతి రోజు పారాయణలు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా పది హోమ గుండాలను ఏర్పాటు చేశారు. ఒక్కో హోమ గుండం వద్ద పది మంది రుత్వీకులు హోమం నిర్వహిస్తారు.

ప్రతి రోజు ఉదయం 7 నుండి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 7-30 గంటల వరకు వేద పారాయణలు నిర్వహించనున్నారు. ఈ యాగం నిర్వహించేవారు దీక్ష ధారణ, తర్వత ఏకభుక్తం చేయాల్సి ఉంటుందని, యజ్ఞశాల ఉన్న శివారు దాట కూడదనే నిబంధనలు కఠినతరంగా ఉంటాయంటున్నారు. రుత్వికులు త్రికాల సంధ్యవందనం చేస్తారని, దీక్షలోనే కొనసాగుతారు. జపతపాల ద్వారా తన శక్తిని ధార పోస్తారు. ఆహార నియమాలు కఠినతరంగా పాటిస్తారు. శృంగేరి పీఠాధిపతి భారతి తీర్థ స్వామి, విశాఖ పీఠాధిపతి స్వరూపానంద స్వామి ఆశీస్సులతో వేద పండితులు శశాంకశర్మ, గోపికృష్ణ ఆధ్వర్యంలో ఈ యాగం నిర్వహించనున్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో పెద్దఎత్తున అయుత చండీయాగం పదిరోజుల పాటు నిర్వహించగా, ఈయాగానికి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజలతో వివిధ ప్రముఖులు కూడ యాగంలో పాల్గొన్నారు. కాగా ఈ యాగానికి మాత్రం కేవలం రాజకీయ ప్రముఖులు, సీఎం కేసీఆర్ బంధువులు, శ్రేయోషిలాషులు మాత్రమే హాజరు కానున్నట్ల తెలుస్తుంది. సందర్శకులను అనుమతించే విషయం ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదు. ఈ యాగం నిర్వహణకు యజ్ఞగుండాలతో పాటు, 10 హోమ గుండాలను అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు సమాచారం. చివరిరోజు అగ్నిస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లో సీఎం కేసీఆర్ యాగాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం 150కు పైగా పోలీసు సిబ్బందిని బందోబస్తులో వినియోగిస్తున్నట్లు తెలుస్తుంది. సీపీ జోయల్ డేవిస్, అడీషనల్ డీసీపీ నర్సింహారెడ్డి ఎర్రవెల్లి వద్ద ఫామ్‌హౌజ్ వద్ద బందోబస్తును పర్యవేక్షించటంమే గాకుండ పరిససరాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. యాగం పూర్తయ్యే వరకు పోలీసు నిఘా కొనసాగనుంది.

ఏర్పాట్లను పరిశీలించిన సీఎం కేసీఆర్

ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో ఈనెల 21 నుండి ఐదు రోజులపాటు జరిగే చతుర్వేద పురసుర మహా రుద్రం సహిత చండీయాగం ఏర్పాట్లను ఆదివారం సీఎం కేసీఆర్ పరిశీలించారు. చతుర్వేద పురసుర మహారుద్ర సహిత చండీయాగం సందర్భంగా నిర్మించిన యాగశాలలు, హోమగుండాలను పరిశీలించారు. యాగం నిర్వహణ ఏర్పాట్లపై రుత్వికులతో చర్చించారు. యాగ నిర్వాహకులు వేద పండితులు శశాంకశర్మ, గోపికృష్ణలతో సీఎం కేసీఆర్ చర్చించారు. ఈకార్యక్రమంలో ఎంపి సంతోష్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ జహింగీర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియాపై ఎన్ని కేసులు పెట్టారు?

అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, జనవరి 20: డ్రగ్స్ మాఫియాపై ఎన్ని కేసులు పెట్టారని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం అసెంబ్లీ సమావేశంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ డ్రగ్స్ మాఫియాలో కొంత మంది సెలబ్రిటీలూ ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నదని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టిందో ప్రకటించకుండా, కేసును మూసి వేశారని ఆయన విమర్శించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని ధూల్‌పేటలో గుడుంబా తయారు చేస్తున్న వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. ధూల్‌పేట ప్రాంతాన్ని సందర్శిస్తానని లోగడ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారని ఆయన గుర్తు చేశారు. ధూల్‌పేట వాసులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వద్దకు వెళతామని తాను లోగడ ఎక్సైజ్ శాఖ మంత్రిని అడగ్గా, ముఖ్యమంత్రి తనకే సమయం ఇవ్వడం లేదని, ఇక మీకు ఎలా ఇస్తారని ఎదురు ప్రశ్నించారని ఆయన గుర్తు చేశారు. సభలో ఉన్న మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు ఏదో చెప్పడానికి ప్రయత్నించగా, కేసీఆర్ వద్దంటూ సైగ చేశారు.

ఆర్థిక అభివృద్ధిలో తెలంగాణ నెంబర్ వన్

శాసన మండలిలో హోం మంత్రి మహమూద్ అలీ



హైదరాబాద్, జనవరి 20: ఆర్థిక అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక రంగాల్లో పురోభివృద్ధిని సాధించామని వెల్లడించారు. గత నాలుగున్నర ఏళ్లలో 171.17 ఆర్థిక వృద్ధిని సాధించామని తెలిపారు. గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసన మండలిలో జరిగిన చర్చలో సభ్యులు పాల్గొని అండగ నిలవడం పట్ల అభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ప్రభుత్వం చేపడుతున్న పథకాలకు దేశ వ్యాప్తంగా అదరణ లభిస్తోందన్నారు. ఆదివారం సభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ప్రభుత్వం తరపున హోంమంత్రి సమాధానమిచ్చారు. చైర్మన్ కే.స్వామిగౌడ్ అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభ కాగానే గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టింది. ప్రభుత్వ చిఫ్‌విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి చర్చను ప్రారంభించారు. ప్రతి పక్షనాయకుడు మహ్మద్ షబ్బీర్ అలీ, బీజేపీ సభ్యుడు ఎస్.రామచందర్ రావుతో పాటు అధికార, ఎంఐఎంకు చెందిన 18 సభ్యులు సభలో ప్రసంగించారు. ఒక రోజు సాగిన ఈ సభ నాలుగు గంటల 53 నిమిషాలు కొనసాగింది. ఈ సందర్భంగా హోంమంత్రి సభ్యులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలూ ఎది చెబితే ముఖ్యమంత్రి కేసీఆర్ అది చేస్తానని అంటారన్నారు. తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శమని, ప్రభుత్వం చేపట్టిన పథకాల పట్ల ముగ్దులైన ప్రజలు మళ్లీ మద్దతు పలికారన్నారు. 2014లో అధికారం చేపట్టిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీతో నిలమెట్టుకోవడంలో విజయం సాధించాగలిగామని చెప్పారు. గత ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ వస్తే నీరు, కరెంటు వంటి సమస్యలతో పాటు శాంతి భద్రతలు దెబ్బ తింటాయన్నారు. గత నాలుగున్నర ఏళ్లలో రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని గుర్తు చేశారు. ప్రత్యేకించి హైదరాబాద్ నగరంలో ఎలాంటి మతకలహాలు జరగాలేదని ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు శాంతి సమరస్యంతో మెలిగారని తెలిపారు. శాంతి భద్రతలకును పర్యవేక్షించడం జరిగిందన్నారు. తెలంగాణ పోలీసులు చక్కగా విధులను నిర్వహిస్తున్నారని, ఫలితంగా ఇటీవల జరిగిన రంజాన్, గణేష్, బోనాలు పండుగా వేడుకలతో పాటు , మెహరం విజయవంతంగా, ప్రశాంతంగా సాగాయని మహమూద్ అలీ తెలిపారు. రాష్ట్రంలో కరెంటు సమస్యలు లేకుండా ఇటు రైతులకు, గృహ అవసరాలకు, పరిశ్రమలకు 24 గంటలు నిరంతరం విద్యుత్ సరఫరాను కొనసాగించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు పెద్దపీట వేసిన సీఎం పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం, నూతన భవనాల నిర్మాణం, వాహనాల కొనుగులు కోసం కోట్ల రూపాయలు మంజురు చేశారని తెలిపారు. పోలీసులకు సరిసమానంగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు ప్రతి నెల 20వేల రూపాయల జీతం అందజేస్తుందని, ప్రతి సంవత్సరానికి వెయ్యి రూపాయలను పెంచడం జరుగుతుందని హోం మంత్రి సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానామిచ్చారు. రైతులకు సంబంధించిన రూణాలు దాదాపు రూ.17వేల కోట్ల వరకు పూర్తిచేశామని, రైతు బీమా పథకం కింద రెండు పంటలకు గాను రూ.8వేలు ఇచ్చాం, ప్రస్తుతం దాని పెంచి 10వేలకు చేయడం జరుగుతుందన్నారు. అనుకోని పరిస్థితుల్లో రైతు మృతి చెందిన వారి కుటుంభంను అదుకోడానికి రైతులకు రైతు బీమా పథకం కింద రూ.5లక్షల ఇన్స్‌రెన్స్‌ను కల్పిస్తున్నామన్నారు. కోటి ఎకరాలకు నీరిచ్చి రైతులకు అండగా నిలవాలన్న లక్ష్యాంతో సీఎం కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. పెంచిన వివిధ రకాల అస్రా పెన్షన్లను ఏప్రిల్ మాసం నుండి అమల్లోకి తెస్తామన్నారు. ప్రభుత్వం చేపట్టిన షాదీ ముబారక్, కాళ్యాణ లక్ష్మీతో పాటు వివిధ రకాల పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని గుర్తు చేశారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వ పెద్దపీట వేసిందని, కేంద్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం రూ.4400 కోట్లు కేటాయిస్తే రాష్ట్రంలో 70 నుంచి 80 లక్షల మంది ముస్లీం మైనార్టీల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.2వేల కోట్లు మంజురు చేసిందని తెలిపారు. ఇప్పటి వరకు 900 కోట్లు మంజూరు చేయగా, రూ.500 కోట్లు రీలిజ్ అయ్యాయని వివరించారు. రెండు లక్షల 72వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని సభ్యులు అడిగిన ప్రశ్నకు హోంమంత్రి బదులిచ్చారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా అమోదించిన్నట్లు సభాపతి స్వామి గౌడ్ వెల్లడించారు. అనంతరం మండలిని చైర్మన్ స్వామి గౌడ్ నిరావధికంగా వాయిదావేశారు.

హద్దుమీరితే మైక్ కట్

అసెంబ్లీ స్పీకర్ పోచారం హెచ్చరిక ◆ కొత్త ఎమ్మెల్యేలకు శిక్షణా తరగతులు



మీడియాతో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: అసెంబ్లీ సమావేశాల్లో ఎవరైనా గాడి తప్పి మాట్లాడితే వెంటనే మైక్ కట్ చేస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు సభా సంప్రదాయాలు, ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ వంటి అసెంబ్లీ కార్యక్రమాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు వాయిదాపడిన అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శాసన మండలి కార్యదర్శి వీ. నరసింహాచార్యులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పాలనలో, డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణంలో, అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శవంతంగా నిలిచినట్లు అసెంబ్లీని కూడా ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సభలో అడ్డగోలు విమర్శలు చేసుకుంటూ విలువైన సమయాన్ని వృధా చేసుకోరాదని ఆయన సూచించారు. సభలో ప్రతి నిమిషం విలువైందని, ప్రతి మాట జాగ్రత్తగా మాట్లాడాలని అన్నారు. కొత్త ఎమ్మెల్యేలు ఆవేశంలో లేదా తెలియకనో మాట దొర్లినా దానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వరాదని ఆయన కోరారు. అసెంబ్లీ పని దినాలను అవసరాన్ని బట్టి పొడిగిస్తామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. పార్టీ ఫిరాయింపులపై వస్తున్న విమర్శల గురించి ప్రశ్నించగా, బలవంతంగా ఎవరిని చేర్చుకున్నా తప్పేనని ఆయన తెలిపారు. అయితే స్వచ్ఛంధంగా పార్టీ మారినా, దానిపై పిటీషన్లు దాఖలైతే చట్ట ప్రకారం తాము నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ పోచారం చెప్పారు. మంత్రి పదవి, స్పీకర్ పదవి బాధ్యత నిర్వహణలో ఏదీ కష్టంగా ఉంటుందని ప్రశ్నించగా, నియమ, నిబంధనల ప్రకారం నడుచుకునే వారికి ఏ పదవినైనా విజయవంతంగా నిర్వహించగలరని ఆయన తెలిపారు.

విపక్షం నేతగా భట్టికి గుర్తింపు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: తెలంగాణ శాసనసభలో ప్రధాన ప్రతిపక్షం నేతగా భట్టివిక్రమార్క ఉంటారని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఈ మేరకు ప్రకటన చేశారు. భట్టి విక్రమార్కను కాంగ్రెస్ పక్షం నాయకుడిగా ఎన్నుకున్నామంటూ కాంగ్రెస్ లెజిస్లేచర్ పక్షం నుండి లేఖ అందిందన్నారు. సభలో టీఆర్ ఎస్ తర్వాత ఎక్కువ మంది సభ్యులు ఉన్న కాంగ్రెస్‌ను ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించామని, భట్టి విక్రమార్క ఈ పక్షానికి నాయకుడిగా ఉంటారన్నారు. అధికారికంగా ఆయనకు ప్రతిపక్ష నేతగా గుర్తింపు ఉంటుందని వెల్లడించారు. ఇలా ఉండగా ఎంఐఎం ఫ్లోర్ లీడర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీని గుర్తించామని స్పీకర్ ప్రకటించారు. ఈ మేరకు ఎంఐఎం పార్టీ జనరల్ సెక్రటరీ నుండి తనకు లేఖ అందిందన్నారు.


టీడీపీ సభ్యుడు సండ్ర ప్రమాణ స్వీకారం

తెలంగాణ శాసనసభకు సత్తుపల్లి నియోజకవర్గం నుండి టీడీపీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికైన సండ్ర వెంకట వీరయ్య ఆదివారం అసెంబ్లీలో పదవీప్రమాణం చేశారు. ఈ నెల 17 న 114 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో సండ్ర సభకు రాలేదు. దాంతో ఆదివారం ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభం కాగానే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఈ మేరకు ప్రకటన చేశారు. సండ్ర వెంకటవీరయ్య పదవీ ప్రమాణం చేస్తారని పోచారం ప్రకటించారు.

ఆంధ్రా మిత్రుడు సాయం చేశాడు

అసెంబ్లీలో వేముల ప్రశాంత్‌రెడ్డి ◆ గవర్నర్ ప్రసంగంపై ప్రశంసలు

కేసీఆర్‌కు ప్రధాని అయ్యే అవకాశం ◆ చర్చల్లో పాల్గొన్న టీఆర్‌ఎస్ సభ్యులు



వేముల ప్రశాంత్ రెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనకు ఆర్థిక సాయం చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక మిత్రుడు తన నియోజకవర్గానికి వచ్చాడని టీఆర్‌ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాయలు తెలిపే తీర్మానంపై ఆదివారం జరిగిన చర్చలో పాల్గొంటూ, వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయడం ఒక్కటే టీఆర్‌ఎస్‌ను గెలిపిస్తుందని, కేసీఆర్‌ను సీఎంగా మళ్లీ అవకాశం వచ్చేలా చేస్తుందని ఆర్థికసాయం అందించిన ఆంధ్రామిత్రుడు అభిప్రాయపడ్డారన్నారు.

ప్రస్తుతం జాతీయ స్థాయిలో నెలకొన్న పరిస్థితి పరిశీలిస్తే కేసీఆర్ ప్రధాని అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని వేముల పేర్కొన్నారు. ఇటీవలి ఎన్నికల్లో ఓటమిపాలైన కాంగ్రెస్ నేత ఒకరు ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని చెప్పడాన్ని ప్రస్తావిస్తూ, టీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసిన తెలంగాణ ప్రజలను సదరు నేత పరోక్షంగా అవమానించినట్టయిందన్నారు.


రాష్ట్రంలో రైతాంగానికి అన్ని విధాలా తమ ప్రభుత్వం చేయూత ఇస్తోందని, నిరంతరం విద్యుత్ సరఫరా చేయడంతో పాటు పంటల పెట్టుబడిగా రైతుబంధు కింద నాలుగువేల రూపాయలు చెల్లించామన్నారు. పంటలకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు వీలుగా ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందని ప్రశాంతరెడ్డి తెలిపారు.

మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా మారిందని వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకవైపు రైతుల సంక్షేమం, మరోవైపు పేదల పింఛన్లు కేసీఆర్‌కు రెండుకళ్లుగా ఉన్నాయన్నారు. కల్యాణలక్ష్మి, ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవం జరిగితే 13 వేల రూపాయలు చెల్లించడం, కేసీఆర్ కిట్స్ తదితర పథకాలు దేశంలో ఎక్కడా అమల్లో లేవన్నారు. కేసీఆర్ ప్రభుత్వప రంగా సంపద సృష్టించి, పేదల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నారన్నారు.

పరిపాలనా సౌలభ్యంకోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేశామని టీఆర్‌ఎస్ సభ్యుడు కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. విద్య, వైద్యాన్ని పేదలకు అందించగలిగామన్నారు. కేసీఆర్ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలు జాతీయ స్థాయిలోనే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలోనే గుర్తింపు తెచ్చుకున్నాయన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కలిసే పోటీ: ఎంఐఎం

అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌తో కలిసి ఉన్న ఎంఐఎం లోక్‌సభ ఎన్నికల్లో కూడా కలిసే ఉంటామని ఎంఐఎం సభ్యుడు అబ్దుల్ బిన్ బలాలా పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాల్లో టీఆర్‌ఎస్ 16 స్థానాల్లో, ఎంఐఎం ఒక స్థానంలో విజయం సాధిస్తుందని



అబ్దుల్ బిన్ బలాలా

అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రచారం చేసిన చంద్రబాబు నాయుడు, వచ్చే ఎన్నికల్లో ఏపిలో ఓటమిపాలవుతారన్నారు. రాహుల్ గాంధీ చార్మినార్‌కు వస్తే 1500 మందిని కూడా కాంగ్రెస్ నేతలు పోగేయలేకపోయారని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో మెడికల్ విద్యార్థిని మృతి

నార్కట్‌పల్లి, జనవరి 20: రోడ్డు ప్రమాదంలో మెడికల్ విద్యార్థిని మృతి చెందడంతో పాటు ఇద్దరు విద్యార్థినులకు తీవ్ర గాయాల పాలయిన సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఏపీ లింగోటం శివారులో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి కామినేని వైద్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్న స్రవంతి, నవజ్యోతి, రమ్యలు ఆదివారం సెలవు దినం కావడంతో స్కూటీపై ఏపీ లింగోటం గ్రామానికి వెళ్లి అల్పాహారం చేసి మళ్లీ తిరిగి కామినేనికి వచ్చేందుకు హైవే రోడ్డు మీదుగా వచ్చారు. ఈ క్రమంలో అతివేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మెడకల్ విద్యార్థినులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో గాయాలపాలయిన విద్యార్థిని స్రవంతి (25) చికిత్స పొందుతూ మరణించింది. మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్నారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ సంఘటనలో పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు. మృతి చెందిన విద్యార్థిని అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ గ్రామానికి చెందిన విద్యార్థినిగా గుర్తించారు. తీవ్ర గాయాల పాలయిన మరో ఇద్దరు విద్యార్థినులు హైదరాబాద్‌కు చెందిన వారుగా పోలీసులు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో గజ్వేల్ విద్యార్థి ప్రతిభ

* సాయికిరణ్‌కు జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు
* రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంకు



గజ్వేల్ / ములుగు, జనవరి 20: జేఈఈ మెయిన్స్‌లో సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాంతానికి చెందిన విద్యార్థి ఏడెల్లి సాయికిరణ్ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటాడు. దేశవ్యాప్తంగా మెయిన్స్ పేపర్-1 ఫలితాలు ప్రకటించగా, అందులో ఏడెల్లి సాయికిరణ్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు, జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. కాగా, పాములపర్తికి చెందిన దయానంద్, సునంద దంపతులు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు, సాయికిరణ్ ప్రాథమిక విద్య పాములపర్తి, ప్రజ్ఞాపూర్‌లో పూర్తి చేయగా, ప్రస్తుతం మాదాపూర్ నారాయణ విద్యాసంస్థలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. తమ కుమారుడు సాయికిరణ్‌కు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు రావడం పట్ల తల్లిదండ్రులు దయానంద్, సునందలు హర్షం వ్యక్తం చేస్తుండగా, తమ విద్యార్థి చక్కటి ఫలితాలు సాధించడం పట్ల సెంట్‌మేరీస్ పాఠశాల డైరెక్టర్ ఇన్నారెడ్డి అభినందించారు. కాగా, కంప్యూటర్ ఇంజనీర్ కావడం తన లక్ష్యమని ముంబైలోని ఐఐటీలో కంప్యూటర్ ఇంజనీర్ చదవాలనే పట్టుదలతో శ్రమిస్తున్నట్లు విద్యార్థి సాయికిరణ్ పేర్కొన్నారు.

పక్షం రోజులకోసారి భేటీ

సీఎల్‌పీ నేత భట్టివిక్రమార్క వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్‌పి) సమావేశాన్ని ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్వహించనున్నట్లు సీఎల్‌పి నూతన నాయకుడు, ప్రతిపక్ష నేత మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఆదివారం అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి భట్టివిక్రమార్కను సీఎల్‌పి నేతగా ప్రకటించారు. ఇలాఉండగా భట్టివిక్రమార్క అసెంబ్లీ ఆవరణలోని మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి సీఎల్‌పి సమావేశాన్ని నిర్వహించాలనుకుంటున్నట్లు చెప్పారు. తద్వారా ప్రజా సమస్యలపై చర్చించి, అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో చేపడుతున్న నీటి పారుదల ప్రాజెక్టులపై లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా, ఇంత వరకు ఒక్క ఎకరానికి కూడా నీరు రాలేదని అన్నారు. ఈ నిధులపై అర్థవంతమైన చర్చ జరగాలని, సాంకేతిక నిపుణులతో ప్రాజెక్టులను సందర్శిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వంపై నిర్మాణాత్మకమైన పోరాటం చేస్తామని ఆయన చెప్పారు. అసెంబ్లీలో రెండేళ్ళుగా ప్రజా సమస్యలపై చర్చ జరగలేదని భట్టివిక్రమార్క అన్నారు.

ఎవరెన్ని నిధులు విడుదల చేశారో చర్చకు సిద్ధమా?

కేసీఆర్‌ను ప్రశ్నించిన బీజేపీ నేత లక్ష్మణ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: దేశానికి స్వాతంత్య్రం లభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం తెలంగాణకు ఏ మేరకు నిధులు విడుదల చేసిందో బహిరంగంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నారా? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే. లక్ష్మణ్ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావును ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు గతంలో మీరు ప్రకటించిన విషయం వాస్తవం కాదా? అని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇప్పుడేమో కేంద్రం నిధులు విడుదల చేయడం లేదని విమర్శించడం భావ్యం కాదని ఆయన ఒక తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు తక్కువ సమయంలో అనుమతి ఇచ్చిన విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా అసెంబ్లీలో ప్రస్తావించారని ఆయన పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని మోదీ ఎక్కువ మొత్తంలో నిధులు విడుదల చేసిందని ఆయన తెలిపారు. వివిధ పథకాలకు కేంద్రం నుంచి విడుదలైన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రధాని మోదీ లీడర్.. మిగతా నేతలు డీలర్స్

బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సాంబిత్ పాత్ర


ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరే లీడర్, మిగతా పార్టీల నేతలంతా డీలర్స్ అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సాంబిత్ పాత్ర అన్నారు. డీలర్స్ డీల్ చేస్తారు, లీడర్ ప్రజలను, దేశాన్ని లీడ్ చేస్తారని ఆయన ఆదివారం విలేఖరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్‌తో కలిసి మాట్లాడుతూ అన్నారు. ఇప్పుడు దేశంలో మహా కూటమిలా డీలర్స్ ఒకవైపు, ప్రధాని మోదీ లీడర్‌లో మరోవైపు ఉన్నారని ఆయన తెలిపారు. ప్రధాని కుర్చీ అంటే మజాక్ కాదని, పవిత్ర బాధ్యత అని ఆయన చెప్పారు. దేశానికి దిశ, దశ నిర్దేశించే శక్తి ప్రధాని మోదీకి ఉందన్నారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, హత్యాకాండ ఆరంభమైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో లీడర్, డీలర్స్ మధ్యే పోటీ ఉంటుందన్నారు. మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, ఏకైక ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రజాస్వామ్యం లేదంటూ విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆయన తెలిపారు.





అద్భుత శిల్పాల కోవెల... యాదాద్రి






యాదగిరిగుట్ట, జనవరి 20: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం నిర్మాణం అద్భుత శిల్పకళతో అలరారుతోంది. ఇప్పటికే ప్రధానాలయం లోపల అళ్వార్‌లు, ఆండాళ్ అమ్మవారు, ఆంజనేయుడు, యాదరుషి, రామానుజచార్యులు, గరుత్మంతుడు, అళ్వార్‌ల నిలువెత్తు విగ్రహాలు శిల్పకళా వైభవాన్ని చాటుతున్నాయి. మరోవైపు ఆలయ లోపల, బయట స్తంభాలపై, ప్రాకార స్తంభాలపై శ్రీ మహావిష్ణువు దశావతారాలు, కాళింగుడిపై శ్రీకృష్ణ తాండవం, హిరణ్యాకశ్యపుడిని నృసింహుడు వధించడం, శేషశయన శ్రీ మహావిష్ణువు, లక్ష్మీలు శిల్పాలు, వివిధ దేవతామూర్తుల శిల్పాలు, తెలంగాణ జీవన శైలికి అద్దం పట్టేలా అరక పట్టిన రైతును, కాకతీయ శిల్పకళాద్భుతమైన ఆలయాలను, వివిధ నాట్యపరికరాలు, మయురాలు, నాగదేవతలు, నృత్య భంగిమల్లో దేవతలను ఇతర పలురకాల ప్రకృతి, పురాణ, చారిత్రక, సామాజిక అంశాలతో కూడిన శిల్పాలను శిల్పులు మలిచిన తీరు చూపరుల దృష్టిని మరల్చనీయకుండా కనువిందు చేస్తున్నాయి. ఒకే తలతో ముగ్గురు మహిళలు కనిపించేలా చెక్కిన శిల్పం చూపరులను ఇట్టే ఆకర్షిస్తూ.. శిల్పుల పనితనానికి దర్పణం పడుతోంది.

ఆతిథ్య వాసి.. కాశీ

అతిథులకు అంతటా ఎర్రతివాచి ● ప్రవాసి దివస్‌కు ముస్తాబవుతున్న వారణాసి





వారణాసి, జనవరి 20: భారతీయ ఆధ్యాత్మిక రాజధాని వారణాసి 'అతిథి దేవోభవ' అన్న నానుడికి అద్దం పట్టేలా ముస్తాబవుతోంది. కుంభమేళా సందర్భంగా వేలాదిమందికి ఆతిథ్యాన్నిస్తున్న ఈ ఆధ్యాత్మిక నగరం ప్రవాసీ దినోత్సవానికి రెండింతలుగా సన్నద్ధమవుతోంది. ఆత్మీయత, ఆప్యాయత, ఆదరణ గీటురాళ్లుగా అతిథులను అక్కున చేర్చుకునేందుకు సన్నద్ధం అవుతోంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ప్రవాసీ దినోత్సవం కోసం కాశీ పుణ్యక్షేత్రం మరింతగా తన అతిథ్య సంస్కృతిని చాటుకోనుంది.

ప్రవాసి దివస్‌కు వచ్చేవారికి ఆతిథ్యమిచ్చేందుకు వారణాసిలోని దాదాపు వంద కుటుంబాలను ఎంపిక చేశారు. వీరంతా తమ ఇంట్లోనే ఆతిథ్యమిచ్చి తమ సాంప్రదాయాలు తెలియజేయడంతోపాటు వారే స్వయంగా ఆహారాన్ని వండి వడ్డిస్తారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్ నేతృత్వంలో 'కాశి ఆతిథ్యం' పేరుతో అతిథులకు చిరస్మరణీయంగా గుర్తుండేలా ఏర్పాట్లు జరిగాయి. అలాగే నగరంలోని అన్ని హోటళ్లను సుందరంగా తీర్చిదిద్దారు. 'అతిథి దేవోభవ' అనే నానుడికి వాస్తవరూపం కల్పించే విధంగా ఆయా కుటుంబాల వారు ఉచితంగా ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ వెల్లడించారు. అలాగే ఆతిథ్యమిచ్చే ఇళ్లకు అతిథులను చేరవేసేందుకు అధికారులు వాహనాలను సిద్ధం చేశారు. ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా, జనవరి 26న రిపబ్లిక్ డే ఉత్సవాలు కూడా జరగనుండడం ప్రస్తుత ప్రవాసీ దివస్‌కు మరింత ఆకర్షణగా మారింది. అధికారులు కూడా అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. మూడు రోజులు నిర్వహించనున్న ప్రవాసీ దివస్‌కు హాజరయ్యేందుకు ఇప్పటికై 5,802 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రవాసీ దివస్ 23న ముగుస్తుంది. అనంతరం 24న వీరంతా కుంభమేళాలో పాల్గొనేందుకు స్విస్ కాటేజ్‌లో ఆతిథ్యమిస్తారు. అనంతరం వీరికి ఢిల్లీలో బస ఏర్పాటు చేస్తారు. 25 ఢిల్లీ పరిసరాలు సందర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవాల్లో పాల్గొంటారు. ప్రవాసి దివస్‌ను 22న ప్రధాని నరేంద్ర మోదీ లాంచనంగా ప్రారంభిస్తారు. 23న ముగింపు సమావేశంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పాల్గొంటారు.

ఏపీలో తగ్గిన సాగు విస్తీర్ణం

* రబీలో 1.89 లక్షల హెక్టార్లు తగ్గుదల
* ఆహార ధాన్యాల లభ్యతపై ప్రతికూల ప్రభావం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 20: తగ్గిన వర్షపాతం, వరుస తుపానులు వంటి అంశాలు రాష్ట్రంలో రబీ సాగు విస్తీర్ణంపై ప్రభావం చూపుతున్నాయి. మరో ఆరు వారాల్లో రబీ సీజన్ ముగియనున్న తరుణంలో తాజా అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సాధారణం కంటే 1.89 లక్షల హెక్టార్లలో సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు సకాలంలో ప్రవేశించి, జూన్ 9 నాటికి రాష్ట్రం అంతటా విస్తరించాయి. దీంతో వర్షపాతం బాగానే నమోదవుతుందని అధికారులు భావించారు. సాధారణ వర్షపాతం 859 మిల్లీమీటర్లు కాగా, 580 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. నైరుతి రుతుపవనాల సమయంలో 32శాతం మేర లోటు వర్షపాతం నమోదు కాగా, ఈశాన్య రుతుపవనాలు కూడా నిరాశ పరిచాయి. సాధారణ వర్షపాతం 296 మీల్లీమీటర్లు కాగా, 124 మిల్లీమీటర్లు మాత్రమే నమోదై 58శాతం మేర లోటును నమోదు చేసింది. ఇది వివిధ పంటల సాగుపై గణనీయమైన ప్రభావం చూపింది.

వర్షాభావం వల్ల రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో, తుపాను, అకాల వర్షాల కారణంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో రబీ పంటలు దెబ్బతిన్నాయి. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. సాధారణంగా రబీలో 19.71 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. కానీ ఈ రబీలో ఇప్పటి వరకూ 17.82 లక్షల హెక్టార్లు మాత్రమే సాగులోకి వచ్చింది. దీంతో సాధారణం కంటే 1.89 లక్షల హెక్టార్ల మేర సాగు విస్తీర్ణం తగ్గింది. ఈసారి ఖరీఫ్‌లో సాగు చేయని మెట్ట భూముల్లో ఈ రబీలో పంటలు వేయడం ద్వారా ఎక్కువ విస్తీర్ణాన్ని సాగులోకి తేవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు భావించారు. ఈమేరకు రబీ లక్ష్యాన్ని 25.54 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. కానీ లక్ష్యంతో పోలిస్తే 7.42 లక్షల హెక్టార్ల మేర సాగు విస్తీర్ణం తగ్గడం గమనార్హం. వరి 98వేల హెక్టార్లలో, ఆహార ధాన్యాలు 37వేల హెక్టార్లు, పప్పుధాన్యాలు 17వేల హెక్టార్లలో సాధారణం కంటే సాగు విస్తీర్ణం తగ్గాయి.

ఆర్టీసీ పరిరక్షణకు నిధులు కేటాయించాలి

* ఏపీ ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్
* 22న యాజమాన్యంతో మలి విడత చర్చలు
* వేతనాలు పెంచకుంటే 23న భవిష్యత్ కార్యాచరణ

.విజయవాడ (సిటీ), జనవరి 20: రాష్ట్రంలో లక్షల మంది ప్రజలకు రవాణా సౌకర్యం అందిస్తున్న ఆర్టీసీకి నష్టాలు రావడానికి డీజిల్, స్పేర్ పార్ట్స్ ధరల పెరుగుదలే ప్రధాన కారణమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అన్ని కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అభిప్రాయపడింది. ఆర్టీసీని పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఇక్కడి ఆర్టీసీ హౌస్‌లోని ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం అన్ని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జేఏసీగా 13 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ కన్వీనర్‌గా పలిశెట్టి దామోదరరావు, కోకన్వీనర్లుగా సుందరయ్య, వి వరహాలనాయుడును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో రోజుకి 65 నుండి 70 లక్షల మంది ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తూ ఆర్టీసీ ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా ఎదిగిందన్నారు. అయితే ఆర్టీసీకి నష్టాలు రావడానికి 2015 నుండి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బస్ ఛార్జీలు పెంచకపోవడం ఒక కారణమని వారన్నారు. ఇదే సమయంలో డీజిల్, స్పేర్ పార్ట్స్ ధరలు 50శాతం పెరగడంతో సంస్థకు నష్టాలు పెరిగాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతున్న సుమారు 5వేల పల్లెవెలుగు బస్సులకు వస్తున్న నష్టాలు ఏడాదికి రూ. 800 కోట్లుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వానికి వస్తున్న మోటారు వాహనాల పన్ను రూ.300 కోట్లకు పైబడి ఉందన్నారు. ఆర్టీసీ అప్పులకు రోజుకి రూ. 2 కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీని ప్రభుత్వం ఆదుకోవాలని, సంస్థను పరిరక్షించుకునేందుకు ప్రస్తుతం బడ్జెట్‌లో సుమారు రూ.3720 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇన్ని ఇబ్బందులు, నష్టాలు ఉన్నప్పటికీ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులను అన్ని ప్రాంతాలకు నడుపుతున్నారని, దీంతో నష్టాలు మరింతగా పెరిగాయన్నారు. ఈనేపథ్యంలో ఆర్టీసీకి వస్తున్న నష్టాలు మొత్తం ప్రభుత్వం భరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గతంతో పోల్చుకుంటే ఆర్టీసీ ఉద్యోగుల కృషి ఫలితంగా రూ.2వేల కోట్ల రూపాయల ఆదాయం సంస్థకు లభించిందన్నారు. గత నాలుగేళ్లలో 10వేల మంది రిటైరయ్యారని, ఇంతచేసినా నష్టాలు వస్తున్నాయంటే ఆర్టీసీని విద్య, వైద్య రంగాల మాదిరిగా ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికీ సంస్థలో ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగుల కంటే 20 నుండి 30 శాతం తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. 2017 ఏప్రిల్ 1 నుండి జరగాల్సిన వేతన సవరణను 50శాతం ఫిట్‌మెంట్ కలిపి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న యాజమాన్యంతో జరిగే మలివిడత చర్చల్లో సానుకూల వైఖరి రాకుంటే 23న జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. జేఏసీకి దూరంగా ఉన్న ఎన్ఎంయూ కార్మికల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కలసి రావాలని విజ్ఞప్తి చేశారు.

పీఎఫ్ ఆంక్షల సడలింపు ఎప్పుడు?!

* ఎదురుచూస్తున్న బీడీ కార్మికులు
* ఎన్నికల్లో స్పష్టమైన వాగ్దానం చేసిన కేసీఆర్
* కటాఫ్ డేట్‌ను ఎత్తివేస్తే మరో 80వేల మందికి జీవనభృతి

ఆంధ్రభూమి బ్యూరో

నిజామాబాద్, జనవరి 20: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) కటాఫ్ డేట్ ఆంక్షలను సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వం ఎత్తివేయాలని వేలాది మంది బీడీ కార్మికులు కోరుకుంటున్నారు. ఈ విషయమై ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెరాస అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రచార సభల్లో స్పష్టమైన వాగ్దానం చేయడం జరిగింది. ఈ హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేస్తే రాష్ట్రంలో సుమారు 80వేల మంది బీడీ కార్మికులకు జీవన భృతి రూపంలో లబ్ధి చేకూరనుంది. బీడీ పరిశ్రమకు కేంద్ర బిందువుగా నిలుస్తున్న ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే సుమారు 40వేల మంది జీవనభృతి పొందేందుకు అర్హత సాధిస్తారు. ఈ నేపథ్యంలో బీడీ కార్మికులంతా పీఎఫ్ కటాఫ్ డేట్ ఆంక్షల సడలింపు కోసం చకోరపక్షుల్లా ఎదురుతెన్నులు చూస్తున్నారు. తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మీదట బీడీ కార్మికులకు జీవనభృతి కింద నెలకు వేయి రూపాయల పెన్షన్‌ను అందించేందుకు ఇదివరకు మార్గదర్శకాలను జారీ చేసింది. 2014 ఫిబ్రవరి 28వ తేదీలోపు ప్రావిడెంట్ ఫండ్ జాబితాలో పేర్లు కలిగి ఉన్న బీడీ కార్మికులకు మాత్రమే జీవనభృతి అందించాలని నిబంధన విధించారు. దీంతో 2014 ఫిబ్రవరి అనంతరం పీఎఫ్ ఖాతాలు తెరుచుకున్న వేలాది మంది బీడీ కార్మికులు ఈ నిబంధన కారణంగా జీవనభృతి పొందేందుకు అనర్హులుగా పరిగణించబడుతున్నారు. నిర్ణీత గడువుకు ముందు పీఎఫ్ చందాదారులుగా ఉన్న రాష్ట్రంలోని సుమారు మూడున్నర లక్షల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుండగా, మరో 80వేల మంది వరకు కార్మికులు జీవనభృతి ప్రయోజనానికి దూరంగా ఉండిపోవాల్సి వస్తోంది. నిజానికైతే పీఎఫ్‌తో సంబంధం లేకుండా నాన్ పీఎఫ్ కార్మికులకు కూడా ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవనభృతిని అమలు చేయాలని బీడీ కార్మికులు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ అక్రమాలకు ఆస్కారం లేకుండా పీఎఫ్ ఎన్‌రోల్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే ముందస్తుగానే 2018చివరిలో అసెంబ్లీ ఎన్నికలు తెరపైకి రావడంతో పెద్ద సంఖ్యలో ఉన్న బీడీ కార్మికులను ఆకట్టుకునేందుకు తెరాస అధినేత కేసీఆర్ మరోమారు జీవనభృతి అంశాన్ని ఎన్నికల ప్రచార సభల్లో ప్రముఖంగా ప్రస్తావించడం జరిగింది. జీవనభృతికి అడ్డంకిగా మారిన పీఎఫ్ కటాఫ్ డేట్ ఆంక్షలను తొలగించి 2018వరకు కూడా పేర్లు ఎన్‌రోల్ అయిన కార్మికులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తామని నిజామాబాద్ జిల్లా వేదికగా వాగ్దానం చేశారు. ఇదివరకు 2014 ఎన్నికల సమయంలోనూ ఇదే జిల్లాలోని మోర్తాడ్‌లో ఎన్నికల ప్రచార సభలో జీవనభృతి అమలు చేస్తామని ప్రకటించడం జరిగింది. దీంతో అప్పట్లోనూ నిర్ణయాత్మక శక్తిగా ఉన్న బీడీ కార్మికులు తెరాస వైపు మొగ్గుచూపడంతో ఆ ఎన్నికల్లో గులాబీ పార్టీ ఉమ్మడి జిల్లాలోని మొత్తం తొమ్మిది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు నియోజకవర్గాలను కైవసం చేసుకోవడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 7లక్షల మంది బీడీ కార్మికులు ఉంటే, ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే రెండున్నర లక్షల మంది బీడీ పరిశ్రమపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ మరోమారు బీడీ కార్మికులను ప్రసన్నం చేసుకునేందుకు తెరాస అధినేత కేసీఆర్ పీఎఫ్ కటాఫ్ డేట్ ఆంక్షలను ఎత్తివేస్తామని హామీ ఇవ్వడం సత్ఫలితాలు అందించిందనే చెప్పవచ్చు. ఇంచుమించు ఇదివరకటి తరహాలోనే ఈసారి ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలోని మొత్తం తొమ్మిది సెగ్మెంట్లకు గాను ఎనిమిది నియోజకవర్గాల్లో తెరాస అభ్యర్థులనే తిరిగి ఎమ్మెల్యేలుగా గెలిపించారు. ఆ పార్టీ భారీ మెజార్టీతో మరోమారు అధికారంలోకి వచ్చిన సందర్భంగా జీవనభృతి అమలుకు అడ్డంకిగా మారిన ఆంక్షల సడలింపుకై వేలాది మంది బీడీ కార్మికులు ఎంతో ఆతృతతో ఎదురుతెన్నులు చూస్తున్నారు. ఈ విషయమై తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆంక్షలను సడలిస్తే 80వేల మందికి కొత్తగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. అయితే పీఎఫ్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ బేషరతుగా జీవనభృతి అమలు చేయాలని తాము అభిలషిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సాహితి


email: sahiti@andhrabhoomi.net



సవ్వడి

వడివడిగా సాగే
వాడి వేడి జీవితాల్లో
ఆడీ ఆడీ వాడిపోవడం
ఓడిపోవడం
కాలం సలిపే క్రీడలో భాగమే
అలజడులూ హిమవన్నగాలై
పాతాళపు లోతుల్లోకి
తోస్తూనే వుంటాయి
పాయసంలో పలుకుల్లా
సుఖాలూ శుభాలూ
రుచులనిస్తూనే ఉంటాయ్
గతుకు రోడ్లపై
జీవితపు బండి ఒడిదుడుకులు
సహజాతాలే సోదరీ
నీ జీవితం ఝరీభూతమై
సాగడమే జీవ రహస్యం
పొంగడం క్రుంగడం
మాని చూడు
మనసు మ్రానులోంచి
స్థితప్రజ్ఞత మొలకై
పొడుచుకువస్తుంది
ఆత్మజ్ఞానంతో పునీతమవుతుంది

- డా. ఎన్.వి.ఎన్.చారి, 9866610429



పుట్టమన్నును

నేను
శబ్దసాగరం మీద
విచ్చుకున్న చంద్రోదయాన్ని
మీరు దాచుకోలేకపోతున్న ప్రహేళికల్లోంచి
పునర్జన్మిస్తున్న అవశేష క్షణాన్ని
ఏకాంకికలో బహుముఖీనమైన
పాత్రధారిని నేనే
నిగూఢమైన మీ లోలోతుల్లో
సుడులు తిరుగుతున్న గొంతుకని నేనే

'సమస్తస్వసుఖినోభవంతు' శాలువాల్లో దూరి
వెర్రి ముఖాన్ని దాచుకున్న మీరు
నీడల మర్రి తుపాన్లలో కొట్టుకుపోతుంటారు
నిషాద సంగీతాన్ని అదేపనిగా
చేది పోసుకుంటున్న పాయల్లో
మీ అస్థికల మీద నేను మాత్రం
బీజాక్షరాల ఊటనై ఊరుతుంటాను

ప్రవాహంలో మీకు ఈత నేర్పటం
నాకు తప్పదు కదా
మయసభలో మర్మక్రీడల మీద కప్పుకున్న
ఆచ్ఛాదనల్ని తీసివేయక తప్పదు కదా
ఖండిత హస్తాలతో మీరు రాసుకోబోతున్న
కావ్యానికి ప్రోలోగ్‌ని నేనే

రేపటి స్వప్నశాలలో
మీరు ఆవిష్కరించుకోక తప్పని
హెచ్చరికనీ నేనే

దారుల మీద కమ్మిన పొగమంచు కాదు నేను
నా మీదుగా అడుగులేస్తూ పోతున్న
మీ మూడో పాదాన్ని ఎక్కడ మోపాలో
తెలియని క్షణాన నా దోసిలిని మీ కోసం
విప్పుతాను
నేను హఠాత్ సంఘటనల చౌరస్తాలో
మీ కోసం దారి చూపే సజీవ విగ్రహాన్ని

కాలడం తెలిసినవాణ్ణి కనకే
క్రరులా గుక్క తిప్పుకుంటున్న
ఉదయాన్ని నేను
దీర్ఘచతురస్రాల మధ్య ధాతువుగా పోత
పోసుకున్న
స్వాగత ద్వారాన్ని నేను
తపస్సుల్ని తెగనరికిన సమాధుల్లో
ఏ దోషం అంటని ఆహ్వానాన్ని నేను
మీరు దోసిళ్లకెత్తుకోవడం కోసం
ఏ కాలానా
ఎదురుచూస్తున్న పుట్టమన్నును నేను

- యార్లగడ్డ రాఘవేంద్రరావు, 9985411099



మనోరంజితాలు

చూపులు కలిసిన శుభవేళ
అవి కంటిపాపల్ని వెలిగిస్తాయి
విరిసే వేళ
కనువిందు చేసే ప్రగతిచిహ్నాలవుతాయి
పరిమళించే వేళ
ఎద సానువులగుండా సాగిపోయే
చందన సమీరాలవుతాయి
అరుణోదయ వేళ
హరిత శోభల నడుమ వెలుగొందే
దీపాంకురాలవుతాయి
మధుమాస వేళ
మది నిండిన మకరందాలతో
మరులు గొనే అభిసారికలవుతాయి

దాని అస్తిత్వం ఓ రమణీయం
లాలిత్యం దాని అభిజాత్యం
అవి భావాలకు ప్రేరణలు
బంధాలకు అనుసంధానాలు
భక్తికి సోపానాలు
వలపు జీవులకు ప్రేమ సాక్ష్యాలు
ప్రణయ జీవులకు పరిణయ వేదికలు

పువ్వులను గౌరవించడం
మన సంస్కృతి
అది సంప్రదాయంగా మారడంలో
అది మనకు అందివచ్చే
మధుర సంతకాలు
అందుకే అవి మనోరంజితాలు

- కె.రవీంద్రబాబు, 9052778988

రంగమార్తాండుని మహాభినిష్క్రమణం



"నకర్మణా న ప్రజయా ధనేన / త్యాగే నైకేన అమృతత్వ మానశుః" అన్నారు పెద్దలు.

అజో.విభో సంస్థవారు జనవరి 2019 మొదటి వారంలో తెనాలిలో మహాసభలు నిర్వహించారు. ప్రతి సంవత్సరము వారు ఒకే మహనీయునకు జీవన సాఫల్య పురస్కారం క్రింద లక్ష రూపాయల నగదు బహుమతి అందజేస్తున్నారు. ఈ ఏడాది ప్రొఫెసర్ మొదలి నాగభూషణశర్మగారికి ఈ సత్కారం జనవరి 6వ తేదీన జరిగింది. సరిగ్గా పది రోజులు తిరగకముందే జనవరి 15వ తేదీ సంక్రాంతి పర్వదినంనాడు ఆయన తిరిగి రాని లోకాలకు తరలిపోయారు.

నాగభూషణశర్మగారి పేరు చెప్పగానే ఒక ఉత్తమ అధ్యాపకుడు, ఒక కళాద్రష్ఠ, త్రష్ఠ, రంగప్రయోక్త, నటుడు, విమర్శకుడుగా మన కన్నుల ముందు సాక్షాత్కరిస్తారు. అసంఖ్యాకమైన గ్రంథాలు రచించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. నాటక రంగానికి సంబంధించి వివిధ గ్రంథాలు ప్రచురించారు. పత్రికా సంపాదకత్వం వహించారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఆంగ్లశాఖాధ్యక్షులుగా డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్సుగా సేవలను అందించారు. డ్రమట్రెజీ డిపార్ట్‌మెంట్‌లో ఎన్నో వినూత్న ప్రయోగాలు చేశారు. వివిధ విద్యాసంస్థలలో, సదస్సులలో పత్ర సమర్పణ చేసి తమ విద్వత్తు చాటుకున్నారు. కుమ్మరి వీధిలో కుండలు అమ్మడం దుస్సాహసం. అలాగే తెనాలిలో వారు నాటక ప్రదర్శనం ఇవ్వటమే కాకుండా చివరి రోజులలో అక్కడే మల్లాదివారి వీధి నాజర్‌పేటలో స్థిరపడ్డారు. భార్యా వియోగంతో ఆయన మానసికంగా కొంత క్రుంగిపోయినా, సాహిత్య కళారంగ సేవలను నిరవధికంగా సాగించారు. గొంతు క్యాన్సర్ వ్యాధితో కొద్దికాలం అస్వస్థతను అనుభవించి 2019 జనవరి 15వ తేదీ తెనాలిలోనే తుది శ్వాస విడిచారు. తొలి తెలుగు నాటకకర్తలలో ప్రఖ్యాతుడై ఆంధ్ర భాషలో అజరామరమైన నాటకాలను రాసి ఆ నాటకాలకు దర్శకత్వం వహించి తాను స్థాపించిన సరస వినోదినీ సభ ద్వారా ప్రదర్శించి ఆ నాటకాలలో నటించి తెలుగు నాటకానికి సుస్థిరతను, దేశవ్యాప్తిని కలిగించిన నాటకకర్త 'ఆంధ్ర నాటక పితామహ' బిరుదాంకితుడు శ్రీ ధర్మవరము రామకృష్ణమాచార్యులు. ఆయన నాటకాలలో లభ్యమైన 20 నాటకాలను మూడు సంపుటాలలో ఆచార్యులవారి కుటుంబ సభ్యుల పక్షాన ప్రచురించడం జరుగుతున్నది.

మూడవ సంపుటిలోని నాటకాలు: 1. అజామిళ 2. ఉషాపరిణయము 3. హరిశ్చంద్ర 4. ప్రచండ గాధేయము 5. కురుక్షేత్ర నాటకము లేదా యుధిష్ఠిర పట్టాభిషేకము 6. యుధిష్ఠిర యౌవరాజ్యపట్టాభిషేకము (2 అంకములు) అనుబంధాలు.

ఆంగ్లంలో 'Bellari Raghava', 'The Folk Performing Arts of Andhra Pradesh', The Shadow puppet Theatre of Andhra', 'A History of the Surabhi Theatres, 'Kuchipudi: Gurus, Performers and Performance Traditions' వంటి పదిహేను విమర్శనాగ్రంథాలను, తెలుగులో 'తెలుగు సాహిత్యం: గాంధీజీ ప్రభావం', 'నవలా వికాసం', 'నాటక శిల్పం', 'స్థానం నరసింహారావు నట జీవన ప్రస్థానం', 'కల్యాణం రఘురామయ్య జీవితం' వంటి ఇరవై విమర్శనా గ్రంథాలతోపాటు 'నూరేళ్ల తెలుగు నాటక రంగం', రాజమన్నారుగారి 'తప్పెవరిది?' వంటి పది గ్రంథాలకు సంపాదకత్వం వహించారు.

వివిధ అంతర్జాతీయ, జాతీయ పత్రికల్లో ఆంగ్లంలోను, తెలుగులోనూ వంద పరిశోధక వ్యాసాలను ప్రచురించారు. పది ఆంగ్ల నాటకాలకు, అరవై తెలుగు నాటకాలకు దర్శకత్వం వహించారు. 'ప్రజానాయకుడు ప్రకాశం', 'కాయితం పులి', 'దొరా, నీ సావు మూడింది', 'రేపటి స్వర్గం' వంటి ప్రయోగాత్మక తెలుగు నాటకాలకు ప్రసిద్ధులు. 'నర్తనం' అనే ఆంగ్ల త్రైమాసిక పత్రికకు వ్యవస్థాపక సంపాదకులు. భారతీయ నాటక, నృత్య, జానపద కళలకు సంబంధించిన పలు జాతీయ సంస్థలలో సభ్యుడు. ప్రఖ్యాత సంస్కృత, ఆధునిక భారతీయ, పాశ్చాత్య నాటకాలు- మృచ్ఛకటిక, ముద్రారాక్షసం, భగవదజ్జుకీయం, రాజా ఈడిపస్, మాక్‌బెక్, ఎంపరర్ జోన్స్, వెయిటింగ్ ఫర్ గోడో వంటి నాటకాలను తానే అనువదించుకుని రంగస్థలం మీద ప్రయోగించారు. 20 ఇంగ్లీషు నాటకాలకు, 60 తెలుగు నాటకాలకు దర్శకత్వం వహించారు. నూరేళ్ల తెలుగు నాటక రంగం, ఆచార్య ఆత్రేయ, కన్యాశుల్కం- నూరేళ్ల సమాలోచనం, బళ్ళారి రాఘవ, తెలుగు నవలావికాసం, తెలుగు సాహిత్యం- గాంధీజీ ప్రభావం, నాటకకర్త చిలకమర్తి వంటి గ్రంథాలు వారి విమర్శనా పటిమను వెల్లడిస్తాయి. జానపద ప్రదర్శక కళారూపాలను ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. ఆంధ్ర దేశం నలుమూలలా దిగ్విజయంగా ప్రదర్శిస్తున్న "ప్రజానాయకుడు ప్రకాశం" వీరి ఇటీవలి రచన, ప్రయోగం.

జాతస్య హి ధృవో మృత్యుః అన్నట్లు పుట్టినవారు గిట్టక మానరు. కాని వారి వ్యక్తిత్వం వక్తృత్వం శేముషీలై దగ్ధ్యం ప్రపంచంలో శాశ్వతంగా మిగిలిపోతుంది. నటరాజ పాద మంజీర శింజినీ నిక్వాణంగా ఎనిమిది దశాబ్దాలు వెలిగిన ఒక ధృవతార రాలిపోయింది. వారికి ఇదే అక్షరాంజలి.

- జొన్నాభట్ల నరసింహప్రసాద్



చలి రాగం

చెలీ అంటూ చలి తరుముతుంది
చల్లగా మేనును తడుముతుంది
హిమ శకలాలుగా జారుతూ
సుమ పరిమళాలుగా రాలుతూ
చల్లనైన ప్రకృతి పరిష్వంగంలో వెల్లువైన
ఆకాశం దుప్పటి కింద
పరుచుకున్న పచ్చిక పరుపుమీద
విచ్చుకున్న వూహల్ని తట్టిలేపుతుంది
వేకువ ఊపిరులతో నిట్టూర్చుతుంది
మంచు స్ఫటికంలా చల్లదనాన్ని
మల్లె పరిమళాల ప్రవాహాన్ని
తనలో కలుపుకుని
తీయనైన వణుకుతో హాయిని
మిగిలించింది
మధురోహల మధు భావాలను
రగిలించింది
కనురెప్పల వింజామరలను ఊపుతూ
కలల కదలికలను మౌనంగా వింటుంది
ఈ చలి ఆకునుండి ఆకుకు పాకి
మేఘ మాలికను తాకి
ప్రియ భాను కిరణం చేతుల్లో
వెచ్చగా ఒదగాలని
కలలు కన్న నెచ్చెలిలా
ఋతువుల రాగమును ఆలపిస్తూ
రాత్రి తాళలయలతో
ఆదమరచి నిదురపోతుంది

- సముద్రాల శ్రీదేవి, 9949837743

అవతారశర్మకు నోరి పురస్కారం

కవిసమ్రాట్ నోరి నరసింహశాస్త్రి 120వ జయంతిని పురస్కరించుకుని నోరి పురస్కారాలను అందజేయనున్నట్లు నోరి నరసింహశాస్త్రి చారిటబుల్ ట్రస్టు సభ్యులు నోరి శివసేనాని, నోరి కళ్యాణ సుందర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతిష్ఠాత్మక నోరి నరసింహశాస్త్రి పురస్కారానికి కాశీవాసి కొల్లూరు అవతారశర్మ ఎంపికయ్యారని, పురస్కారం కింద 20వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేయబడుతుందని తెలిపారు. అలాగే యువరచయిత ప్రోత్సాహక పురస్కారం రాంభట్ల వెంకటరాయశర్మ ఎంపికయ్యారని, పురస్కారం కింద ఐదువేల నగదు, జ్ఞాపిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 6-2-2019న చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగే నోరి నరసింహశాస్త్రి జయంతి మహోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత న్యాయమూర్తి ఎ. రామలింగేశ్వరరావు, సభాధ్యక్షులుగా బ్రహ్మశ్రీ నోరి సుబ్రహ్మణ్య శాస్త్రి, ప్రత్యేక అతిథిగా ప్రొ. సుదర్శన్‌సింగ్, విశిష్ట అతిథిగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆత్మీయ అతిథులుగా ప్రొ. ముదిగొండ శివప్రసాద్ తదితరులు హాజరుకానున్నారు.



సామాన్యంగా ఉండే అసామాన్యుడు

జీవితం కన్నా నమ్మిన ఆశయమే గొప్పదని ఆచరించి చూపిన ఆదర్శవాది అలిశెట్టి. ఆయన ఏనాడు పదవులకు, అవార్డులకు, సన్మానాలకు ఆశించలేదు కాని నమ్మిన సిద్ధాంతాలను తుంగలోతొక్కి, భోగలాలసులైన వారిని వ్యతిరేకించిన అలిశెట్టి ప్రభాకర్ భౌతికంగా మనకు దూరమై ఇరవై ఐదు సంవత్సరాలైనా, అతని జ్ఞాపకాలు అతని కవితల రూపంలో ఇప్పటికి అందరి మనస్సులో నిలిచి, పెదాలపై నడియాడుతున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరు ఆయా అవసరానికి తగ్గట్టు ఆనాటి సుమతి శతకంలానో, వేమన శతకంలాన్నో ధర్మపురి శేషప్ప శతకంలోని పద్యాల్లానో, వారివారి వీలునుబట్టి, సందర్భానుసారంగా, వ్యంగ్యంగా, ఛలోక్తులతో, కోట్ చేయగలిగే వీలున్న కవితలు రాసిన ప్రభాకర్ కవితల్లా, ఆయన సమకాలికుల కవితలు అంతగా కోట్ చేయబడలేదనడం అతిశయోక్తికాదు. వర్తమాన సమాజం పట్ల బాధ్యతతో, భవిష్యత్ పట్ల ఆశతో మెలిగిన ప్రభాకర్ ప్రజల జీవితాలలోని పేదరికాన్ని చూడడానికి పరిశోధనలు చేయడానికి ఎలాంటి మైక్రోస్కోపులు అవసరం లేదని, మనసున్న హృదయం ఉంటే అన్ని కనబడతాయని, అలాంటి మానవత్వపు హృదయాలు ఈనాటి సంఘ నాయకులకు, ప్రజాప్రతినిధులకు లేవని అందుకు కారణం వ్యక్తిగత స్వార్థమేనని అంటాడు. అదే సమయంలో విలువైన జీవితం మన ఆశాసౌధమని, దాన్ని అందంగా నిర్మించుకోవడం మన స్వంత బాధ్యతగా గుర్తించి, సమాజానికి మనుషులతో ఏర్పడ్డ, సమాజంలో జరిగే అన్యాయాలను చేసేవారి దురాగతాలను ఎదుర్కోలేని మనిషి జీవించడంవలన ఎవరికైనా లాభం ఉందా, అతని పుట్టుకకు అర్థం ఏమిటని ప్రశ్నిస్తూ, అతను ఎలా ఉండాలో అనేక కవితల్లో చెప్పాడు. రహదారిపై చలువకొరకు నాటిన చెట్లలా, గుడి ముందటి ద్వారానికి ఉండే ద్వారపాలకుల్లా నిశ్చేష్టంగా నిలబడితే, మనమూ ఈ సమాజంలో ప్రేక్షక పాత్ర వహిస్తే, ఈ సమాజాన్ని మార్చేవారెవరని, అందుకే భాస్వరంలోని తేజస్సులా మారి, సమాజంలోని అవినీతిని, దుర్మార్గాన్ని కాల్చివేయాలని అంటాడు.

సాహిత్యంలో మినీ కవితలకు విలువ లేనినాడు, వాటిలో కూడా సాహిత్య విలువలు ఉన్నాయని నిరూపించి, ఒక గౌరవప్రదమైన స్థానాన్ని కల్పిస్తూ, సాధారణ, వ్యవహారిక భాషలో, మహామహ గ్రంథాలలో చెప్పలేనంతగా ఇమిడి ఉన్న భావాన్ని చెప్పాడు. పీడితవర్గాల బాధలను, అభిమానాన్ని, ఆశలను చక్కని, చిక్కని భావాలతో స్పష్టంగా, సూటిగా, చెంప చెళ్లుమనిపించేలా చెప్పడంలో ప్రభాకర్‌కు సాటి ఈనాటికి వేరెవరు లేరనడం అతిశయోక్తి కాదు. ఏ అవార్డులు ఆశించని నిర్మలత్వం అతనిది. ఏది ఆశించకుండా ఈ సమాజపు కర్కశత్వానికి బలైన నిజమైన ప్రజాకవి. ప్రభాకర్ కవితల్లా సరళమైన వ్యవహారిక భాషలో ఇంత చిన్నగా, ఇంత ఘాటుగా చెప్పిన కవులు ఆనాడు కాని ఈనాడు కాని లేరనడంలో తప్పులేదు. వేమన, తరువాత శ్రీశ్రీ, ఆ తరువాత ప్రభాకర్ కవితలే ఎక్కువగా అందరు కోట్ చేస్తారు. అభిజాత్యాలకు పోకుండా తన మనసులోని భావాన్ని చెపుతూ, ఎదుటివారి హృదయాన్ని కరిగించి, కన్నీటిని తెప్పించే కవితలెన్నో అక్షరాన్ని కనిపించని భావజ్వాలలతో కనిపించే దోపిడీని, అణచివేతను తుదముట్టించాలనే సందేశం యువతకు ఇస్తాడు.

సాహిత్యం అంటే జాతిని జాగృత పరచే చైతన్య గీతాలని, మనిషికి కావాల్సిన, మనిషి పుట్టుకతో తెచ్చుకొన్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, జీవిత సాఫల్యానికి, ఎదుగుదలకు, ప్రేమకు, మానవత్వానికి, జీవితంలో అన్నింటికీ సాహిత్యమే ఆధారమని, ప్రధానమని నమ్మిన కవి, తాత్వికుడు, స్వాప్నికుడు అలిశెట్టి ప్రభాకర్. సాహిత్యమే మనకు తాత్విక భూమికను ఇస్తుందని, అందులోనుండే మనిషి ఎదుగుదల ఉంటుందని, సాహిత్యానికి సామాజిక స్పృహ లేకుంటే యనుపోతును కట్టేసి పాలు పితకడానికి ప్రయత్నించడం లాంటిదేనని భావించాడు. సాహిత్యకారులలోని దిగజారుడుతనాన్ని ఆకళింపు చేసుకొని, వారిని దూరం చేసుకోవడానికి కూడా వెరవని ధీశాలి. యువత రాజకీయ నాయకుల శుష్క వాగ్దానాలకు లొంగిపోకుండా, విచక్షణతో తమ హక్కులకై పోరాడాలని, మనిషి మరో మనిషిని చూసి భయపడడం ఎందుకో తెలియని ఈ దుస్థితినుండి మారి, తన తోటివారిని ప్రేమించాలని ఉద్బోధిస్తాడు. తన జీవితాన్నే కొవ్వొత్తిగా చేసి, తన ఆశలనే చమురుగాచేసి, నిర్విరామంగా సమాజంలోని పేద కార్మిక, కర్షక, శ్రామిక వర్గాల గోసను, భాషను, మానసిక సంవేదనను, ఆవేదనను తన రచనలలో వెల్లడించాడు. తన కవితలోని ప్రతి అక్షరం ఆ నిజమైన మనిషి ఆనందం కొరకు, అతని బాధలకు మందులా మారాలనే తపనలోనే అతని జీవితం గడిచింది. అక్షర జ్ఞానం ఉన్న ప్రతివాడు తన జ్ఞానాన్ని తోటివాడి బాధలను తీర్చడానికి, సామాన్యుని పక్షాన నిలబడి సమాజంలోని అన్నివర్గాల అభ్యున్నతికి తోడ్పడాలని, అదే జీవిత సాఫల్యమని, అదే మనిషి ఆశయంగా, లక్ష్యంగా ఉండాలని ఆశించిన ఆశాజీవి. జీవితం మాత్రం అర్థాంతరంగా ముగిసిపోయింది.

- సిహెచ్‌వి ప్రభాకర్‌రావు, 9391533339

తెలుగు సాహిత్యంతో ధర్మపురి బాంధవ్యం

భూషణ వికాస శ్రీధర్మపుర నివాస దుష్టసంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరుడు, స్థానికుడు శేషాచలదాసు రచించిన నరసింహ శతకంలోని పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని తెలుగువాడుండడంటే అతిశయోక్తి కాదేమో. కరీంనగరంకు 71 కి.మీ.ల ఉత్తరాన, జిల్లా కేంద్రమైన జగిత్యాలకు 27 కి.మీ.ల ఈశాన్యాన, తెలుగునాట సుప్రసిద్ధ ప్రాచీన పుణ్య క్షేత్రంగా, దక్షిణ కాశిగా, హరిహర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో నొకటిగా పేరెన్నికగని పవిత్ర గోదావరి తీరాన వెలసిన ధర్మపురి క్షేత్రానికి తెలుగు భాష, సాహిత్యాలతో అవిభక్త బాంధవ్యం ఉంది. బ్రహ్మాండ, స్కాంద పురాణాలలో, బౌద్ధ, జైన వాఙ్మయాలలో, మడికె సింగన పద్మపురాణోత్తర ఖండంలో, చరికొండ ధర్మన చిత్రభారతంలో, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో, ఏకామ్ర నాథుని ప్రతాపరుద్ర చరిత్రలో, నృసింహదాసు మైరావణ చరిత్రలో, పింగళి సూరనార్యుని కళాపూర్ణోదయంలో, పోతనామాత్యుని నారాయణ శతకంలో, శేషప్ప విరచిత - నరహరి, నృసింహ, నృకేసరి శతక త్రయంలో, కాకతీయానంతర శాసనాలలో, మధ్యయుగ దానపత్రాలలో, ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసింపబడింది. ధర్మపురి క్షేత్రం మొదట జైన, బౌద్ధ యుగములందు ఆర్షవిద్యా ప్రచార కేంద్రమై, విదర్భరాజ్య పోషణలో మున్యాశ్రమంగాయుండి, తర్వాత శాతవాహన, బాదామి చాళుక్య, రాష్ట్రకూట, కల్యాణి చాళుక్య, కాకతీయ, రేచర్ల వెలమల మరియు నైజాం రాజుల ఏలుబడిలో అద్వితీయ వైభవాన్ని అనుభవించింది. స్థానిక ప్రాచ్య డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ సంగనభట్ల నర్సయ్య విశేష పరిశోధనలు చేశారు.

బోధన్ వాస్తవ్యులు భవభూతి ఉత్తర రామచరితలో ధర్మపురి గోదావరిని వర్ణించారు. కన్నడ ఆదికవి పంపమహాకవి ఇమ్మడి అరికేసరి ద్వారా ధర్మపురి అగ్రహారాన్ని దానంగా పొందడంతో కన్నడ సాహిత్య చరిత్ర గ్రంథాలలో ధర్మపురి చోటు చేసుకుంది. 1290లో చతుర్వర్గ చింతామణి విరచించిన దేవగిరి యాదవరాజు వద్ద మంత్రిగా పని చేసిన హేమాద్రి ధర్మపురి వాడనని చెప్పుకున్నాడు. రామగిరిని పాలించిన ముప్ప భూపాలుని కొలువున గల కందనామాత్యునికి మడికె సింగన పద్మపురాణం (ఉత్తర ఖండం)ను అంకితమీయగా, కేసన మంత్రి ధర్మపురిలో అన్నసత్రం ప్రారంభించారని, స్వామికి ఉత్సవాలు చేయించారని పేర్కొన్నారు. కాసె సిద్దప్ప రాసిన సిద్దేశ్వర చరిత్రలో ధర్మపురి, నందగిరి రాజ్యాలను సోమేంద్రుడు, విజయార్కుడు పాలించారని పేర్కొన్నారు. ఏకామ్రనాథుడు ప్రతాపరుద్ర చరిత్రలో గోదావరి తీర ధర్మపురిని, సమీప రాజ్యాలను స్పృశించారు. దక్షిణామ్నాయ శృంగేరీ 12వ పీఠాధిపతి, కవి, దర్శన గ్రంథకర్త, విజయనగర సామ్రాజ్య నిర్మాత విద్యారణ్య స్వామి ధర్మపురిలో వేదాధ్యయనం చేసినట్లు, సామ్రాజ్య స్థాపనా సమయాన ధర్మపురి నుండి చతుర్వేద పండితులను తీసుకెళ్ళినట్లు కథనాలున్నాయి. పరమ భాగవతోత్తముడు బమ్మెర పోతన నరసింహునిపై ధర్మపురి లక్ష్మీనాథ నారాయణా అనే మకుటంతో నారాయణ శతకం లిఖించారు.

కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక కథా ప్రబంధంలో 21వ కథలో ధర్మపురిని పేర్కొన్నారు. ధర్మపురి వాసియైన తొలి ప్రబంధ కర్త చరికొండ ధర్మన్న చిత్ర భారతాన్ని, అందులో ఆశ్వాసాది పద్యాలు ధర్మపురి స్వామిపై రాసారు. పింగళి సూరనామాత్యుడు కల్పిత కావ్యమైన కళాపూర్ణోదయంలో గోదావరీ సరిత్సమీప పరిదృశ్యమాన ధర్మపురీ నామ నగర మని వివరించారు. కాకుస్తం శేషప్ప నరసింహ, నృకేసరి, నరహరి శతకాలను, ధర్మపురి రామాయణ యక్షగానం, ధర్మపరి వాసియైన కాకుత్సం నరసింహదాసు శ్రీకృష్ణ శతకం, మైరావణ చరిత్రలు యావదాంధ్ర దేశ సుప్రసిద్ధాలే. చాత్తాడ జగ్గయ్య ధర్మాంగద బతుకమ్మ పాట జానపద గేయంగా సుపరిచితమే. విశ్వనాథ సత్యనారాయణ తమ మ్రోయు తుమ్మెదలో ధర్మపురి, గుండి రాజన్న శాస్త్రిలను పేర్కొన్నారు. కోరుట్ల కృష్ణమాచార్యులు ధర్మపురి నారసింహుని సుప్రభాతాలు రాసారు.

వి.ఎల్.ఎన్.శాస్త్రి, కొరిడె రామయ్య, కాకెర్ల కిష్టయ్య, సంగనభట్ల రామకిష్టయ్య, జనమంచి నర్సయ్య, గొల్లపెల్లి రాంకిషన్ (రాఖీ), ఒజ్జల నర్సయ్య, గుండి రాంకుమార్ శతకాలు, చెన్నమనేని జగన్నాథరావు ధర్మపురి నృసింహ స్తవం, అనంతయ్య లక్ష్మీనరసింహ చతుశ్శతి, కవి గణపతి రాంచందర్‌రావు లక్ష్మీ నరసింహ మద్యాక్కర శతకం, కొరిడె రాజన్న శాస్త్రి సుప్రభాతం ధర్మపురి కీర్తి చంద్రికలను దశదిశలా వ్యాపింప చేశాయి. గుండి శ్రీనివాస్, మాడిశెట్టి శ్రీనివాస్, రాఖీ కవితలు పండిత ప్రశంసాపాత్రతకు నోచుకున్నాయి.

- సంగనభట్ల, 9440595494

ఐదేళ్లలో ఎన్నో అద్భుతాలు



- భారత్‌కు ఆర్థిక పుష్టి
- ద్రవ్యోల్బణం తగ్గింది.. వృద్ధి వేగం పెరిగింది
- అంతటా విద్యుత్ వెలుగులే
- ప్రధాని మోదీ స్పష్టీకరణ

ముంబయి, జనవరి 20: ఆర్థికంగా బలహీనమైన ఐదు దేశాల నుంచి ఇప్పుడు భారతావనీ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందిందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం ఇక్కడ మాట్లాడిన మోదీ దేశ ఆర్థిక వ్యవస్థ గురించి ఈ నాలుగున్నర ఏళ్లలో సాధించిన విజయాలపై ప్రసంగించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో 'ఐదేళ్ల సవాళ్లు' అన్న చర్చ నేపథ్యంలో మోదీ మాట్లాడారు. గతంలో కుంభకోణాలతోనే భారత ప్రభుత్వాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల ప్రధాన శీర్షికలకు ఎక్కేవన్న మోదీ 'ఇప్పుడు భారత్ పథకాలు, అభివృద్ధి గురించి అన్ని దేశాలూ శ్లాఘిస్తున్నాయి' అని అన్నారు. కుంభకోణాల గురించి ఎక్కడా చర్చేలేదని భారత్ అభివృద్ధిపైనే అన్ని దేశాలూ దృష్టిపెట్టాయని తెలిపారు. ఈ ఐదేళ్ల కాలంలో స్కామ్‌ల నుంచి కొత్త స్కీమ్‌లకు భారత్ ఎదిగిందని అన్నారు. కుంభకోణాలతో పాటు విద్యుత్ కొరత, ఆర్థిక సంక్షోభాలే సమస్యలుగా ఒకప్పుడున్న భారతావని ఇప్పుడు అన్ని విధాలుగా అభివృద్ధితో కూడిన పరివర్తనను సాధించిందని తెలిపారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా భారత్ పట్ల నమ్మకం, విశ్వసనీయత పెరిగాయన్నారు.

ఒకప్పుడు అత్యంత ప్రబలంగా ఉన్న మావోయిస్టు హింసాకాండ ప్రభుత్వ చర్యల కారణంగా అదుపులోకి వచ్చిందని కేవలం కొన్ని జిల్లాలకే పరిమితమైందని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో ప్రజల సహకారం, భద్రతాదళాల సాహసంతోనే మావోలపై విజయం సాధించగలిగామని పేర్కొన్నారు. అలాగే ఒప్పుడు టాయిలెట్లు అన్నవే ఉండేవి కాదని, కాని ఇప్పుడు తొమ్మిది కోట్ల టాయిలెట్లను నిర్మించామని వెల్లడించారు.అలాగే పారిశుద్ధ్యాన్ని 38 శాతం నుంచి 98 శాతానికి విస్తరించామని మోదీ తెలిపారు. ఉత్తరాది గ్రిడ్ విఫలమైతే దాదాపు 30 కోట్ల ప్రజలకు విద్యుత్ ఉండేది కాదని గుర్తుచేసిన ప్రధాని ప్రస్తుతం పరిస్థితి మారిందని, విద్యుత్ సమస్యను తీర్చడంతోపాటు కొన్ని కోట్ల గృహాలకు కనెక్షన్లు కల్పించామని తెలిపారు. అలాగే అత్యధిక ద్రవ్యోల్బణం, కనిష్ఠ వృద్ధితో సమతమైన భారత్ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు అన్ని విధాలుగా పుంజుకుందని, ద్రవ్యోల్బణాన్ని అదుపుచేయడంతోపాటు ఉన్నత స్థాయిలో వృద్ధిని సాధించగలిగిందని తెలిపారు. ఇవన్నీ కూడా ఈ నాలుగున్నరేళ్ల బీజేపీ కాలంలోనే సాధ్యమయ్యాయని ఆయన చెప్పారు.

దేశీయంగా రక్షణ ఉత్పత్తులు



తమిళనాడులో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ప్రారంభిస్తున్న నిర్మలా సీతారామన్

తిరుచనాపల్లి, జనవరి 20: దేశీయ రక్షణ పరికరాల ఉత్పత్తుల తయారీ ప్రోత్సాహకంలో భాగంగా తమిళనాడు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను దేశ రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రారంభించారు. 3,038 కోట్లను పెట్టుబడిగా పెడుతున్న ఈ కారిడార్‌లో ప్రధానంగా ప్రభుత్వరంగ సంస్థలైన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వరుసగా 2కోట్లు, 3-5 కోట్లు, 140.5 కోట్లు, 150 కోట్లు పెట్టుబడి పెడుతుండగా, ప్రైవేట్ కంపెనీలైన టీవీఎస్, డాటా పాటర్న్, ఆల్ఫా డిజైన్స్ 50, 75, 100 కోట్లను పెట్టుబడులుగా పెట్టనున్నాయి.

ప్రముఖ అంతర్జాతీయ రక్షణ సంస్థలలో ఒకటైన లాక్‌హీడ్ మార్టిన్ కూడా ఈ కారిడార్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిగా ఉన్నట్టు ప్రకటించింది. ఈ డిఫెన్స్ ఇండస్ట్రీ కారిడార్ ఏర్పాటుకు మంచి స్పందన వస్తోందని, ప్రస్తుతం చెన్నై, హోజూర్, సేలమ్, కోయంబత్తూరు, తిరుచరాపల్లి కేంద్రాలుగా కార్యకలాపాలను కొనసాగిస్తుందని, అయితే దీనిని పాలక్కాడ్ వరకు విస్తరించాలని పలు విజ్ఞప్తులు వస్తున్నాయని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ ఐదు నగరాలకే ఈ కారిడార్ విస్తరించి ఉంటుందని స్పష్టం చేసినట్టు ఆమె చెప్పారు.

ఈ డిఫెన్స్ కారిడార్‌లను ఒక ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేశామని, దీంతో రక్షణ పరికరాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. వివిధ రక్షణ పరికరాల యూనిట్‌లతో అనుసంధానం చేయడానికే ఈ కారిడార్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కాగా, దేశీయంగా రక్షణ ఉత్పత్తులను తయారు చేయానికి దేశంలో రెండు డిఫెన్స్ కారిడార్లను ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గత ఏడాది ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశం సందర్భంగా ప్రకటించిన మేరకు తమిళనాడులో రక్షణ పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 500 పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, మంత్రులు, అధికారులు, తమిళనాడు రక్షణ అధికారులు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

ముగిసిన శబరిమల యాత్ర

'అయినా తగ్గని రాజకీయ వేడి..'

శబరిమల/తిరువనంతపురం, జనవరి 20: పర్వదినాలు ముగియడంతో శబరిమల స్వామి అయ్యప్ప దేవాలయాన్ని ఆదివారం పూజలు అనంతరం మూసివేశారు. గత రెండు నెలలుగా 10-50 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళల ప్రవేశాన్ని నిరసిస్తూ ఇక్కడ జరిగిన ఆందోళనలు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. శబరిమల ఆలయంలో మహిళలపై ప్రవేశంపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని రాష్ట్రప్రభుత్వం, ఈ సంప్రదాయాన్ని ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదంటూ ఆందోళనకారులు గత రెండు నెలలుగా సచివాలయం ఎదుట దీక్షలు చేశారు. శబరిమల ఆలయం పరిసరాల్లో పెద్ద ఎత్తున పోలీసుల భద్రతను ఏర్పాటు చేసి ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. శబరిమల కర్మ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు పెద్దఎత్తున సాగాయి.

కాగా పందలం రాజకుటుంబీకుడు పి రాఘవ వర్మ పూజలు నిర్వహించిన తర్వాత ఆదివారం ఉదయం 6.15 గంటలకు దేవాలయాన్ని అర్చకులు మూసివేశారు. హరివరాసనం అంటూ భక్తితో భక్తులు గీతాలను ఆలపించారు. 67 రోజులపాటు జరిగిన శబరిమల యాత్ర ఆదివారంతో ముగిసినట్లు అర్చకులు ప్రకటించారు. ఫిబ్రవరి 13వ తేదీన ఆలయాన్ని మళ్లీ తెరుస్తారు. గత ఏడాది సెప్టెంబర్ 28వ తేదీన సుప్రీం కోర్టు శబరిమల ఆలయంలో 10-50 సంవత్సరాల మధ్య ఉన్న మహిళలు ప్రవేశానికి అర్హత ఉందని తీర్పు ఇచ్చింది. దీంతో సనాతనవాదులకు, ప్రభుత్వానికి మధ్య ఘర్షణ తలెత్తింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సనాతన వాదుల వాదనలను బలపరిచాయి. ఆందోళనకారుల నిరసనలను సైతం లెక్కచేయకుండా కనకదుర్గ, బిందు అనే యుక్త వయస్సులోన్న మహిళలు శబరిమల ఆలయంలోకి వెళ్లి దర్శనం చేసుకోవడం విశేషం. దాదాపు 51 మంది మహిళలకు దర్శనం కల్పించినట్లు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది.

నా వయసు తగ్గించేశారు!

- అఫిడవిట్‌లో 48గా పేర్కొన్న కేరళ సర్కార్: చందిర సుందరం

చెన్నై, జనవరి 20: శబరిమల ఆలయంలో ప్రవేశించిన దర్శనం చేసుకున్న తమిళనాడుకు చెందిన ఒక మహిళ వయస్సుపై ఆసక్తికరమైన మలుపు తిరిగింది. శబరిమల ఆలయాన్ని 10-50 సంవత్సరాల మధ్య ఉన్న 51 మంది మహిళలు సందర్శించుకున్నారని కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఈ జాబితాలో తన పేరు ఉందని, కాని అఫిడవిట్‌లో పేర్కొన్నట్లుగా తన వయస్సు 48 కాదని, 62సంవత్సరాలని తమిళనాడు మహిళ పేర్కొన్నారు. తిరువణ్ణామలైకు చెందిన ఈ మహిళ పేరు చందిర సుందరం. తన పేరును పొరపాటున 50 సంవత్సరాలలోపు ఉన్న మహిళల జాబితాలో చేర్చారన్నారు. ఆదార్ కార్డులో తన వయసును పొరపాటున 1970 అని పేర్కొన్నారన్నారు. ఆదార్‌కార్డును ప్రామాణికంగా తీసుకుని తన వయసును 48 ఏళ్లుగా పేర్కొని ఉండవచ్చని ఆమె తెలిపారు. తమిళ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తనకు 54 ఏళ్ళు నిండినప్పటి నుంచి తాను శబరిమల యాత్ర చేస్తున్నానని చెప్పారు. గత ఎనిమిదేళ్లుగా తాను శబరిమల వెళుతున్నానన్నారు. తాను కొండ ఎక్కి ఆలయ దర్శనం చేసుకునేందుకు పోలీసులు సహకరించారన్నారు. పవిత్రమైన 18 మెట్లు ఎక్కేటప్పుడు కూడా పోలీసులు దగ్గరే ఉంది సహకరించారని చెప్పారు. గోవాకు చెందిన ఒక యువకుడు తన తల్లి వయసుస 52 ఏళ్లని, కాని 43 సంవత్సరాలని, ఆమె దర్శనం చేసుకున్న వారి జాబితాలో చేర్చారని తెలిపిన విషయం విదితమే. శబరిమల ఆలయాన్ని ఆదివారం పూజలు అనంతరం మూసివేసిన విషయం విదితమే.

మోదీకి ప్రత్యామ్నాయ నేత లేరు

- ఆయన లేకపోతే అంతా అస్తవ్యస్తమే
- కేంద్ర మంత్రి జావడేకర్



పుణెలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి జావడేకర్

పుణె, జనవరి 20: దేశంలో ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యామ్నాయం లేదని, ఆయన లేకపోతే అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని కేంద్ర మంత్రి ప్రకాష్ జావడేకర్ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ తృణమూల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం కోల్‌కతాలో జరిగిన విపక్షాల ర్యాలీ గురించి ఆయన ప్రస్తావిస్తూ వచ్చే ఎన్నికల్లో ప్రజలు బలహీనమైన ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారే తప్ప బలహీన ప్రభుత్వాన్ని కాదని అన్నారు. శనివారం జరిగిన ర్యాలీలో పలు పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారని, వారి ప్రధాన లక్ష్యం మోదీని గద్దెదించడమని, కాని వారిలో ఆయనకు ప్రత్యామ్నాయ నేత ఒక్కరైనా ఉన్నారా? అని ఆయన ప్రశ్నించారు. దీనిని బట్టి మోదీ లేకపోతే ఆయన స్థానాన్ని భర్తీ చేసేవారెవరూ లేరని అర్థమవుతోందని, ఆయన స్థానంలో మరెవరు వచ్చినా దేశంలో అస్థిరత, అస్తవ్యస్త పరిస్థితులు తప్పవని హెచ్చరించారు. గతంలో ఐకే గుజ్రాల్, చంద్రశేఖర్, హెచ్‌డీ దేవెగౌడ వంటి బలహీనమైన ప్రధానుల పాలనలో దేశంలో నెలకొన్న అస్థిరపరిస్థితులను ఆయన గుర్తు చేస్తూ, వారి పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. పటిష్టవంతమైన పాలనలో ఉన్న మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు కళ్లారా చూస్తున్నారని, ఇప్పుడు వారు బలమైన, బలహీన ప్రభుత్వ పాలనల మధ్య తేడాలను గుర్తించారని అన్నారు. కోల్‌కతా ర్యాలీతో విపక్షాల బలహీనత మరోసారి బయటపడిందని, ఇంతా చేసి వారు మేనిఫెస్టోను తయారు చేయడానికి ఒక కామన్ కమిటీని కాని, కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌ను కాని ఏర్పాటు చేయలేకపోయినా, ఈవీఎంల మీద విమర్శలు చేయడానికి మాత్రం అందరూ ఒక్కటయ్యారని విమర్శించారు. అవినీతికి పాల్పడని వారిని, అవినీతి లేని వ్యవస్థ ఉన్న మోదీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా తమకు ఓటు బ్యాంకు పెరిగినందున 2014 లోక్‌సభ ఎన్నికల కంటే ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో తమకు ఎక్కువ సీట్లు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో సాధించిన 282 సీట్ల సంఖ్యను తాము కచ్చితంగా దాటుతామని, ముఖ్యంగా తమకు ఒడిసా, పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో మునుపటి కంటే అధికంగా సీట్లు వస్తాయని ఆయన చెప్పారు. 'మేరా ఘర్- బీజేపీ కా ఘర్' నినాదంతో తాము పలు శిబిరాలను ఏర్పాటు చేస్తూ ప్రజల మధ్యలోకి దూసుకుపోతున్నామని ఆయన చెప్పారు.

డ్రీమర్లకు పౌరసత్వంపై భరోసా

- గోడ వివాదంపై ట్రంప్ ప్రతిపాదన
- తిరస్కరించిన డెమాక్రట్లు
- కొనసాగుతున్న ప్రతిష్టంభన



వాషింగ్టన్, జనవరి 20: మెక్సికో సరిహద్దు గోడ నిర్మించేందుకు కొత్త ప్రతిపాదనతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకు వచ్చారు. ఈ ప్రతిపాదన ప్రకారం దేశంలో సరైన డాక్యుమెంట్లు ఉద్యోగాలు చేస్తున్న ఏడు లక్షల మందికి సరైన రక్షణ చర్యలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాని ఈ ప్రతిపాదనను డెమాక్రట్లు తిప్పిగొట్టారు. 5.7 బిలియన్ డాలర్ల విలువ చేసే గోడ నిర్మాణానికి ఒప్పుకోమని వారు తెగేసి చెప్పారు. దీంతో గోడ వివాదంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. అమెరికాకు వెళ్లి ఆనందంగా జీవించాలన్న లక్ష్యంతో అక్రమంగా చొరబడి వచ్చి స్థిరపడిన వారిని డ్రీమర్స్ అంటారు. వీరికి పని చేసేందుకు రక్షణ ఉంటుంది. కాని పౌరసత్వం ఉండదు. వీరిని దేశం నుంచి ఉద్వాసన పలకకుండా ఇక్కడే ఉండేందుకు తగిన చట్టపరమైన భరోసా కల్పిస్తామిన ట్రంప్ హామీ ఇచ్చారు. అలాగే 805 మిలియన్ డాలర్లను ఖర్చుపెట్టి మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారిని ఆ వ్యసనం నుంచి విముక్తి చేస్తామన్నారు. త్వరలో తాను ఇమ్మిగ్రేషన్ విధానంలో సంస్కరణలు తెస్తానన్నారు. కాని ట్రంప్ ప్రతిపాదనలను హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ స్పీకర్ నాన్సీ పెల్సీ తిరస్కరించారు. ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీల మధ్య ప్రతిష్టంభన 29వ రోజుకు చేరుకుంది. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు వీలైనంత త్వరలో చర్యలు తీసుకోవాలని వివిధ వర్గాల నిపుణులు కోరుతున్నారు.

ప్రవాస భారతీయులకు కూడా ఓటు హక్కు

- వచ్చే రాజ్యసభ సమావేశాల్లో బిల్లు
- ఇప్పటికే ఆమోదించిన లోక్‌సభ

న్యూఢిల్లీ, జనవరి 20: వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ప్రవాసభారతీయులకు ప్రాక్సీ ఓటింగ్, సైన్యంలో పనిచేస్తున్న పురుష, మహిళా సైనికాధికారుల మధ్య తేడాలేకుండా వారి జీవిత భాగస్వాములకు ఓటు హక్కును కల్పించే బిల్లులకు ఆమోదం పొందేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. ఈ బిల్లులను లోక్‌సభ గత ఏడాది ఆగస్టులో ఆమోదించింది. రాజ్యసభ ఆమోదం లభించాల్సి ఉంది. ఈసారి అన్ని పెండింగ్ బిల్లులను ఆమోదించేందుకు కేంద్రం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని రాజ్యసభ వర్గాలు తెలిపాయి. ప్రవాసభారతీయులకు కూడా ఓటు హక్కునుకల్పించాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. విదేశాంగ మంత్రిత్వశాఖ అంచనా ప్రకారం దాదాపు 3.10 కోట్ల మంది భారతీయులు విదేశాల్లో ఉంటున్నారు. వారికి ఈ ఓటింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించలేదు. కాని ప్రాక్సీ ఓటింగ్‌కు మొగ్గుచూపింది. ప్రాక్సీ అంటే వారి తరపున మరొకరు ఓటు వేయవచ్చు. ప్రస్తుతం ఆర్మీలో పనిచేస్తున్న పురుష జవాన్ల భార్యలకు ఓటు హక్కు ఉంది. మహిళలు కూడా సైన్యంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. వారి జీవిత భాగస్వాములకు ఓటు హక్కు లేదు. స్త్రీ, పురుషుల మధ్య తేడాను తొలగించి అందరికీ ఓటు హక్కును కల్పించాలని కేంద్రం భావిస్తోంది. వీరిని సర్వీసు ఓటర్లు అంటారు. ఈ కేటగిరీలో విదేశాల్లో రాయబార కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కూడా ఓటు హక్కు లభిస్తుంది.

నా సత్తా తగ్గలేదు

- మధ్యప్రదేశ్‌లో 27 స్థానాలూ బీజేపీకే
- మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్



ఢిల్లీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, జనవరి 20: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయినంత మాత్రాన తాను బలహీనపడినట్టు కాదని మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని, రాష్ట్రంలోని 29 స్థానాల్లో 27 చోట్ల బీజేపీ గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ అది ఏ క్షణంలోనైనా కూలిపోయే అవకాశం ఉందని అందుకు కారణం ఆ పార్టీకి 'తగిన మెజారిటీ' లేకపోవడమేనని చౌహాన్ స్పష్టం చేశారు. బీజేపీ యువమోర్చా విజయ్ సంకల్ప్ మహార్యాలీలో ఆదివారం ఇక్కడ మాట్లాడిన చౌహాన్ 'మామ బలహీనపడలేదు. మధ్యప్రదేశ్‌లో 2014 మాదిరిగానే ఈసారీ 27 లోక్‌సభ సీట్లను గెలుచుకుంటాం' అని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కావాలనుకుంటే బీజేపీ కూడా అత్తెసర మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగి ఉండేదని కానీ పూర్తి మెజారిటీ ఉంటేనే ప్రభుత్వ ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతోనే వెనక్కి తగ్గినట్టు శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. కోల్‌కతాలో జరిగిన విపక్షాల మహార్యాలీపై దుమ్మెత్తి పోసిన ఆయన 'అది అవకాశవాది పార్టీల సమూహం. ర్యాలీకి హాజరైన ఏ పార్టీలోనూ ఏకాభిప్రాయం లేదు. ఉమ్మడి నాయకత్వమూ లేదు' అని విమర్శించారు. బీజేపీకి నరేంద్ర మోదీ వంటి బలమైన నాయకత్వం ఉందని, ఆయన నాయకత్వంలోనే లోక్‌సభ ఎన్నికలను ధీమాగా ఎదుర్కొంటామని చౌహాన్ అన్నారు. విపక్షాల కలయికను పెళ్లికొడుకులేని పెళ్లిగా ఆయన అభివర్ణించారు.

దుస్తుల పరిమాణంలో ప్రామాణికత



గాంధీనగర్, జనవరి 20: దేశ ప్రజల ఆకృతికి తగినట్లుగా దుస్తుల సైజులు తీసుకువచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీ వెల్లడించారు. గుజరాత్‌లో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్‌లో ఆదివారం ఆమె పాల్గొని జౌళి రంగంలో సాధించిన ప్రగతిపై వివరించారు. దుస్తుల సైజుల్లో ప్రామాణికత పాటించడం పెద్ద సవాలేనని, భారతీయలకోసం ప్రత్యేక సైజుల్లో దుస్తులు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, యూరప్ దేశాలవారికి తగిన విధంగా మార్కెట్లో దుస్తుల సైజులున్నాయి.. అయితే మనవారికి తగినట్లుగా సైజులు లేవు. అందుకే 'సైజ్ ఇండియా' దిశగా ఇప్పుడు అడుగులు వేస్తున్నామని అన్నారు. జౌళి రంగంలో అభివృద్ధి సాధించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌కు రూ.1800 కోట్లు ఈ నాలుగున్నర ఏళ్ల కాలంలో విడుదల చేశారని, అలాగే ఈరంగంలో దాదాపు 30వేల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులు వచ్చాయని తెలిపారు.

శశికళకు జైల్లో వీఐపీ సదుపాయాలు



- ఐదు గదులు, ఒక వంటవాడు
- ఆర్‌టీఐ కార్యకర్త వెల్లడి

ముంబయి, జనవరి 20: కర్నాటక జైల్లో ఒక కేసులో శిక్షను అనుభవిస్తున్న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత స్నేహితురాలు శశికళకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు సమాచార హక్కు సామాజిక కార్యకర్త నరసింహ మూర్తి తెలిపారు. ఆమెకు వీఐపీ సదుపాయాలు లభిస్తున్నాయి. ఐదుగదులు శశికళకు కేటాయించారు. ప్రైవేట్ కుక్ కూడా ఉన్నారు. విజిటర్స్ ఎప్పుడైన శశికళను కలుసుకునే ఏర్పాట్లు ఉన్నాయి. 59 ఏళ్ల శశికళ అవినీతి కేసులో నాలుగేళ్ల శిక్షను అనుభవిస్తున్నారు. పారప్పన అగ్రహార జైల్లో శశికళకు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారని ఆయన చెప్పారు. జైలు అధికారులు అన్ని రకాల నిబంధనలకు తిలోదకాలిచ్చారన్నారు. నాలుగు గదుల్లో ఉన్న మహిళా ఖైదీలను ఇతర గదుల్లో సర్ది, మొత్తం ఐదుగదులను శశికళకు కేటాయించారు. 2017 ఫిబ్రవరి 14వ తేదీ నుంచి ఆమె జైల్లో ఉంటున్నారు.

కర్ణాటకంలో కొత్త మలుపు!


- రిసార్టులో ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య గొడవ
- దాడిలో గాయపడిన ఆనంద్ సింగ్
- ఆసుపత్రిలో చేర్పించిన నేతలు
- రాజకీయాలకు.. గొడవకు సంబంధం లేదు: కాంగ్రెస్

బెంగళూరు, జనవరి 20: కర్నాటక రాజకీయం రోజుకో మలుపుతిరుగుతోంది. బీజేపీ నుంచి తన ఎమ్మెల్యేలను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ రిసార్టుకు తరలించింది. రిసార్టులో ఇద్దరు ఎమ్మెల్యేలు ఘర్షణ పడ్డారు. దీంతో ఒక ఎమ్మెల్యేకు గాయమైంది. ఇదిలా ఉండగా సీఎల్‌పీ సమావేశానికి హాజరు కాని నలుగురు ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ పార్టీ నోటీసులు జారీ చేసింది. బళ్లారి జిల్లాకు చెందిన ఆనంద్ సింగ్, జేఎన్ గణేష్ అనే ఎమ్మెల్యేలు గత రాత్రి ఒక అంశంపై తీవ్రంగా వాగ్వాదానికి దిగారు. అనంతరం కొట్టుకున్నారు. జేఎన్ గణేష్ , సహచర ఎమ్మెల్యే ఆనంద్ సింగ్‌పై చేయి చేసుకున్నాడు. దీంతో ఆనంద్ సింగ్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు అసమ్మతి ఎమ్మెల్యేలు కావడం విశేషం. కాగా ఈ విషయాన్ని గోరంతలు కొండంతలు చేసి చూపించడం తగదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మధూయాష్కీ గౌడ్ చెప్పారు.

ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు వ్యాపార లావాదేవీపై మాటామాట అనుకున్నారన్నారు. రాజకీయాలతో ఈ గొడవకు సంబంధం లేదన్నారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు కలిసి భోజనం చేశారన్నారు. కాగా ఈ రిసార్టులో ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ జరిగిన విషయం తమకు తెలియదని బిదాడీ పోలీసు స్టేషన్ అధికారులు తెలిపారు. ఈగల్టన్ రిసార్టులో గొడవ సమాచారం తమకు అందలేదన్నారు. ఎవరూ కూడా ఫిర్యాదు చేయలేదన్నారు. కాగా ఎమ్మెల్యే చికిత్స పొందుతున్న ఆసుపత్రి వద్ద మాత్రం పోలీసు బలగాలను మోహరించారు. కాగా ఈ ఘటనపై బీజేపీ స్పందించింది. దాడిలో గాయపడిన ఆనంద్‌సింగ్ కోలుకోవాలని బీజేపీ ట్వీట్ చేసింది.

మోదీకి ఎదురుగాలే

- ఢిల్లీకి ఆయన చేసిందేమీ లేదు
- కాంగ్రెస్ పుంజుకుంటోంది
- పీసీసీ చీఫ్ షీలాదీక్షిత్ ధీమా



న్యూఢిల్లీ, జనవరి 20: గత నాలుగున్న ఏళ్లలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఢిల్లీకి చేసిందేమీ లేదని పీసీసీ అధ్యక్షురాలు షీలాదీక్షిత్ అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో మోదీ జనాకర్షక శక్తి ఏమాత్రం పని చేయదని ఆదివారం ఇక్కడ స్పష్టం చేశారు. 2014లో సాధించిన ఫలితాలు ఇక్కడ ఎంత మాత్రం ప్రతిఫలించే అవకాశం లేదని ఆమె తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు మోదీపట్ల తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం ఖాయమని దీక్షిత్ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ త్వరితగతిన పూర్వవైభవాన్ని సంతరించుకుంటోందని పేర్కొన్న ఆమె 'లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఆప్‌తో మేం ఎన్నికల పొత్తు కుదుర్చుకునే అవకాశమేలేదు'అని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంతమాత్రం విశ్వసనీయమైంది కాదని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ధ్వజమెత్తిన దీక్షిత్ ఇటీవల ఎంపీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ సాధించిన విజయంతో రాహుల్ నాయకత్వం పట్ల నేతలు, కార్యకర్తలో నమ్మకం పెరిగిందని అన్నారు.

రాహుల్‌లో ఓ బాధ్యతాయుతమైన నాయకుణ్ని అవసరాన్ని బట్టి కఠిన నిర్ణయాలు తీసుకోగల అధినేతను పార్టీ శ్రేణులు చూస్తున్నాయని తెలిపారు. దీని దృష్ట్యా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలను కనబరుస్తుందని 80ఏళ్ల షీలాదీక్షిత్ ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి వస్తుందా అన్న ప్రశ్నకు నేరుగా బదులివ్వకుండా'ఈ నాలుగున్నర ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత, తప్పుడు నిర్ణయాలకు దేశ ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారు'అని స్పష్టం చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఎవరూ ఊహించలేదని పేర్కొన్న ఆమె 'కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో ఆరితేరిన పార్టీ. ప్రగల్భాలు, ఆడంబరాలు ఈ పార్టీకి పట్టవు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధిస్తామన్న నమ్మకం మాకుంది'అని అన్నారు.

ఉంటే ఉండండి.. పోతే పొండి!

ఎమ్మెల్యే మేడాకు మంత్రి ఆది, శ్రీనివాసులురెడ్డి అల్టిమేటం

రాజంపేట, జనవరి 20 :"టీడీపీలో ఉండాలనుకుంటే ఉండండి.. పోవాలనుకుంటే పోండి.. అంతేకాని ఈ బూటకాలెందుకు.." అని మంత్రి ఆదినారాయణరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు రెడ్డి విప్ మేడా వెంకట మల్లికార్జునరెడ్డికి అల్టిమేటం జారీ చేశారు. కడప జిల్లా రాజంపేట పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మేడా తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సమావేశంలో కొందరి చేత అల్లర్లు చేయించినంత మాత్రాన ఇక్కడ ఎవరూ భయపడేవారు లేరన్నారు. పార్టీ మారాలనుకుంటే హుందాగా బయటకు వెళ్లిపోవాలి తప్ప సమావేశాల్లో అల్లర్లు సృష్టించేలా ప్రయత్నించకూడదన్నారు. గత ఆరేడు నెలలుగా మేడా వ్యవహారశైలితో పాటు పార్టీ మారతారంటూ ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీనిపై పార్టీ అధిష్ఠానం, తాము, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ ఈ ఆరోపణలకు తెరదించేలా గట్టిగా ఖండించాలని పలుమార్లు మేడాను కోరినా ఫలితం లేదన్నారు. ఈ నెల 17వ తేదీ మేడాను స్వయంగా తీసుకురమ్మని సీఎం చంద్రబాబు తమను కోరారని, అలాగే పార్టీ అధిష్ఠానంలో సన్నిహితంగా ఉండే ఓ నేత కూడా మేడాకు ఫోన్ చేసి రమ్మని చెప్పారన్నారు. ఈ మేరకు అతడు వెళ్లేందుకు విమానం టికెట్ కూడా బుక్ అయిందని, అయితే మేడా తొలుత వస్తానని చెప్పి ఆ తర్వాత పని ఉంది రాలేనని చెప్పడం దేనికి సంకేతమని వారు ప్రశ్నించారు. మీడియా సమావేశం ఉన్న విషయంపై కూడా మేడాకి తెలిపామని, అయినా ఆయన తనకు ఆహ్వానం లేదంటూ బుకాయించడం శోచనీయమన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి రోజున ఇక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి ఆ తర్వాత కడపకు వెళ్లి అక్కడ ఇతర



రాజంపేట ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడుతున్న మంత్రి ఆదినారాయణరెడ్డి, కడప టీడీపీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి

పార్టీల నేతలతో మంతనాలు జరపడం లాంటి చర్యలు పార్టీ వ్యతిరేక చర్యల కిందకు రావా? అని ప్రశ్నించారు. మేడా తండ్రి మేడా రామక్రిష్ణారెడ్డికి టీడీపీ తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడిగా అవకాశం కల్పించడంతో పాటు మొదటిసారి గెలిచినప్పటికీ మేడాకి విప్ పదవి కట్టబెట్టి ప్రాధాన్యత కల్పించిందన్నారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కూడా గతంలో కంటే తక్కువగా చేశారన్నారు. ఈ పరిస్థితిలో మేడాను ఎలా నమ్మాలని, అందుకే పార్టీ తరపున వివరణ ఇచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటుచేశామన్నారు. కాగా నెల 22వ తేదీ అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో జరగనున్న రాజంపేట నియోజకవర్గ స్థాయి సమావేశానికి పార్టీ కుటుంబ సభ్యులంతా హాజరవ్వచ్చున్నారు.

బాబుతో మాట్లాడాకే భవిష్యత్ కార్యాచరణ: మేడా

రాజంపేట, జనవరి 20 : టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబును కలిసిన తర్వాతే తన భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని విప్ మేడా వెంకట మల్లికార్జునరెడ్డి స్పష్టం చేశారు. విప్ మేడా ఆదివారం కడప జిల్లా రాజంపేట పట్టణంలోని తన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తాను పార్టీ మారతానంటూ వస్తున్న ఆరోపణలు, మంత్రి ఆదినారాయణరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో స్పందించారు. జిల్లా టీడీపీ నేతలు తనపై పార్టీ అధినేత చంద్రబాబుకి పచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. రాజంపేటలో మంత్రి, జిల్లా అధ్యక్షుడు మీడియా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తనకెలాంటి సమాచారం లేదన్నారు. టీడీపీకి వ్యతిరేకంగా పని చేసిన వారితో కలిసి వారు సమావేశం నిర్వహించారని విమర్శించారు. తనపై పార్టీలోని కొందరు నాయకులు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. 'ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం' అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజాసేవకు కట్టుబడి పని చేశానన్నారు. ఇక ఈ నెల 17వ తేదీ సీఎం చంద్రబాబును కలవాలని ఫ్లైట్ టికెట్ కూడా బుక్ చేసుకున్నానని, అయితే తమ బంధువులకు అనారోగ్యం కారణంగా వెళ్లలేకపోయానన్నారు. పార్టీ సభ్యత్వాలు తక్కువగా చేయడానికి పార్టీ కార్యకర్తలు ఆర్థికంగా బలంగా లేకపోవడమే కారణమన్నారు. జమ్మలమడుగులో మంత్రి ఆది కంటే రాజంపేటలో తానే అత్యధికంగా పార్టీ సభ్యత్వాలు చేయించానన్నారు.

సంస్థాగత నిర్మాణానికి జనసేన సన్నద్ధం

నేడోరేపో 25 లోక్‌సభ స్థానాలకు పార్టీ కమిటీలు

ఆంధ్రభూమి బ్యూరో


విజయవాడ, జనవరి 20: లోక్‌సభతో పాటు రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీకి సిద్ధమవుతుంటే అంతకన్నా వేగంగా వివిధ రాజకీయ పక్షాలు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తే రాష్ట్రంలో తెలుగుదేశం, వైకాపా, జనసేన పార్టీల మధ్య త్రిముఖ పోటీ అనివార్యంగా కనిపిస్తోంది. రాష్ట్ర విభజనతో మూల్యం చెల్లించుకున్న జాతీయ పార్టీ కాంగ్రెస్ తిరిగి ఉనికి కోసం సర్వశక్తులు ఒడ్డుతున్న దశలో తెలంగాణ ఎన్నికలు, జాతీయ రాజకీయాల దృష్ట్యా టీడీపీతో పొత్తు పెట్టుకోవటం ఖాయమని తెలుస్తోంది. మరోవైపు ఈ ఎన్నికల్లో చంద్రబాబును దెబ్బతీయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. టీడీపీ, వైకాపాలకు స్పష్టమైన మెజారిటీ రానిపక్షంలో వామపక్షాలతో కలిసి బరిలోకి దిగాలనుకుంటున్న జనసేన మద్దతు కీలకం కానుందనే ప్రచారం అప్పుడే మొదలైంది. అయితే సంస్థాగతంగా జనసేన పార్టీ నిర్మాణం జరగకపోవటం అతిపెద్ద లోటుగా కనిపిస్తోంది. ఇదే సమయంలో ప్రధాన ప్రతిపక్షం ఇంటింటికీ, గడపగడపకూ కరపత్రాల పంపిణీతో ప్రచారం సాగిస్తుంటే, జనసేన కొద్ది నియోజకవర్గాలు మినహా ఎక్కడా ప్రజల్లోకి వెళ్లిన దాఖలాలు కన్పించడం లేదు. పార్టీ ఫిరాయింపులను అనేక సందర్భంలో తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్న పవన్‌కళ్యాణ్ అధికారం దక్కకపోయినా నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడుతున్న వామపక్షాలతో కలిసి ఎన్నికలకు వెళ్లాలనే తుది నిర్ణయానికి వచ్చేశారు. 2014కు ముందే పార్టీని స్థాపించి అటు బీజేపీ, ఇటు టీడీపీకి మద్దతు పలికిన పవన్‌కళ్యాణ్, తరువాత మారిన రాజకీయ పరిణామాలతో తనంతట తానుగా చేనేత కార్మికులు, రాజధాని రైతులు, అగ్రిగోల్డ్ బాధితులు, ఉద్దానం కిడ్నీ బాధితులు.. ఇలా అనేకానేక సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో జనసేనకు అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలు మినహా తొమ్మిది జిల్లాలకు ఇద్దరేసి సభ్యులతో సమన్వయకర్తల నియామకం జరిగింది. రాష్ట్రస్థాయిలో దాదాపు 10మంది కన్వీనర్లు కొనసాగుతున్నారు. ఇక నేడోరేపో వెలువడబోయే 25 లోక్‌సభ స్థానాల కమిటీల కోసం పార్టీ శ్రేణులు ఎదురుతెన్నులు చూస్తున్నాయి.

వైకాపాకు వంగవీటి గుడ్‌బై

పదునైన పదజాలంతో నేరుగా జగన్‌కు రాజీనామా లేఖ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 20: తన తండ్రి, దివంగత శాసనసభ్యులు వంగవీటి మోహనరంగా ఆశయాల సాధనతో పాటు తన ఆకాంక్షలు నెరవేర్చుకోటానికి ఇక ఆంక్షలు లేని ప్రజాప్రయాణం కోసం వైకాపాకు రాజీనామా చేస్తున్నానని పార్టీ సీనియర్ నేత, మాజీ శాసనసభ్యుడు వంగవీటి రాధాకృష్ణ ఆదివారం ప్రకటించారు. ఈమేరకు నేరుగా వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి పదునైన పదాలతో ఆయన ఘాటైన లేఖ రాశారు. అన్నివర్గాల అభిమాన పాత్రుడు, సామాన్యుడి సంఘటితత్వానికి స్ఫూర్తిగా నిలిచిన తన తండ్రి వంగవీటి మోహనరంగా ప్రజాక్షేత్రంలో సామాన్యుల సంక్షేమం, పేదల సంరక్షణ కోసం ప్రాణాలర్పించారని రాధా పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాడటమే స్వర్గీయ వంగవీటి మోహనరంగా ఆకాంక్షగా పేర్కొన్నారు. మోహనరంగా గతంలో ఓ సందర్భంలో చెప్పిన మాటలను ఈసందర్భంగా తన రాజీనామా లేఖలో ఉటంకించారు. 'ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే మనస్తత్వం కాదు నాది. పోరాటమే నా ఊపిరి. అణచివేత విధానానికి, దమనకాండకు వ్యతిరేకంగా సర్వ ప్రజాసంక్షేమం కోసం, న్యాయ సంరక్షణ కోసం, వర్గాలకు అతీతంగా ఉద్యమం కొనసాగిస్తాను' అని తన తండ్రి రంగా తరచూ చెప్పే మాటలు తనలో ఎప్పుడూ మార్మోగుతుంటాయని



గుర్తుచేశారు. అందుకే ఆయన గతించి 30ఏళ్లయినా ఈనాటికీ ప్రజల గుండెల్లో నిలిచారని స్పష్టం చేశారు. ఆయన ద్వారా సంక్రమించిన పేదల అభిమాన స్ఫూర్తి, ఆయన ఆకాంక్షలకు అనుగుణంగా ఆశయాల్ని కొనసాగించే రీతిలో ఆంక్షలు లేని ప్రజాప్రయాణం సాగించాలన్నదే తన ఆకాంక్షగా రాధా తెలిపారు. మీకు ముఖ్యమంత్రి పదవి సాధించాలన్న ఆకాంక్ష ఉంటే పార్టీలోని మా అందరిపై ఆంక్షలు విధించడం ఏమిటంటూ జగన్‌ను రాధా ప్రశ్నించారు. అందుకే ఎలాంటి ఆంక్షలు లేని ప్రజాప్రయాణంతో తన ఆకాంక్షలు నెరవేర్చుకోదలిచానని లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈనేపథ్యంలో తాను వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని వంగవీటి రాధాకృష్ణ వివరించారు.

ఏపీలో నిరంతర విద్యుత్

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 20: ఆంధ్ర రాష్ట్రంలో 24 గంటలూ అంతరాయాల్లేని విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని రాష్ట్ర ఇంధన శాఖామంత్రి కిమిడి కళా వెంకట్రావు అన్నారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 13వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ఏయూ సిఆర్ రెడ్డి కాన్వొకేషన్ హాలులో జరిగాయి. మహాసభల్లో ముఖ్యఅతిథిగా మంత్రి కళావెంకట్రావు మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ నష్టాలను 15శాతం నుంచి 9.2 శాతానికి తగ్గించగలిగామని, దీనివల్ల రూ.360 కోట్ల మేర మిగులుతోందన్నారు. 20వేల మంది విద్యుత్‌శాఖ తాత్కాలిక ఉద్యోగుల వేతనాలను పెంచామన్నారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2018 విద్యుత్ సవరణ చట్టం గుదిబండగా మారిందన్నారు. క్రిమిలేయర్ ఎవరికీ లేదని, బీసీలకే ఇచ్చారని, దీనివల్ల విద్య, ఉద్యోగ అవకాశాలు రావడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. క్రిమిలేయర్‌ను రద్దు చేస్తే తప్ప బీసీలకు వాటా దక్కదన్నారు.

ఏపీట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు సంబంధించిన బీసీ విద్యుత్ సంక్షేమ సంఘానికి ఎక్కడా గజం స్థలం లేదన్నారు. పలు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీటిని మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా మంత్రి కిమిడి కళా వెంకట్రావును అసోసియేషన్ తరపున ఘనంగా సత్కరించారు. 2019 డైరీని మంత్రులు గంటా శ్రీనివాసరావు, కళావెంకట్రావు ఆవిష్కరించారు.

శరవేగంగా కోటిపల్లి-నర్సాపూర్ లైన్ పనులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 20: వరి, కొబ్బరి పంటలకు పేరుపొందిన కోనసీమ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద చెన్నై-కోల్‌కతా రైలుమార్గాన్ని అనుసంధానం చేసే కోటిపల్లి-నర్సాపూర్ కొత్త రైలుమార్గం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2000-11 ఆర్థిక సంవత్సరంలో రూ.2,012 కోట్ల అంచనాతో మంజూరైన 57 కి.మీల విడివి కలిగిన ఈ రైలుమార్గం నిర్మాణ పనులను రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించే ప్రగతి సమీక్ష సమావేశాల్లో సైతం ఈ ప్రాజెక్టు పురోగతిపై చర్చిస్తున్నారు. ఆంధ్ర ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం ఈ రైలు మార్గం. ఈ మార్గం కోనసీమకు సారవంతమైన భూములున్న గ్రామాల మీదుగా సాగుతుంది. అమలాపురం, పేరూరు, పాశర్లపూడి, జగ్గంపేట, రాజోలు పట్టణాలను కలుపుతుంది. 2014 నుంచి ఇప్పటివరకు రూ.325 కోట్లు ఖర్చయింది. ఈ ప్రాజెక్టు విజయవాడ - భీమవరం - నిడదవోలు బ్రాంచ్ లైన్‌కు సరికొత్త ప్రత్యామ్నాయం అవుతుంది. క్రమేణా ఈ మార్గం భీమవరం నుంచి నర్సాపూర్‌కు విస్తరిస్తుంది. నర్సాపూర్ - కాకినాడ రైల్వేలైన్‌తో అనుసంధానం అవుతుంది.



ఈ ప్రాంతంలో ఓఎన్జీసీ ద్వారా ఉత్పత్తి అయ్యే సహజ వాయువు ఆధారిత విద్యుత్ కేంద్రం, అనేక రిఫైనరీలు నిర్మితమవుతాయి. కాకినాడ నుంచి అమలాపురం, రాజోలు వంటి వాణిజ్య పట్టణాల మధ్య దూరం 45 కి.మీలు తగ్గిపోయి ప్రజలు గోదావరి నదిని పడవలో దాటాల్సిన అవసరం తప్పుతుంది. ఈ ప్రాజెక్టు మూడు దశల్లో పూర్తికానుంది. నర్సాపూర్ - చించినాడ (10 కి.మీ), కోటిపల్లి - అమలాపురం (12.70 కి.మీ), అమలాపురం - చించినాడ (33.88 కి.మీ) మార్గాలు ప్రధానమైనవి. గౌతమీ నదిపై పెద్ద వంతెన నిర్మాణానికి 2017 నవంబర్ 8న టెండర్లు వేయగా 2018 మే 25న వైనతీయ వశిష్ట సంస్థ టెండర్ దక్కించుకుంది. ప్రస్తుతం భూసేకరణ జరుగుతోంది. మొత్తం 9080 ఎకరాలు కావాల్సి ఉండగా తూ.గోదావరిలో 791, ప.గోదావరి జిల్లాలో 276 ఎకరాల భూమిని ఇప్పటికే ప్రభుత్వం రైల్వే శాఖకు ఇచ్చింది. ఈ రైలుమార్గం గౌతమీ, వైనతీయం, వశిష్ట నదుల మీదుగా సాగుతుంది. అమలాపురం నుంచి కొబ్బరి, వరి, చేప ఉత్పత్తులు భారీగా చెన్నై, లేదా కోల్‌కతాకు, ఉత్తర భారత ప్రాంతాలకు ఎగుమతి చేసే సదుపాయం లభిస్తుంది. ప్రముఖ పుణ్యక్షేత్రం అంతర్వేది రాజోలుకు దగ్గరలోనే ఉండటం వల్ల దీని ప్రాధాన్యత కూడా మరింతగా పెరగనుంది.

1వ పేజీ తరువాయి

నమ్మకాన్ని నిలబెడతాం

వీటిని పూర్తి చేయాలని అనుకోవడం లేదని ఆయన చెప్పారు. వీటికి కొంత సమయం పడుతుందని ఎన్నికల సభల్లోనే ప్రజలకు చెప్పానని కేసీఆర్ గుర్తుచేశారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ హయాంలో చేపట్టిన గృహ నిర్మాణ పథకాల లెక్కలు చూస్తే ఇక రాష్ట్రంలో ఎవరికి ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కాగితాల మీదనే తప్ప క్షేత్రస్థాయిలో అవీ లేవన్నారు. ఒక మంథని నియోజకవర్గంలోనే ఇళ్లు అవసరమున్న వారి కంటే 140 శాతం ఎక్కువగా ఇళ్లు ఇచ్చినట్టు రికార్డుల్లో ఉందన్నారు. తమ ప్రభుత్వంలో ఇలాంటి కుంభకోణాలకు, లంభకోణాలకు తావు లేదన్నారు. లబ్దిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరిగేందుకు అధికారులకే ఆ పని అప్పజెప్పామన్నారు. అందరూ ఇళ్లు లేని వారే కావడంతో పూర్తి అయిన ఇళ్లను లాటరీ పద్ధతిలో కేటాయిస్తామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో చేపట్టిన ఇళ్ల కోసం లబ్ధిదారుల నుంచి కూడా వాటా వసూలు చేశారన్నారు. కానీ తమ ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో ఈ పథకాన్ని చేపట్టిందన్నారు. గతంలో ఈ పథకం కింద లబ్ధిదారులు చెల్లించాల్సిన రూ. 4 వేల కోట్ల బకాయిలను కూడా తమ ప్రభుత్వం రద్దు చేసిందని సీఎం గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాకుండా సొంత స్థలంలో నిర్మించుకోవడానికి ముందుకొచ్చే వారికి కూడా ఐదు నుంచి ఆరు లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాస్తవానికి ఎంత మందికి ఇళ్లు అవసరమో పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాక పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లను భాగస్వామ్యులను చేసి సర్వే జరిపిస్తామని సీఎం వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం మిషన్ భగీరథ పథకం పూర్తి చేశామన్నారు. వచ్చే నలబై ఏళ్లను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ప్రణాళిక ప్రకారం 23 వేల 968 ఆవాసాలకు, 142 మున్సిపాల్టీలకు మంచినీటిని అందించే పథకం పూర్తి అయిందన్నారు. 23 వేల గ్రామాలకు మంచినీరు చేరినా ఇంకా ఇంటింటికి నల్లాలు బిగించే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటికే 18 వేల గ్రామాల్లో ఈ కార్యక్రమం పూర్తి అయిందన్నారు. మార్చి 31 నాటికి వందకు వంద శాతం ఇంటింటికి నీళ్లు ఇచ్చి తీరుతామన్నాని చంద్రశేఖరరావువెల్లడించారు.

వారిది ధనశక్తి.. మనది జనశక్తి

విద్యాసంస్థల్లో 10 శాతం రిజర్వేషన్ల శాతం కల్పిస్తూ తమ ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు విపక్షాలకు నిద్ర లేకుండా చేస్తోందని ప్రధాని మోదీ విమర్శించారు. తాము తీసుకున్న నిర్ణయం సరైనది కాకపోతే వీరికి నిద్ర ఎందుకు పట్టదని ఆయన ప్రశ్నిస్తూ, ఈ నిర్ణయంతో ఏమీ చేయలేని విపక్షాలు దానిపై దుష్ప్రచారాన్ని మొదలుపెట్టాయని ఆరోపించారు. దీంతో రిజర్వేషన్లు పొందేవారికి నష్టం జరుగుతుందన్న వాదనను ఆయన కొట్టివేస్తూ అందుకే ఆయా విద్యాసంస్థల్లో పది శాతం సీట్లను పెంచుతూ ఆదేశాలు జారీ చేశామని, దీనివల్ల ఏ వర్గానికీ నష్టం జరగదని ఆయన స్పష్టం చేశారు. కొత్తగా ప్రవేశపెట్టిన రిజర్వేషన్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీలపై ఎలాంటి ప్రభావం చూపదని ఆయన అన్నారు. అంతేకాకుండా కొత్తగా అవకాశాలు కూడా వస్తాయన్నారు. రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పలువురు నిపుణులతో చర్చించిన తర్వాతే ఈ పది శాతం రిజర్వేషన్‌ను ప్రకటించామని మోదీ తెలిపారు. గతంలో పాలించిన ప్రభుత్వాలేవీ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం చేయలేదని, అయితే తాము చేసి చూపించామని ఆయన పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే తానీ నిర్ణయాన్ని ప్రకటించినట్టు కొన్ని విపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, అసలు ఈ దేశంలో ఎన్నికలు లేనిదెప్పుడని ఆయన ప్రశ్నించారు. ఇదే నిర్ణయాన్ని కనుక తాను మూడు నెలల ముందు తీసుకుంటే ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తాను రిజర్వేషన్లను ప్రకటించానని ఈ విపక్షాలు విమర్శించి ఉండేవని మోదీ అన్నారు.

ఇప్పుడైనా చెపుతారా?

రాలేదని, దాంతో వేలాది మంది రైతులు నెలల తరబడి మక్కలను అమ్ముకోకుండా ఆగాల్సి వచ్చిందన్నారు. రైతుల సంక్షేమం కోసం 'మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్' ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు ఎలాంటి లాభం జరగలేదని టీఆర్ఎస్ చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ, భారీగా రుణమాఫీ చేశామని, రుణమాఫీ జరగని రైతులకు ఐదువేల రూపాయల ఆర్థిక సాయం చేశామన్నారు. డబల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం గురించి చెబుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకంలో ఇళ్ల నిర్మాణం ఆగిపోయిందని, బిల్లులు చెల్లించకపోవడమే కారణమని ఆరోపించారు. భూపాల్‌పల్లిలో 500 ఇళ్ల నిర్మాణం తుదిదశలో నిలిచిపోయిందని వివరించారు. ప్రకృతివైపరీత్యాల సందర్భంగా ఇళ్లకు నష్టం జరిగితే నష్టపరిహారం చెల్లించడం లేదని, ఈ విషయంలో ప్రభుత్వ సానుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. నిరుద్యోగభృతి ఎప్పటి నుండి ఇస్తారో, పింఛన్ల పెరుగుదల ఎప్పటి నుండి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. దవాఖానాలకు భవనాల నిర్మాణం చేసిన తర్వాత సిబ్బందిని నియమించాలని, మౌలికసదుపాయాలు కల్పించాలని కోరారు. ఇటీవల చేపట్టిన కంటివెలుగులో వరంగల్ జిల్లాలో చాలామందికి కంటి చూపు పోయిందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయోఃపరిమితి పెంపుదల ఎప్పటి నుండి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. పోడువ్యవసాయం చేస్తున్న గిరిజనులను అటవీ అధికారులు వేధిస్తున్నారని, ఈ వేధింపులను ఆపివేయాలని డిమాండ్ చేశారు.

ఎగసిపడిన 'భగీరథ'

రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చాలా మంది ఈ దృశ్యాన్ని సెల్ఫీగా తీసుకోవడం కనిపించింది. ఇది ఇలా ఉండగా సాయంత్రం వరకు నీరంతా కూడా వృద్ధాగానే పారుతుండటం జరిగింది. పైపులు పగిలిన విషయాన్ని గ్రామస్తులు మండల తహశీల్దార్‌కు సమాచారం ఇవ్వగా వెంటనే పోలీసులకు తెలపడంతో పోలీసులు అక్కడికి చేరుకొని గుమికూడిన ప్రజలను పక్కకు పంపించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. పైపులు పగిలిన విషయాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు తెలపడంతో మిషన్ భగీరథ ద్వారా కల్వకుర్తి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే నీటి పంపింగ్‌ను ఆపయడంతో రాత్రి ఏడు గంటల ప్రాంతంలో నీరు పారడం ఆగిపోయింది. ఇది ఇలా ఉండగా మిషన్ భగీరథ పథకం కింద వేసిన పైపులు నాసిరకంగా ఉండటం వల్లనే ఈ ఘటన జరిగిందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. 10ఫీట్ల వ్యాసంతో ఉన్న ఈ పైపుల ద్వారా హైదరాబాద్‌కు పంపింగ్ చేయడం జరుగుతుందని, ఇట్టి పైప్‌లైన్ నిర్మాణం విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని, మున్ముందు ఇలాంటి ఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మిషన్ భగీరథ పైపులు పగిలిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తొలి విడత పోలింగ్ నేడు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దాదాపు 26 వేల మంది పోలీసులు బందోబస్తు డ్యూటీలో ఉంటారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరారు. బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను తీసుకుని వెళ్లిన సిబ్బందికి పోలీసు అధికారులు పూర్తి రక్షణ ఏర్పాటు చేశారు.

వైఎస్ ఆరోగ్యశ్రీ బెటర్

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చకు సీఎం కేసీఆర్ సమాధానం ఇస్తూ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ చాలా మంచి పథకం కావడం వల్లనే ఎలాంటి మార్పులు లేకుండా తమ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. వైఎస్ హయాంలో 108 సేవలు కొనసాగితే, దానికి అమ్మఒడిని తమ ప్రభుత్వం జోడించి కొనసాగిస్తోందని చంద్రశేఖరరావుపేర్కొన్నారు. ప్రధాన మంత్రిని కలిసేందుకు తాను ఎప్పుడు వెళ్లినా ఆయన ఆయుష్మాన్ భారత్‌లో తెలంగాణ రాష్ట్రం చేరకపోవడాన్ని గుర్తు చేస్తారన్నారు.'మీరు తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ కంటే ఆరోగ్యశ్రీ ఎన్నో రెట్లు మెరుగైంది. అందుకే ఆయుష్మాన్ పథకాన్ని తెలంగాణలో చేర్చలేదని ప్రధానికే చెప్పాను' అని ఆయన వెల్లడించారు. కంటి వెలుగు పథకం కింద ఇప్పటి వరకు 1.32 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందజేశామన్నారు. కంటి వెలుగు పథకాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన తెలిపారు. త్వరలోనే కంటి వెలుగు మాదిరిగానే చెవి, ముక్కు, గొంతు పరీక్షలను నిర్వహించబోతున్నామని కేసీఆర్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రతి ఒక్కరి రక్త నమునాలు సేకరించి ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్‌ను రికార్డు చేయబోతున్నామని సీఎం కేసీఆర్ వెల్లడించారు.

మోసపూరిత ప్రచారాల్లో ఏపీ సీఎం చంద్రబాబు దిట్ట

★ డీమానిటైజేషన్ కమిటీకి బాబే కన్వీనర్

★ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా నిప్పులు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ. పక్కన జీవీఎల్ నరసింహారావు

గుంటూరు, జనవరి 20: మోసపూరిత ప్రచారాలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిట్ట అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఆదివారం గుంటూరులోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పెద్దనోట్లు రద్దుచేయాలని తానే లేఖ రాశానని చెప్పిన చంద్రబాబు తర్వాత డీమానిటైజేషన్ కమిటీకి కన్వీనర్ అయ్యారన్న విషయం మరచినట్లున్నారన్నారు. కేంద్రం ఏ రాష్ట్రానికీ ఇవ్వని నిధులను ఆంధ్ర రాష్ట్రానికి ఇచ్చిందన్నారు. ప్రతి రాష్ట్రానికి 4లక్షల ఇళ్లు కేటాయిస్తే ఏపీకి 7.45 లక్షల ఇళ్లు కేటాయించిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ తన వంతు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో నేషనల్ హైవేల నిర్మాణానికి ఐదేళ్లలో లక్ష కోట్లను కేంద్రం ఇచ్చిందన్నారు. రోడ్ల నిర్మాణం ప్రాజెక్టులో భాగంగా పూర్తైన వాటిని ఈ నెల 21న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆకివీడులో ప్రారంభిస్తారన్నారు. 2014 ముందు వరకు రాష్ట్రంలో 4,193 కిలోమీటర్ల రోడ్లను పూర్తిచేస్తే ఈ ఐదేళ్ల కాలంలో 7,246 కిలోమీటర్లు నిర్మాణం లక్ష్యంకాగా ఇప్పటివరకు 3,150 కిలోమీటర్లు పూర్తి చేశామన్నారు. గడ్కరీ శాఖకు సంబంధించే రాష్ట్రానికి 3లక్షల కోట్ల నిధులు ఇచ్చారని, ఎన్డీఏ నుండి టీడీపీ బయటకు వచ్చాక గ్రామీణాభివృద్ధికి 24వేల కోట్లు ఇచ్చామన్నారు. కేంద్రం నిధులతో జరుగుతున్న ప్రతి పనిలో చంద్రబాబు ముడుపులు దండుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ట్రిపుల్ తలాక్, ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత, ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడం దేశంలో మరే ప్రధానీ చేయలేదని కన్నా స్పష్టం చేశారు. విలేఖరుల సమావేశంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తురగా నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమేమీ ఉండదు...!

★ అపహరణకు గురైన రేడియో ధార్మిక మూలంపై ఓఎన్జీసీ అధికార్ల స్పష్టీకరణ

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 20: రాజమహేంద్రవరంలోని ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్సులో కంటైనర్‌లో అపహరణకు గురైన రేడియో ధార్మిక మూలంవల్ల ఎటువంటి ప్రమాదం ఉండదని ఆదివారం ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో ఓఎన్జీసీ అధికారులు స్పష్టంచేశారు. ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్సులోని లాగింగ్ యూనిట్ నుంచి 27 కిలోల బరువుగల ధ్రుడమైన కంటైనర్ బాక్స్‌తో పాటు ఆచూకీ తెలియకుండా పోయిన రేడియోధార్మిక మూలం సీఎస్-137 (2.5 క్యూరీ) శక్తి తగ్గిందని తెలిపారు. ఓఎన్జీసీ రాజమహేంద్రవరం అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ డిఎం ఆర్ శేఖర్ మాట్లాడుతూ ఇది ఎటువంటి పరిస్థితుల్లోనూ పేలబోదని స్పష్టం చేశారు. ఈ మూలం కంటైనర్ లోపల ఉన్నపుడు విడుదలైన అన్ని గామా కిరణాలు ఒకే దశలో ప్రసారం చేయబడతాయని, అన్ని దిశల్లో ప్రసారం చేయబడవన్నారు. మూలం కంటైనర్‌లో ఉన్నంత కాలం చాలా సురక్షితంగా ఉండి, ఎటువంటి ప్రభావంవుండదన్నారు. మూలం కంటైనర్ నుంచి తీసినపుడు విడుదలయ్యే గామా కిరణాలు రెండు మీటర్లకు మించి ప్రసరించవని, దానివల్ల ఆ పరిధికి మించి ప్రభావం ఉండదన్నారు. ఈ విషయం ఆటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) వెబ్‌సైట్‌లో కూడా తేల్చిచెప్పిందన్నారు. దీనిని ఏఈఆర్బీ నియంత్రిస్తుందన్నారు.

క్రీడాభూమి



సింగపూర్‌లో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో టైటిల్‌ను దక్కించుకున్న భారత టెన్నిస్ క్రీడాకారిణి అంకిత రైనా

అంకిత రైనాకు సింగపూర్ టైటిల్

న్యూఢిల్లీ, జనవరి 20: భారత టెన్నిస్ క్రీడాకారిణి అంకిత రైనా సింగపూర్‌లో జరుగుతున్న 25,000 డాలర్ల మహిళల సింగిల్స్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఈ ఏడాది తొలి సారిగా టైటిల్‌ను దక్కించుకుంది. తన కెరీర్‌లో ఇప్పటికే ఏడుసార్లు వివిధ టైటిళ్లను కైవసం చేసుకున్న అంకిత రైనా ఆదివారం జరిగిన పోటీలో టాప్ సీడ్ అరంటక్సా రస్‌పై విజయం సాధించింది. ఆస్ట్రేలియా ఓపెన్ క్వాలిఫయర్ పోటీలో నిరాశ చెందినా, సింగపూర్ టోర్నీలో పాల్గొన్న అంకిత ఒక గంట 23 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ 122, డచ్ టాప్ సీడ్‌ను 6-3, 6-2 తేడాతో ఓడించింది. అంతకుముందు నలుగురు సీడెడ్ ఆటగాళ్లపై సైతం అంకిత పైచేయి సాధించింది. సింగపూర్ టైటిల్‌ను కైవసం చేసుకోవడం ద్వారా అంకిత తన ఖాతాలో 50 పాయింట్లు జమ చేసుకుని సింగిల్స్‌లో 168 ర్యాంక్ దక్కించుకుంది.

వన్డేల్లో కోహ్లీ గొప్ప ఆటగాడు

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్

న్యూఢిల్లీ, జనవరి 20: వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఎప్పుడు ఆడినా అందులో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ గొప్ప ఆటగాడిగా నిలుస్తాడని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ అన్నాడు. క్రికెట్ ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలిచిన కోహ్లీ నాయకత్వంలో ఇటు టెస్టుల్లోనూ, అటు వన్డేల్లోనూ ఉత్తమ ఆటగాడిగా నిలవడం వల్లే ఆసిస్ టూర్‌లో టీమిండియా ఇటీవల ఈ సిరీస్‌లను కైవసం చేసుకోవడంతోపాటు టీ-20 ఇంటర్నేషనల్ సిరీస్‌ను డ్రా చేసుకుని సగర్వంగా నిలిచిందని అన్నాడు. ఆసిస్ మైదానంపై ఆడిన మొత్తం సిరీస్‌లలో ఘన విజయాన్ని నమోదు చేసుకున్న తొలి జట్టుగా కోహ్లీ సేన చరిత్రలో చోటుదక్కించుకుందని పేర్కొన్నాడు. 'నా వ్యక్తిగత విషయానికొస్తే వన్డే క్రికెట్ ఎప్పుడు, ఎక్కడ జరిగినా అందులో ఉత్తమంగా కోహ్లీ రాణిస్తున్నాడు. ఆసిస్ గడ్డపై కోహ్లీ టీమిండియాను గెలిపించిన ఘనతే ఇందుకు నిదర్శనం' అని వరల్డ్ కప్ మాజీ కెప్టెన్ క్లార్క్ పీటీఐ ప్రతినిధితో మాట్లాడుతూ అన్నాడు. 219 వన్డే మ్యాచ్‌లలో 10,385 పరుగులు, వీటిలో 39 సెంచరీలు కొట్టిన 30 ఏళ్ల కోహ్లీ తన దేశం కోసం సాధించిన ఘనతను, ఆతని అభిరుచులను గౌరవించాలని అభిప్రాయపడ్డాడు. కోహ్లీకి కాస్త కోపం ఎక్కువ అన్న మాట వాస్తవమైనా ఆటలో అతని నిబద్ధతను ఎవరూ ప్రశ్నించలేరని క్లార్క్ అన్నాడు.

ఆక్లాండ్‌కు చేరుకున్న టీమిండియా


23 నుంచి న్యూజిలాండ్‌తో ఐదు వన్డేలు, మూడు టీ-20లు ఆడనున్న కోహ్లీ సేన

ఆక్లాండ్, జనవరి 20: కొద్దిరోజుల కిందట ఆస్ట్రేలియా టూర్‌ను అత్యంత అద్భుతంగా ముగించిన విరాట్ కోహ్లీ నాయకత్వంలోని టీమిండియా తమ ఈనెల 23 నుంచి న్యూజిలాండ్‌లో పర్యటించనుంది. ఆతిథ్య జట్టుతో ఐదు వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు, మూడు టీ-20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో భారత్ తలపడనుంది. ఆదివారం ఆక్లాండ్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న టీమిండియా ఆటగాళ్లకు అభిమానులు, భారత మద్దతుదారులు ఘన స్వాగతం పలికారు. కేదార్ జాదవ్, దినేష్ కార్తీక్ అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు ఇవ్వగా, తన భార్య అనుష్క శర్మతో వచ్చిన కెప్టెన్ కోహ్లీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

ఆస్ట్రేలియా ఓపెన్

డిఫెండింగ్ చాంపియన్ ఫెదరర్, షరపోవాకు షాక్

క్వార్టర్ ఫైనల్స్‌కు నాదల్, స్టెఫనోస్ సిట్‌సిపాస్, క్విటోవా, ఆష్‌లీగ్, డేనియల్లీ, రోబెర్టో



గ్రీక్ ఆటగాడు, 14వ సీడ్ స్టెఫనోస్ సిట్‌సిపాస్ చేతిలో పరాజయం పాలైన డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్

మెల్‌బోర్న్, జనవరి 20: ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ పురుషుల విభాగంలో భాగంగా ఆదివారం జరిగిన నాలుగో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్, మహిళల విభాగంలో రష్యా బ్యూటీ మరియా షరపోవాకు గట్టి షాక్ తగిలింది.

ప్రపంచ మూడో సీడ్ ఆటగాడు ఫెదరర్ తన సమీప ప్రత్యర్థి, తనకంటే 17 ఏళ్లు చిన్నవాడైన 20 ఏళ్ల గ్రీక్ ఆటగాడు, 14వ సీడ్ క్రీడాకారుడు స్టెఫనోస్ సిట్‌సిపాస్ చేతిలో పరాజయం పాలయ్యాడు. వీరిద్దరి మధ్య క్వార్టర్ ఫైనల్స్‌లో చోటు కోసం జరిగిన పోరులో స్టెఫనోస్ 6-7 (11-13), 7-6 (7/3), 7-5, 7-6 (7/5) తేడాతో ఓడించాడు.

గ్రీక్ చరిత్రలోనే తొలిసారిగా గ్రాండ్ శ్లామ్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న ఘనతను స్టెఫనోస్ సాధించాడు. మహిళల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో ఎనిమిదో సీడ్ పెట్రా క్విటోవా, ఆష్‌లీగ్ బార్టీ, డేనియల్లీ కొలిన్స్ సునాయాసంగా క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించారు. వేర్వేరు పోటీల్లో పెట్రా క్విటోవా తన సమీప ప్రత్యర్థి అమండా అనిసిమోవాను 6-2, 6-1 తేడాతో ఓడించగా, 15వ సీడ్ ఆష్‌లీగ్ బార్టీ సీనియర్ క్రీడాకారిణి మరియా షరపోవాను 4-6, 6-1, 6-4 తేడాతో ఓడించింది. షరపోవాపై విజయంతో బార్టీ తొలిసారిగా గ్రాండ్ శ్లామ్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్స్‌లో చోటుదక్కించుకుంది. తొలిరౌండ్‌లో ప్రత్యర్థికి గట్టి పోటీనిచ్చిన షరపోవా మిగిలిన రెండు రౌండ్లలో వెనుకంజ వేయడంతో బార్టీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. మరోపోటీలో డేనియల్లీ కొలిన్స్ ప్రపంచ రెండో సీడ్, జర్మనీ వింబుల్డన్ చాంపియన్, ఏంజలిక్వె కెర్బర్‌ను 6-0, 6-2 తేడాతో అతి సునాయాసంగా ఓడించింది.

ఈ పోటీలో కెర్బర్ తన ప్రత్యర్థికి ఏకోశానా గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్ 2 స్టార్, 17సార్లు గ్రాండ్ శ్లామ్ టైటిళ్లు సాధించిన స్పానిష్ దిగ్గజం రాఫెల్ నాదల్ తన సమీప ప్రత్యర్థి, అన్‌సీడెడ్ క్రీడాకారుడు థామస్ బెర్డిచ్‌ను 6-0, 6-1, 7-6తో ఓడించాడు. ఈ పోటీలో బెర్డిచ్ ఎలాంటి ప్రతిఘటన ఇవ్వలేకపోవడంతో నాదల్ అతి సులువుగా క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు. మరో పోటీలో 22వ సీడ్ రాబెర్టో బాటిస్టా అగట్ తన సమీప ప్రత్యర్థి, ఆరో సీడ్ ఆటగాడు మారిన్ సిలిసను 6-7, 6-3, 6-2, 4-6, 6-4 తేడాతో ఓడించాడు. మరో పోటీలో ఫ్రాన్సెస్ టియాఫో 20వ సీడ్ ఆటగాడు గ్రిగర్ దిమిట్రొవ్‌ను 7-5, 7-6, 6-7, 7-5 తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించాడు.



15వ సీడ్ ఆష్‌లీగ్ బార్టీ చేతిలో ఓడిపోయిన మరియా షరపోవా



ఆస్ట్రేలియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్‌లో చోటు దక్కించుకున్న రాఫెల్ నాదల్, పెట్రా క్విటోవా, స్టెఫనోస్ సిట్‌సిపాస్

స్టాక్ మార్కెట్ స్థిరపడేనా?



ముంబయి, జనవరి 20: గత కొంతకాలంగా అనిశ్చితి పరిస్థితిని ఎదుర్కొన్న బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో లావాదేవీలు కొత్త వారంలో స్థిరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్) ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఫలితాలను వెల్లడించగా, ఇన్ఫోసిస్ 8,260 కోట్ల రూపాయల విలువైన 10.32 కోట్ల ఈక్విటీ షేర్లను తిరిగి కొంటున్నది. ఈ 'బై బ్యాక్' ద్వారా స్టాక్ మార్కెట్ లాభపడడం ఖాయం. ఇలావుంటే, అవరోధాలను అధిగమించి, రూపాయి మారకపు విలువ నిలదొక్కుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. గత వారం లావాదేవీలు తీరుతెన్నులను పరిశీలిస్తే, భవిష్యత్తుపై కొంత స్పష్టత వస్తుందని అంటున్నారు. గత నెల 31వ తేదీన 36,068.33 పాయింట్లుగా ముగిసిన సెన్సెక్స్ మొదటి వారంలో కొంత పతనమై, చివరికి 35,695.10 పాయింట్లుగా నమోదైంది. రెండో వారంలోనూ అనిశ్చితి కొనసాగింది. అయితే, ఆటుపోట్ల మధ్య కొనసాగినప్పటికీ, సెన్సెక్స్ 36,009.84 పాయింట్లకు చేరింది. గత వారం లావాదేవీలు మొదలైన తొలి రోజునే మళ్లీ పతనమైన సెన్సెక్స్ 35,853.56 పాయింట్ల వద్ద ముగిసింది. కానీ, ఆతర్వాత వరుసగా నాలుగు రోజులు నష్టాల బారిన పడకుండా తప్పించుకోగలిగింది. మంగళశారం 36,318.33 పాయింట్లు, బుధవారం 36,321.29 పాయింట్లు, గురువారం 36,374.08 పాయింట్లు నమోదయ్యాయి. శుక్రవారం మరో 12.53 పాయింట్లు పెరిగి, 36,374.08 పాయింట్ల వద్ద తెరిపింది. గురు, శుక్రవారాల్లో లావాదేవీలు కనీసం సగటున మూడు వందల పాయింట్ల కనిష్ఠ, గరిష్ఠ స్థాయిల మధ్య ఊగిసలాడాయి. అంతర్జాతీయ పరిస్థితులుగానీ, వివిధ మార్కెట్ల సూచీలుగానీ పరిగణలోకి తీసుకుంటే, భారత స్టాక్ మార్కెట్ కూడా అదే స్థాయిలో నష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కానీ, దేశీయ మదుపరులు ఆదుకోవడంతో, సెన్సెక్స్ కుప్పకూలకుండా నిలబడగలిగింది. బుల్‌రన్ కొనసాగకపోయినా, బేర్‌ది పైచేయి కాలేదు. కొత్త వారంలో స్టాక్ మార్కెట్ మరింతగా నిలదొక్కుకుంటుందన్న వాదనకు బలాన్ని చేకూరుస్తున్న అంశాలు చాలానే ఉన్నాయి. నిఫ్టీ కూడా లాభాలతో ముగియడం, కూడా స్టాక్ మార్కెట్ బలపడుతుందనడానికి ఒక కారణంగా చెప్పుకోవాలి.

జాగ్రత్తలు అవసరం

వచ్చే వారం స్టాక్ మార్కెట్ లాభసాటిగా ఉంటుందనే వాదన వినిపిస్తున్నప్పటికీ, అటు మదుపరులు, ఇటు బ్రోకర్లు అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన నిధుల ప్రతిపాదనలను చట్టసభ నిరాకరించడంతో, అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిస్థితి అగమ్యగోచరంగా మారిన విషయం తెలిసిందే. ఈ 'షట్‌డౌన్' ఎంత కాలం కొనసాగుతుందో చెప్పడం కష్టం. అత్యవసర రంగాలకు నిధులను విడుదల చేయడానికి అంగీకరించిన పార్లమెంటు మిగతా ప్రతిపాదనలను పక్కకుపెట్టింది. మెక్సికో సరిహద్దులో భారీ గోడ నిర్మాణం కూడా చట్టసభ అంగీకరించని నిధుల ప్రతిపాదనల్లో ఒకటి. ఒకవేళ చర్చలు ఫలించి, ట్రంప్ సర్కారు చేసిన ప్రతిపాదనలు పూర్తిగా లేదా ఎక్కువ శాతం ఆమోద ముద్ర పొందితే, 'షట్‌డౌన్' నుంచి అమెరికా ఆర్థిక వ్యవస్థ బయటపడుతుంది. ఇలావుంటే, యూరోపియన్ యూనియన్‌తో ఆర్థిక లావాదేవీలకు గుడ్‌బై చెప్పాలన్న బ్రిటన్ ప్రధాని థెరెసా మే ప్రతిపాదనను అక్కడి పార్లమెంటు తిప్పికొట్టింది. బ్రిటన్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా, ఒక ప్రధాని ప్రవేశపెట్టిన తీర్మానం అత్యంత అవమానకర పరిస్థితుల్లో వీగిపోయింది. 'బ్రెగ్జిట్' ప్రభావం ప్రపంచ మార్కెట్‌పై ఉంటుందనేది వాస్తవం. భారత్ కూడా అందుకు మినహాయింపు కాదు. ఈ విషయాన్ని కూడా మదుపరులు జాగ్రత్తగా గమనించాలి. పరిణామాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలి. అప్పుడే, మార్కెట్‌లో లాభసాటి ట్రేడింగ్ సాధ్యమవుతుంది. రూపాయి మారకపు విలువ, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర, దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న వివిధ కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు, ఇన్ఫోసిస్ వంటి కంపెనీల 'బై బ్యాక్' వంటి అనేకానేక అంశాలు సైతం సోమవారం నుంచి ప్రారంభం కానున్న కొత్త వారం మార్కెట్ తీరుతెన్నులను నిర్ధారించనున్నాయి. అయితే, ఇవన్నీ సానుకూల ధోరణులనే ప్రదర్శిస్తాయని, కాబట్టి బీఎస్ఈ సూచీలు కూడా లాభాల్లో ఉంటాయని మార్కెట్ విశ్లేషకులు జోస్యం చెప్తున్నారు. వీరి అంచనాలు నిజమవుతాయా? భారత స్టాక్ మార్కెట్ నిలదొక్కుకుంటుందా లేదా? అన్నది వేచిచూడాలి.

వాణిజ్యభూమి

నీరవ్ మోదీ కుంభకోణం కేసు

ఇద్దరు పీఎన్‌బీ ఈడీలపై వేటు



న్యూఢిల్లీ, జనవరి 20: వేల కోట్ల రూపాయలను రుణంగా తీసుకొని, ఆతర్వాత ఉద్దేశపూర్వకంగానే వాటిని ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారస్థుడు నీరవ్ మోదీ వ్యవహారం పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కి తలనొప్పి వ్యవహారంగా మారింది. బ్యాంకులో చోటు చేసుకుంటున్న అవాంఛనీయ ధోరణులను అరికట్టలేకపోయారన్న ఆరోపణలను బ్యాంకుకు చెందిన ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)లపై కేంద్ర ప్రభుత్వం వేటు వేసింది. కేవీ బ్రహ్మాజీ రావు, సంజీవ్ శరణ్‌ను వారివారి పదవుల నుంచి తొలగించినట్టు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈనెల 18 నుంచే వారి పేర్లను లిస్ట్ నుంచి తొలగించినట్టు వివరించింది. సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్ బ్యాంకింగ్ ఫైనాన్షిల్ టెలికమ్యూనికేషన్ (స్విఫ్ట్)తో కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (సీబీఎస్)ను అనుసంధానం చేయమని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, దానిని వీరిద్దరూ నిర్లక్ష్యం చేశారని పేర్కొంది. 2016లో ఆర్‌బీఐ 2016లో సర్క్యులర్‌ను జారీ చేసిన విషయాన్ని కేంద్రం తన ప్రకటనలో ప్రస్తావించింది. కాగా, వేటు పడిన ఇద్దరు ఈడీల్లో బ్రహ్మాజీ రావు ఈనెలలోనే రిటైర్ కానున్నాడు. సంజీవ్ శరణ్ సర్వీసు మే వరకూ ఉంది. భారత బ్యాంకింగ్ చరిత్రలోనే భారీ కుంభకోణానికి పాల్పడిన నీరవ్ మోదీ కేసులో అలహాబాద్ బ్యాంక్ అధికారిణి ఉషా అనంతసుబ్రహ్మణియన్‌ను కేంద్రం ఇది వరకే సస్పెండ్ చేసింది. కేసును మరింత లోతుగా దర్యాప్తు జరిపిస్తున్నది. ఈ క్రమంలోనే పీఎన్‌బీకి చెందిన ఇద్దరిపై వేటు వేసింది.



ఇక చాలు.. తప్పుకోండి

భాగస్వామి నికోకు రిల్ సూచన

న్యూఢిల్లీ, జనవరి 20: బంగాళా ఖాతంలోని కేజీ-డీ 6 బ్లాక్‌లో భాగస్వామ్యం నుంచి వైదొలగాల్సిందిగా నికో రిసోర్సెస్‌కు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్) సూచించింది. గ్యాస్ క్షేత్ర అభివృద్ధికి పెట్టుబడులను ఇవ్వలేకపోతున్న నికో వల్ల ఉత్పత్తి ఆలస్యమవుతున్నదని రిల్ అభిప్రాయపడుతున్నది. అయితే, కెనడాకు చెందిన నికో సంస్థ మాత్రం రిల్‌తో భాగస్వామ్యాన్ని తెగతెంపులు చేసుకోవడానికి సంసిద్ధంగా లేదని, మధ్యవర్తి ద్వారా సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నదని సమాచారం. తన రుణదాతలకు నికో కంపెనీ చెల్లింపులను చేయలేకపోతున్నది. కేజీ-డీ 6 క్లస్టర్‌లో తన 10 శాతం వాటాలను అమ్మడానికి సరైన పార్టీని సంపాదించలేకపోయింది. అదే విధంగా ఆర్-క్లస్టర్‌లోని తన వాటాకు సరిపడా ఫైనాన్స్‌ను కూడా పొందలేకపోయింది. ఫలితంగా అభివృద్ధికి కేటాయించిన మొత్తాల్లో, తన వంతు వాటాను ఇవ్వలేకపోతున్నది. రుణదాతలకు చెల్లింపుల్లో విఫలమవుతున్న కారణంగానే నికో సంస్థను భాగస్వామ్యం నుంచి వైదొలగాల్సిందిగా కోరుతున్నట్టు రిల్ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, వాటాను వదులుకోవడానికి సిద్ధంగా లేని నికో కంపెనీ ప్రతిఘటనకు సిద్ధమైంది. మధ్యవర్తి ద్వారా సెటిల్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నది.


ఆరు మిడ్‌క్యాప్ కంపెనీలకు భారీ లాభాలు

న్యూఢిల్లీ, జనవరి 20: దేశ ఆర్థిక వ్యవస్థను శాసించే పది భారీ కంపెనీల్లో ఆరు కంపెనీలు గత వారం భారీ లాభాలను ఆర్జించాయి. ఫలితంగా మార్కెట్‌లో వీడి విలువ 1,08,274.79 కోట్ల రూపాయలకు పెరిగింది. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్) అగ్రస్థానాన్ని ఆక్రమించింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్ర బ్యాంక్ కంపెనీల మార్కెట్ విలువ భారీగా పెరిగింది. సోమవారం నుంచి మొదలయ్యే కొత్త వారంలోనూ ఈ కంపెనీ వాటాల ర్యాలీ కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అతిపెద్ద కంపెనీల తీరుతెన్నులను బట్టే భారత స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ ఆధారపడి ఉంటుందన్నది వాస్తవం. ఇలావుంటే, గత వారం భారీగా నష్టపోయిన హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ఐటీసీ, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ కంపెనీలు ఈవారంలోనైనా కోలుకుంటాయా అన్నది అనుమానమే. గత వారం రిల్ మార్కెట్ విలువ 53,918.87 కోట్ల రూపాయలు పెరిగి, 7,49,829.58 కోట్ల రూపాయలకు చేరింది. దేశంలో ని టాప్ టెన్ కంపెనీల్లో మరే ఇతర సంస్థ కూడా ఇప్పటి వరకూ ఈ స్థాయిలో మార్కెట్ విలువను పెంచుకోలేకపోయింది. రిల్ రికార్డు పరుగు వచ్చే వారం కూడా ఇదే తరహాలో కొనసాగుతుందన్న అభిప్రాయం మార్కెట్‌లో బలంగా వినిపిస్తున్నది. టీసీఎస్ మార్కెట్ విలువ 7,13,103.19 కోట్ల రూపాయలకు చేరుకోగా, ఇన్ఫోసిస్ 20,663.70 కోట్ల రూపాయలు మెరుగుపడి 3,19,348.16 కోట్ల రూపాయలుగా నమోదైంది. అదే విధంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ 5,180.65 కోట్ల రూపాయలు పెరిగింది. దీని విలువ ఇప్పుడు 5,79,580.13 కోట్ల రూపాయలు. హెచ్‌డీఎఫ్‌సీ విలువ 3,45,278.43 కోట్లు.

Printed and Published by **T. Venkateswarlu** on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor **T.V.Ravi Reddy**,
PBX 27803930 (6Lines), Editorial: 27805056, **Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60**

నవ భారత రూపశిల్పి పటేల్

'ఉక్కు మనిషి'కి ఉప రాష్ట్రపతి ఘన నివాళి



సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలు జల్లి నివాళులర్పిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 20: స్వాతంత్ర్యం అనంతరం దేశాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చిన ఘనత మొదట ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కే దక్కుతుందని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కొనియాడారు. గుజరాత్ పర్యటనలో భాగంగా ఆదివారం వల్లభాయ్ పటేల్ విగ్రహన్ని (స్టాట్యూ ఆఫ్ యూనిటీ) సందర్శించి నివాళులర్పించారు. సర్దార్ పటేల్ విగ్రహం దేశ ఐక్యతకు చిహ్నమని, ఆయన పట్ల దేశ ప్రజలు కృతజ్ఞతా భావాన్ని కలిగివుంటారని చెప్పారు. దేశ చరిత్ర గురించి, ముఖ్యంగా పటేల్ గురించి తెలుసుకోవాలంటే తప్పకుండా ఈ ప్రాంతాన్ని అందరూ సందర్శించాలని అన్నారు. మొదటి దేశ ఉప ప్రధానిగా, కేంద్ర హోం మంత్రిగా పటేల్ చేసిన సూచనలు, సలహాలు అందరికీ ఆదర్శప్రాయమని చెప్పారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన 'ఉక్కు మనిషి' పటేల్ విగ్రహాన్ని నిర్మించేందుకు చొరవ చూపిన ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. అలాగే బ్రిటిష్ వలస పాలకుల నుంచి స్వేచ్ఛను పొందేందుకు సుదీర్ఘమైన పోరాటం సాగించి, దేశానికి స్వరాజ్యాన్ని సాధించిపెట్టిన మహాత్మా గాంధీ, దేశాన్ని ఏకీకృతం చేసిన నవీన భారతదేశ రూపశిల్పి పటేల్, ఇద్దరూ గుజరాజ్ రాష్ట్రానికే చెందిన వారు కావడం ఆ రాష్ట్ర ప్రజలకు ఎంతో గర్వకారణామని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 565 గణ రాజ్యాలను పటేల్ విలీనం చేయకపోతే, చాలావరకు స్వతంత్ర దేశాలుగా ఇప్పటికీ కొనసాగేవని అన్నారు. ఏడాది కాలంలో అన్ని గణ రాజ్యాలను ఏకం చేసి, భారతదేశ సాంస్కృతిని, ఐక్యతను, సామరస్యాన్ని సర్దార్ పటేల్ కాపాడారని అన్నారు. సువిశాలమైన భారతదేశం సాకారం కావాలంటే, మందుగా భారతదేశం ఏకం కావాలని పటేల్ భావించారని వెల్లడించారు. పటేల్ సంకల్పమే ఆయనకు భారతదేశ ఉక్కుమనిషిని చేసిందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

ఉగ్రవాదం, అవినీతిపై రాజీలేని పోరాటం

ప్రపంచదేశాలను పట్టిపీడించే ఉగ్రవాదం, వాతావరణంలో అసాధారణ ఉష్ణోగ్రతల మార్పులు, అవినీతిపై రాజీలేని విధంగా పోరాడేందుకు ప్రజలు సమష్టిగా పోరాడాలనివెంకయ్యానాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ గుజరాత్ ఆర్థిక, వాణిజ్య వేత్తల సదస్సులో ఆయన మాట్లాడుతూ శాంతి, అభివృద్ధి సాధనలో అన్ని దేశాలు భాగస్వాములు కావాలన్నారు. శాంతి లేకుండా అభివృద్ధిని సాధించలేమన్నారు. ఉగ్రవాదానికి మతం లేదని, మానవాళికి పెనుముప్పుగా పరిణమించిందని ఆయన ధ్వజమెత్తారు. ప్రపంచ దేశాలు పరస్పరం సహకరించుకుంటే తప్ప ఉగ్రవాదాన్ని తరిమిగొట్టలేమన్నారు. వాతావరణంలో అసాధారణ మార్పులు చోటు చేసుకుంటున్నాయని, పర్యావరణ పరిరక్షణ సమతుల్యత దెబ్బతిందన్నారు. భారత్ చొరవ తీసుకోవడం వల్ల 121 దేశాలు సౌరశక్తి వేదికపైకి వచ్చాయన్నారు. అవినీతి వల్ల వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయన్నారు. అభివృద్ధికి అవినీతి సవాలుగా మారిందన్నారు. అక్రమార్జనపరులు నకిలీ అకౌంట్లను తెరిచి ధనాన్ని మళ్ళిస్తున్నారన్నారు. ఆర్థిక వనరులను దోపిడీ చేసి దేశం వదిలి పారిపోయి విదేశాలను నక్కిన వారిని తీసుకువచ్చి శిక్షించాలన్నారు. గత 15 ఏళ్లలో దేశాభివృద్ధి పరిశ్రమలకు మాత్రమే పరిమితం కాలేదన్నారు. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో శరవేగంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. సామాజిక, ఆర్థిక సాంస్కృతిక రంగాల్లో మార్పులు వస్తున్నాయన్నారు. గత కొన్ని సంవత్సరాలు కేంద్రం తెచ్చిన ఆర్థికసంస్కరణల వల్ల పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఈ తరహా సదస్సులను నిర్వహించడం వల్ల భారత్ అభివృద్ధి, పెట్టుబడులకు అనువైన పరిస్థితులు ప్రపంచదేశాలకు తెలుస్తాయన్నారు. ఇలాంటి సదస్సుల అవసరం ఎంతైనా ఉందన్నారు.

హోదా ఉద్యమం ఉద్ధృతం చేస్తాం

❖ కేంద్ర బడ్జెట్ రోజు రాష్ట్ర బంద్‌కు యోచన

❖ విద్యార్థులతో భారీ బహిరంగ సభకు నేతల పిలుపు

ఆంధ్రభూమి బ్యూరో



సమావేశంలో మాట్లాడుతున్న వర్ల రామయ్య

విజయవాడ, జనవరి 20: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ఉద్యమం తీవ్రతరం చేయాలని వివిధ రాజకీయ పక్షాలు నిర్ణయించాయి. జాతీయ రహదారుల దిగ్బంధం, బడ్జెట్ రోజున రాష్ట్ర బంద్, విద్యార్థులతో బహిరంగ సభ ఏర్పాటు వంటివి చేపట్టాలని నిర్ణయించాయి. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై వివిధ రాజకీయ పక్షాలు, విద్యార్థి, యువజన సంఘాల నేతలతో నగరంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం సమష్టిగా పోరాడాల్సి ఉందన్నారు. ఎన్నికల వాతావరణం నెలకొన్న తరుణంలో నిరసన తీవ్రతరం చేయాల్సి ఉందన్నారు. పార్లమెంట్‌లో ఓట్ ఆన్ అక్కౌంట్ బడ్జెట్ రోజు రాష్ట్ర బంద్ పాటించాలని సూచించారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో విద్యార్థులతో భారీ బహిరంగ సభ నిర్వహించాలన్నారు. మోదీ రాష్ట్రానికి ఎప్పుడు వచ్చినా ఖాళీ కుండలతో నిరసన తెలియచేస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు రాష్ట్రంలో బంద్ చేపట్టాలన్నారు. రాజకీయ పక్షాల నేతలు వ్యక్తిగత దూషణలు మానుకుని ఉమ్మడి ఉద్యమానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలతో రాష్ట్రపతిని కలిసి ప్రత్యేక హోదా ఆవశ్యకతను వివరిస్తామన్నారు. బీజేపీతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, సోమవారం కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నేత డా. గంగాధర్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమం మరికొన్ని రోజుల పాటు సజీవంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హోదా ఇస్తామని ఇప్పటికే ప్రకటించామని గుర్తుచేశారు. హోదా సాధించేవరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాల్సి ఉందన్నారు. ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి మాట్లాడుతూ హోదా అంశంపై ప్రజల పక్షాన శాసనమండలిలో తమ వాణి వినిపిస్తామన్నారు. రాష్ట్రానికి 75వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. హోదా కోసం రాష్ట్ర బంద్ పాటించాలన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య మాట్లాడుతూ హోదా విషయంలో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన మోదీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎన్డీఏ చేసిన మోసం గ్రహించి ప్రత్యక్ష పోరాటానికి దిగామని, సమితి ఉద్యమానికి టీడీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, తదితరులు ప్రసంగించారు.



జ్యోతి ప్రజ్వలనతో పక్షుల పండుగను ప్రారంభిస్తున్న మంత్రి సోమిరెడ్డి

విదేశీ విహంగాల రాకతో

సూళ్లూరుపేటకు గుర్తింపు

◆ పక్షుల పండుగ ప్రారంభ సభలో మంత్రి సోమిరెడ్డి

సూళ్లూరుపేట, జనవరి 20: విదేశీ విహంగాల రాకతో సూళ్లూరుపేట దేశానికే తలమానికంగా నిలిచిందని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో మూడు రోజులపాటు జరిగే పక్షుల పండుగ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా మంత్రి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఫ్లెమింగో బెలూన్ ఎగురవేసి పండుగను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ స్టాల్స్‌ను ప్రారంభించి వాటిని తిలకించారు. అనంతరం ఫెస్టివల్ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి పరసా వెంకటరత్నయ్య అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో సోమిరెడ్డి మాట్లాడారు. ఎక్కడో విదేశాల నుంచి ఖండాతరాలు దాటుకొని ఈ ప్రాంతానికి విదేశీ విహంగాలు రావడం తలచుకొంటేనే ఆశ్చర్యకరమని, మళ్లీ ఆ పక్షులు ఇక్కడే ఆరుమాసాల పాటు విడిది చేసి గుడ్లు పెట్టి పొదిగి మళ్లీ రెక్కలు వచ్చాక వెళ్లడం ఆశ్చకరమైన విషయమన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన షార్ కేంద్రం ఇక్కడ ఉండడం ఒకవంతైతే.. ఇక్కడున్న పులికాట్, నేలపట్టులకు పక్షులు రావడం వాటి పేరుతో ఇలాంటి పండుగలు చేయడం వల్ల సూళ్లూరుపేటకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు రావడం సంతోషమన్నారు. రాష్ట్రంలో పండుగల పరంపర జరుగుతోందని ఆయన అభివర్ణించారు. మొన్న రాష్ట్రంలో సంక్రాంతి పండుగను అందరూ సంతోషాలతో జరుపుకొన్నారని, నేడు సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను జరుపుకొంటున్నారని, ఫిబ్రవరిలో రాష్ట్రంలో పేదలకు నిజమైన పండగ జరుపుకోబోతున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకొన్న మంచి నిర్ణయంతో ఎన్టీఆర్ భరోసా ఫించన్ల రెట్టింపుతో పేద కుటుంబాల్లో నిజమైన పండగ వాతావరణం నెలకొందన్నారు. వచ్చే నెలలో ఫించన్లు పంపిణీ చేసేటప్పుడు రాష్ట్రంలో ప్రతి ఇంటా సంక్రాంతి పండుగకన్నా సంతోషంగా పింఛన్ల పండుగ చేసుకోబోతున్నారని తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా పేదల జీవితాల్లో వెలుగు నింపాలనే ఉద్దేశంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై 7 వేల కోట్ల భారం పడుతుందన్నారు. పేదల కోసం చంద్రబాబు ఇంకా అనేక నిర్ణయాలు తీసుకొన్నారని ఇందులో వ్యవసాయానికి 7 గంటల కరెంట్ 9 గంటలకు పెంచడం, ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా పేదల ఆరోగ్యానికి సేవా పరిమితిని రూ.2.5 లక్షల నుంచి 5 లక్షలకు పెంచారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అన్ని రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి తీసుకుంటున్న నిర్ణయాలకు కొంతమందికి నిద్రపట్టడం లేదని ఎద్దేవా చేశారు.

ఫిబ్రవరిలో రైతుల ఖాతాలోకి మాఫీ సొమ్ము

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రుణ విముక్తి పథకం కింద ఫిబ్రవరిలో రెండు విడతలకు సంబంధించిన రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాలోకి నేరుగా జమ చేస్తామని మంత్రి సోమిరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు 8వేల కోట్ల రూపాయలు జమ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిటీ కింద రూ.2,100 కోట్లు ఇచ్చామన్నారు. ఆక్వా రైతులకు కరెంట్ చార్జీలు తగ్గించి ఆదుకొన్నామని దీంతో ఆక్వా సాగుచేసే వారికి కూడా ఎంతో లాభం చేకూరిందన్నారు. ఈ పథకాల్లో అధికశాతం మంది వైకాపా వారే లబ్ధి పొంది ఉన్నారని అయినా విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వర్షాకాలంలో సుమారు 2500 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతుందనే ఉద్దేశంతో దేశంలో నదుల అనుసంధానం చేసిన ఘనత కూడా చంద్రబాబుదేనన్నారు. ఈ నదుల అనుసంధానంలో భాగంగా 8 మాసాల్లో పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి 100 టీఎంసీల నీటిని కృష్ణ డెల్టాకు అందించామన్నారు. త్వరలో గోదావరి-పెన్నా నదుల అనుసంధానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.





ఖండాంతరాలు దాటి తరలి వచ్చిన విదేశీ పక్షులు



యువశక్తిలో మహిళాశక్తి ఓ భాగం

❖ వసుదైక కుటుంబమే మన మార్గం ❖ యువ నాయకత్వ సదస్సులో గవర్నర్



యువ నాయకత్వ సదస్సులో పాల్గొన్న ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, ఎంపీ కవిత

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 20: యువ శక్తిలో మహిళా శక్తి అనేది కూడా ఓ భాగం అని ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ అన్నారు. వసుదైక కుటుంబం అనేది మన మార్గం అని ఆయన తెలిపారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత అధ్వర్యంలో రెండు రోజుల పాటు ఏర్పాటైన అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తూ జాగృతి అధ్యక్షురాలు కవితను అభినందించారు. జాగృతి అంటేనే చైతన్యం అని, ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చేందుకు కవిత చేస్తున్న కృషిని అభినందిస్తున్నానని అన్నారు. యువత అంటే అందులో మహిళలు కూడా భాగమని అన్నారు. గాంధీ మార్గం మనకు ఆదర్శమని, ప్రతి ఒక్కరూ అహింసా మార్గాన్ని అనుసరించాలని ఆయన సూచించారు. మనుషుల మధ్య అంతరాలు తొలగాలని, అందరికీ సమాన అవకాశాలు రావాలని, అప్పుడే సమాజం సరైన మార్గంలో పయనిస్తుందని గవర్నర్ నరసింహన్ తెలిపారు.

జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత ప్రసంగిస్తూ తెలంగాణ రక్తంలోనే విశ్వమానవాళి గురించి ఆలోచించేతత్వం ఉందని అన్నారు. ఇన్ని రోజులు మన తెలంగాణ గురించి ఆలోచించామని ఆమె చెప్పారు. ఈ అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు ద్వారా ప్రపంచం ముందున్న ప్రధాన సవాళ్ళు వాటికి పరిష్కార మార్గాలు గుర్తించే మంచి ప్రయత్నం జరిగిందని ఆమె తెలిపారు. గాంధీ చూపిన మార్గంలో సుస్థిర అభివృద్ధి సాధించేందుకు యువత ముఖ్య భూమిక పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. సుమారు 110 దేశాల నుంచి వివిధ రంగాలకు చెందిన మేధావులు, ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకుని వచ్చేందుకు తాము ఏడాది కాలంగా ప్రయత్నించామని ఆమె తెలిపారు. ఈ సదస్సులో ఎన్నో అర్థవంతమైన చర్చలు జరిగాయని, ఎన్నో పరిష్కార మార్గాలు కనుగొనే ప్రయత్నం జరిగిందని ఆమె వివరించారు. పర్యావరణం, యువత, మహిళా సాధికారత తదితర అంశాలపై దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు తమ అభిప్రాయాలను చెప్పారని ఆమె తెలిపారు. ప్రతి దేశంలో ప్రభుత్వ విధానాల రూపకల్పనలో యువత భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. ముగింపు సమావేశానికి గవర్నర్ దంపతులు, ఇంకా వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్ సింగ్ పాల్గొన్నారు.

కాసుల కోసం కేసీఆర్‌తో జగన్ జోడీ

❖ మంత్రి దేవినేని ఉమా విమర్శ

ఆంధ్రభూమి బ్యూరో



విజయవాడ, జనవరి 20: ప్రధాని మోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫెడేల్ ఫ్రంట్‌లో జగన్ ఎందుకు భాగస్వామి అయ్యారో ప్రజలకు తెలియజేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక జలవనరుల శాఖ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రాంతీయ, జాతీయ పార్టీలు కోల్‌కత్తాలో నిర్వహించిన భారీ ర్యాలీ విజయవంతమైందని, ఈ ర్యాలీకి బీజేపీ వ్యతిరేక పక్షాలు అన్నీ ఒక వేదిక పైకి వచ్చి ప్రజాఫ్రంట్ ర్యాలీని దిగ్విజయం చేశాయన్నారు. 2019లో దేశానికి కొత్త ప్రధాని వస్తున్నారని, శనివారం జరిగిన భారీ ర్యాలీయే అందుకు నిదర్శనమని దేశ, రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యిందన్నారు. తరువాత అమరావతిలో ప్రజాఫ్రంట్ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. కోల్‌కతా ర్యాలీకి కేసీఆర్, జగన్ ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలన్నారు. గతంలో టీఆర్‌ఎస్ పార్టీ జగన్‌ని జైలులో పెడితే జైలుగోడలు కూడా కబ్జా చేస్తారన్న పార్టీతో నేడు చేతులు కలిపారన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు, దిండి ప్రాజెక్టులను రాష్ట్రంలో లక్షలాది ఎకరాలకు నష్టం జరిగేలా తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తుంటే ప్రశ్నించకుండా కేసీఆర్‌తో చేతులు కలిపి రాష్ట్ర రైతులకు జగన్ అన్యాయం చేస్తున్నారన్నారు. కేసీఆర్ ఇచ్చే కాంట్రాక్టులు, డబ్బుల కోసం కక్కుర్తిపడి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి కేసీఆర్‌కు జగన్ ప్రేమలేఖలు రాస్తున్నారని విమర్శించారు. గాలేరు - నగరి పూర్తిచేసి కడప జిల్లాకు ముఖ్యమంత్రి నీళ్లు ఇచ్చి 1000 కోట్ల రూపాయల పంట కాపాడారన్నారు. రాబోయే 24గంటల్లో చిత్తూరు జిల్లాకు కూడా నీళ్లు తీసుకెళుతున్నామని, దీంతో దశాబ్దాల కల నెరవేరుతుందన్నారు. నెలాఖరు లోపు వైకుంఠపురం బ్యారేజీ, చోడవరం ప్రాజెక్టు, వంశధార - బహుదూర్ నదుల పనులకు సంబంధించి టెండర్లు పూర్తిచేసే పనుల్లో ఉన్నామన్నారు. గోదావరి - పెన్నా ఫేజ్ వన్ పనులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాను అడిగిన ప్రశ్నలన్నింటికీ జగన్ సమాధానం చెప్పాలని మంత్రి ఉమా డిమాండ్ చేశారు.

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

సోమవారం, 21 జనవరి 2019

మల్లెపూలను కేవలం అలంకరణ నిమిత్తం, మగువలు తలలో పెట్టుకోవడానికి మాత్రమే వాడతారు అనుకోకండి. ఈ పూలలో కూడా కొన్ని ఔషధ గుణాలున్నాయని అంటున్నారు శాస్త్రజ్ఞులు.



★ కళ్లు బాగా అలసటగా ఉన్నప్పుడు.. మల్లెపూల రసంతో కంటి చుట్టు భాగాల్లో మర్దన చేసుకొని పడుకుంటే చల్లగా ఉంటుంది.

★ చుండ్రుతో బాధపడేవారు మల్లెపూల రసాన్ని మెంతులతో కలిపి తలకు పట్టించవచ్చు.

★ చర్మానికి అవసరమయ్యే 'సి' విటమిన్ మల్లెపూలలో పుష్కలంగా ఉంటుంది.

★ మల్లెపూల రసాన్ని, గులాబీల రసంతో కలిపి.. ముఖానికి రాసుకుంటే చర్మం మృదువుగా తయారవుతుంది.

★ కొబ్బరినూనెతో కలిపి మల్లెపూల రసాన్ని తలకు రాసుకుంటే మంచి సువాసన వస్తుంది.

★ సబ్బులు, తలనూనెలు, సౌందర్య సాధనాల్లో కూడా నేడు మల్లెపూలను వాడుతున్నారు.

★ మల్లెపూలతో తయారుచేసే పలు ఔషధాలు కణితులను కూడా నివారిస్తాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి.


★ అరోమా థెరపీలో కూడా మల్లె పూలను వాడుతున్నారు.

★ మొటిమల వల్ల వచ్చే మచ్చలకు మల్లెల నూనె రాస్తే ఫలితం ఉంటుంది.

★ మల్లెల సువాసన నిద్రలేమిని కూడా దూరం చేస్తుంది.

బోగీలో సుస్తీ..
ట్వీట్‌తో హ్యాపీ


అరిసెకెరి రైల్వే స్టేషన్



అర్ధరాత్రి వేళ రైల్వే అధికారుల అనూహ్య స్పందన

రైలు ప్రయాణంలో.. అదీ అర్ధరాత్రి సమయంలో.. ఆకస్మికంగా ఆరోగ్యసమస్య తలెత్తితే ఆదుకొనేదెవరు..? భరించలేని నొప్పితో బాధపడుతున్న వ్యక్తికి ఆపన్నహస్తం అందించేదెవరు..? సరిగ్గా.. ఇలాంటి సమస్యే ఆర్కిటెక్చర్‌గా పనిచేస్తున్న ఓ యువతికి ఎదురైంది.. ఆ క్షణాన తనతో పాటు ప్రయాణిస్తున్న సహోద్యోగి వెంటనే స్పందించి రైల్వే మంత్రికి నేరుగా 'ట్వీట్' పంపాడు. రుతు సమయంలో తీవ్రమైన నొప్పిని ఎదుర్కొంటున్న ఆమెకు శానిటరీ నాప్కిన్లు, మాత్రలు పంపాలని ఆ యువకుడు చేసిన 'ట్వీట్'కు అనుకోని స్పందన లభించింది..



రైల్వే అధికారులు నాప్కిన్లు, మాత్రలను సకాలంలో అందించడంతో ఆమెకు కొద్దిసేపట్లోనే ఉపశమనం కలిగింది.. అర్ధరాత్రి సమయంలో రైల్వే మంత్రికి పంపిన 'ట్వీట్'ను సంబంధిత అధికారులు చూడడం, ఆపదలో ఉన్న యువతిని ఆదుకోవడం.. ఇదంతా చకచకా జరిగిపోయింది.. అందరికీ.. అన్ని వేళలా ఇలా స్పందన లభించకపోవచ్చు.. కానీ- బాధతో విలవిలాడిన యువతికి సకాలంలో సాయం అందడంతో రైల్వే అధికారులకు ప్రయాణీకుల ప్రశంసలు లభించాయి..

వినడానికి వింతగా ఉన్నా, ఇదేదో అభూత కల్పనలా అన్పించినా.. ముమ్మాటికీ ఇది నిజం. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే...

కలబురిగి (కర్నాటక)కి చెందిన విశాల్ ఖనపురే గత సోమవారం రాత్రి పదింపావుకు బెంగళూరు-హొస్పేట రైలు ఎక్కాడు. హైదరాబాద్‌లో అతనితో పాటు పనిచేస్తున్న యువతి కూడా అదే రైలులో ప్రయాణిస్తోంది. రైలు ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికి ఆమెకు కడుపులో నొప్పి ప్రారంభమైంది. ఊహించని రీతిలో రుతుస్రావం కావడంతో ఆమె కడుపు నొప్పితో ఇబ్బంది పడసాగింది. ఆమె అవస్థను గమనించిన విశాల్‌కు ఏం చేయాలో తోచలేదు. ఆ సమయంలో ఆమెకు నొప్పి నివారణ మాత్రలు, శానిటరీ నాప్కిన్లు అవసరమని గ్రహించాడు. అర్ధరాత్రి వేళ ఏ రైల్వే స్టేషన్‌లోనూ అవి లభించే అవకాశం లేదు. దీంతో ఆమె దీనపరిస్థితిని వివరిస్తూ రైల్వేమంత్రి పీయూష్ గోయల్‌కు 'ట్వీట్' చేశాడు. తన 'ట్వీట్'కు ఆ సమయంలో స్పందన వస్తుందని అతను అనుకోలేదు.

విశాల్ పంపిన 'ట్వీట్'కు 'ఇండియన్ రైల్ సేవ' విభాగంలోని అధికారులు వెంటనే స్పందించి, వాస్తవాలను తెలుసుకొనేందుకు పూర్తి వివరాలు పంపాలని సమాధానం పంపారు. ఆ స్పందనకు విస్మయం చెందిన విశాల్ వెంటనే తాను ప్రయాణిస్తున్న రైలు నెంబర్, కోచ్ నెంబర్, బెర్త్ వివరాలను పంపాడు. కాసేపటికి ఆ బోగీలోకి ఓ రైల్వే ఉద్యోగి వచ్చి విశాల్‌ను, అతని స్నేహితురాలిని పలకరించి వివరాలన్నీ నిజమేనని నిర్ధారణ చేసుకొని వెళ్లిపోయాడు. ఆ ఉద్యోగి వెళ్లిపోయి చాలాసేపు అయినప్పటికీ ఎలాంటి సాయం అందకపోవడంతో 'ట్వీట్'కు స్పందన ఉత్తిదే అని విశాల్ భావించాడు.

రాత్రి రెండు గంటల సమయంలో ఆ రైలు అరిసెకెరి జంక్షన్‌లో ఆగింది. కొందరు రైల్వే ఉద్యోగులు విశాల్ ఉన్న బోగీలోకి వచ్చి, నొప్పితో బాధపడుతున్న ఆ ప్రయాణీకురాలికి మాత్రలు, శానిటరీ నాప్కిన్లు అందజేశారు. స్నేహితురాలికి సకాలంలో సాయం అందడంతో 'ఇదంతా కలా? నిజమా?' అని ఆశ్చర్యపోవడం విశాల్ వంతయ్యింది. అనుకోని రీతిలో అర్ధరాత్రో, అపరాత్రో ఆరోగ్య సమస్యలు తలెత్తితే ప్రయాణీకులకు సాంత్వన కలిగించేందుకు రైళ్లలో కనీస వైద్య సౌకర్యం అందించేలా ఏర్పాట్లు చేయాల్సి ఉందని ఈ ఘటన చెప్పక చెబుతోంది.

అన్ని వేళల్లోనూ అధికార యంత్రాంగం ఇలాగే స్పందిస్తుందని భావించలేం. గనుక అర్ధరాత్రి వేళ ప్రయాణాలు చేసేవారు తమకు అవసరమైన మందులు తదితరాలను తమ వెంటే తీసుకొని వెళ్లడం కూడా మంచిదే.

★

నాణెం వేస్తే నాప్కిన్..

కాలం ఎంతగా మారినా ఇప్పటికీ ఎంతోమంది మహిళలు రుతుసమయంలో తమ బాధను ఇతరులతో చెప్పుకొనేందుకు సంశయిస్తుంటారు. రుతుక్రమం అనేది శారీరకమైన, సహజమైన ప్రక్రియ అని వైద్యులు ఎంతగా ప్రచారం చేస్తున్నా చాలామంది మహిళలు మౌనంగా బాధను భరిస్తుంటారు. ఈ విషయమై చైతన్యం తెచ్చేందుకు పలు నగరాల్లో ఇప్పటికే 'శానిటరీ నాప్కిన్ మిషన్ల'ను ఏర్పాటు చేస్తున్నారు. హర్యానాలోని కొన్ని కళాశాలల్లో విద్యార్థినుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ మిషన్లను ఏర్పాటు చేసింది. అయిదు రూపాయల నాణాన్ని ఈ యంత్రంలో వేస్తే శానిటరీ నాప్కిన్‌ను పొందవచ్చు. కోల్‌కత నగరంలో శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లు ఎక్కడెక్కడ ఉన్నాయో మహిళలు తెలుసుకొనేందుకు కొందరు విద్యార్థులు వినూత్న రీతిలో ఓ 'యాప్'ను రూపొందించారు. ఈ 'యాప్'కు 'బంధన్ శానిటరీ ప్యాడ్' అని పేరు పెట్టారు. జంషెడ్‌పూర్ వంటి నగరాల్లో మహిళలు ఉపయోగించే పబ్లిక్ టాయిలెట్ల వద్ద శానిటరీ నాప్కిన్లను పొందేలా 'వెండింగ్ మిషన్ల'ను ఏర్పాటు చేశారు.



అతినిద్రతో అనర్థాలు



నిద్రపోవడం అంటే ఇష్టంలేనివారు ఎవరూ ఉండరు. సాధారణంగా ఉద్యోగస్తులైతే ఒక్కరోజు సెలవు దొరికితే చాలు, హ్యాపీగా నిద్రపోవాలి, రెస్ట్ తీసుకోవాలి అనుకుంటారు. ప్రతి ఒక్కరికీ నిద్ర చాలా అవసరం. ఎంత అవసరం అంటే ఆరోగ్యానికి మంచి చేసేంత వరకు మాత్రమే. పనులు ఒకే ఒక్కరోజులో పూర్తయ్యేవి కావు. నిద్రమత్తువలన పనులపై సరైన విధంగా ఆసక్తిని చూపడం చాలా కష్టం. నిద్రను దూరం చేసుకోవడంవల్ల కలిగే రోగాలు, నష్టాల గురించి చాలామందికి తెలుసు. నిద్రే రోగంగా మారి పీడిస్తుంటే.. నిద్ర వద్దు బాబోయ్ అని ఎంత పట్టుదలగా వున్నా తెలియకుండానే నిద్రలోకి జారుకుంటే.. ఒకటికాదు రెండు కాదు ఏకంగా రోజుల తరబడి నిద్రలోనే ఉండిపోతే.. పరీక్ష కాలం వచ్చిందంటే చాలు పుస్తకాన్ని పట్టగానే నిద్ర ముంచుకొస్తే.. వాహనం నడుపుతున్నపుడు చిన్న కునికిపాటు.. యాక్సిలేటర్ తొక్కుతున్నామో, బ్రేక్ వేస్తున్నామో తెలియక నియంత్రణ కోల్పోయి రెప్పపాటులోనే జీవితాలు గాల్లో కలిసిపోతే.. వంట చేస్తూ ఉన్నట్లుండి నిద్రపోతే, ఆఫీసులో రాస్తూ రాస్తూ అకస్మాత్తుగా నిద్రపోతే... తింటూ ఉండగానే డైనింగ్ టేబుల్ పైన వాలిపోతే.. ఏంటీ విచిత్రం అని అనుకుంటున్నారా? అస్సలు నమ్మలేకపోతున్నారా? ఎవరు నమ్మినా నమ్మకపోయినా నిద్ర ఓ సమస్యగా మారి ప్రపంచాన్ని వేధిస్తోంది.


ఆరోగ్యానికి హానికరం..

మంచి ఆరోగ్యానికి రోజుకి కనీసం ఎనిమిది గంటలు నిద్రపోవాలని మనకు తెలిసిన విషయమే. మంచి నిద్ర ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో.. అతి నిద్ర అంత హాని కూడా చేస్తుందని అమెరికాకు చెందిన న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన పరిశోధకుల పరిశోధనల్లో వెల్లడైంది. అతిగా నిద్రపోయేవారికి గుండెపోటు వచ్చే అవకాశాలు 146 శాతం అధికంగా వున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

మెలకువ వచ్చినా లేవలేరు..

నిద్రపోయినపుడు పిలిస్తే లేసేవాళ్ళు కొందరు, ఒక్కసారి ముట్టుకుంటే చాలు ఉలిక్కిపడి లేచి కూర్చుంటారు మరికొందరు. కానీ అతి తక్కువ శాతం మంది మాత్రం ఎంత పిలిచినా ఉలకరు పలకరు. మెలకువ వచ్చినా లేవలేరు కూడా. నిద్రలేమివల్ల వచ్చే రోగాలతో పాటు నిద్రరోగాలు కూడా ప్రపంచాన్ని, ఈ సమాజాన్ని వేధిస్తున్నాయి.

> **" అధిక నిద్రతో డిప్రెషన్‌కు లోనవుతారని రీసెర్చ్‌లలో తేలింది. రెగ్యులర్ సమయాల్లో నిద్రపోవడం చాలా అవసరం. ఎక్కువగా నిద్రపోవడం లేదా తక్కువగా నిద్రపోవడం లేదా చాలా ఆలస్యంగా పడుకోవడం వల్ల ఊబకాయానికి దారితీస్తుంది. "**



డిప్రెషన్..

నిద్రలేమివల్ల డిప్రెషన్‌కు గురి అవుతారనేది సాధారణమైన విషయమే అయినప్పటికీ, అధిక నిద్రవల్లకూడా డిప్రెషన్‌కు లోనవుతారని రీసెర్చ్‌లలో తేలింది. రెగ్యులర్ సమయాల్లో నిద్రపోవడం చాలా అవసరం. ఎక్కువగా నిద్రపోవడం లేదా తక్కువగా నిద్రపోవడం లేదా చాలా ఆలస్యంగా పడుకోవడంవల్ల ఊబకాయానికి దారితీస్తుంది. వారాంతంలో లేదా సెలవుల్లో నిద్రించే సమయం కంటే అధిక సమయం నిద్రపోవడంవల్ల మెదడులోని కొన్ని న్యూరోట్రాన్సిమిటర్ల వల్ల అధిక తలనొప్పికి దారితీసే ప్రమాదముంది.

కారణాలు ఇవీ..

శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం, మనసులో అలజడి, మానసిక ఒత్తిడి మితిమీరిన స్థాయిలో ఆల్కహాల్ ద్రావణాలను తాగుట, పని ఒత్తిడి, రాత్రిపూట ఎక్కువగా సెల్‌ఫోన్‌ను ఉపయోగించడం, కంప్యూటర్, టీవీ ఎక్కువగా చూడటంవల్ల అతినిద్ర సమస్య తలెత్తుతుంది.

నిద్రమత్తును జయించండిలా..

సమయపాలనతో కూడిన నిద్రవలన రోజంతా ఉండే నిద్రమత్తు నుండి ఉపశమనం పొందవచ్చు. ప్రతిరోజు ఒకే సమయంలో నిద్రపోవటానికి ప్రయత్నించండి మరియు రోజూ ఒకే సమయానికి మేల్కొనండి. ఇలా చేయడంవలన శరీరానికి నిద్ర సమయం అలవాటుపడుతుంది.

సరైన సమయంలో పడుకోవాలి

ఎంచుకున్న నిద్ర సమయం సరిపోయేంతలా ఉండాలి. నిద్ర సమయం అనేది ఒక్కొక్కరికీ ఒక్కో రకంగా వుంటుంది. కొంతమంది 8 గంటలపాటు పడుకుంటే రోజంతా హుషారుగా వుంటే, మరొకరికి 5 గంటల నిద్రతో హుషారుగా వుంటారు. కావున ఎంత సమయం పాటూ నిద్ర సరిపోతుందో తెలుసుకొని, దానికి తగిన విధంగా నిద్ర సమయాన్ని కేటాయించుకోవాలి.

ఆల్కహాల్‌కు దూరం

ఆల్కహాల్‌కు దూరంగా వుండే ప్రయత్నం చేయాలి. రోజూ ఉదయాన లేవగానే కాఫీ లేదా టీ తాగటంవలన నిద్రమత్తు నుండి ఉపశమనం పొందుతారు.

ఉదయం వ్యాయామం

ఉదయాన వ్యాయామాలు చేయటంవలన రోజంతా చురుకుగా ఉంటారు. కనీసం అరగంట పాటు చేసే వ్యాయామాలవలన నిద్రమత్తునుండి ఉపశమనం పొంది, రోజులో ఉండే పనులను చురుకుగా నిర్వహిస్తారు.

ఆరోగ్యకరమైన స్నాక్స్...

జంక్‌ఫుడ్‌కు బదులుగా ఆరోగ్యకరమైన స్నాక్స్ తినటం వలన నిద్రమత్తు దరి చేరదు. కూరగాయలు, పండ్లనుండి మన శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి. పోషకాలు ఎక్కువగా అందటంవలన శక్తి ఉత్పత్తి త్వరగా జరగడంవలన నిద్రమత్తునుండి కూడా ఉపశమనం పొందుతారు.

ఒత్తిడికి యోగ విరుగుడు..

మానసిక ఒత్తిడిని జయించేలా యోగ, ధ్యానం వంటివి చేయాలి. నిద్రమత్తును తొలగించుకొని, రోజంతా చురుకుగా ఉండవచ్చు.


- డా॥ అట్ల శ్రీనివాస్‌రెడ్డి
97039 35321



బరిలో బామ్మ..!

సర్పంచ్ పదవికి పోటీపడుతున్న 90 ఏళ్ల మహిళ

'గ్రామం అభివృద్ధి చెందాలంటే మరోసారి మీరే సర్పంచ్‌గా గెలవాలి..' అంటూ ఆ ఊరి జనమంతా పట్టుబట్టడంతో- తొంభై ఏళ్ల వయసులో ఆమె ఎన్నికల బరిలో నిలబడక తప్పలేదు. 'తుది రక్తపు బొట్టు వరకూ ప్రజాసేవ కోసం కృషిచేస్తామ'ని గంభీరమైన హామీలిచ్చే బడానేతలకు భిన్నంగా- ఆమె అభివృద్ధిని చూపి పల్లెవాసుల మనసు దోచుకుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల కోలాహలం ఊపందుకొన్న తరుణంలో- ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా ఆమె వోటర్లను కలుసుకొంటున్నారు.



ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని తుమ్మలపల్లి సర్పంచ్ పదవికి తొంభై ఏళ్ల ఈద రత్తమ్మ పోటీ చేస్తుండడం తెలంగాణలో సంచలనం కలిగించింది. ఆమె భర్త చెన్నయ్య స్వాతంత్ర్య సమర యోధుడిగా, పటేల్‌గా గ్రామ ప్రజలకు సేవలందించారు. సర్పంచ్ పదవిని రెండుసార్లు నిర్వహించి ఆయన తుమ్మలపల్లి గ్రామ ప్రగతికి కృషి చేశారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వంటి ప్రముఖులతో కలసి చెన్నయ్య పనిచేశారు. దీంతో రత్తమ్మ గ్రామ ప్రజలందరికీ సుపరిచితురాలే. గతంలో సర్పంచ్‌గా రెండు సార్లు, జెడ్పీటీసీ సభ్యురాలిగా ఒకసారి ఆమె విశేష సేవలందించి జనం మెప్పు పొందారు. ఒకసారి సర్పంచ్ పదవికి పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిరాశ చెందక, పెనుబల్లి మండలం ఆవిర్భావంతో మొట్ట మొదటి జడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొంది రత్తమ్మ ప్రజాసేవకు అంకితమయ్యారు.

మరోసారి సర్పంచ్‌గా బాధ్యతలు చేపడితే అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, గతంలో కంటే ఎక్కువగా అభివృద్ధి పనులను చేసి చూపిస్తానని ఆమె భరోసా ఇస్తున్నారు. గ్రామస్తుల నుంచి కూడా ఒత్తిడి రావడంతో రత్తమ్మ ఎన్నికల సమరంలో నిలిచారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన ఆమె అధికార తెరాస మద్దతుతో పోటీచేస్తున్న జొనబోయిన రమణను పంచాయతీ పోరులో ఢీకొంటున్నారు.

1940 ప్రాంతంలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న రత్తమ్మ భర్త ఈద చెన్నయ్య అంటే ఇప్పటికీ తుమ్మలపల్లి వాసులు ఎనలేని గౌరవ మర్యాదులు చూపుతారు. నిస్వార్థ నేతగా, సమరయోధుడిగా తన భర్తకున్న మంచి పేరుతో ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని రత్తమ్మ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భర్తకున్న పేరు ప్రతిష్టలను నిలిపేందుకు జీవితాంతం తాను గ్రామం కోసం పనిచేస్తానని ఆమె అంటున్నారు. తన ఇంటి ఆవరణలో ఉన్న భర్త నిలువెత్తు విగ్రహం వద్ద కూర్చుని గ్రామస్థులను ఆమె ఆత్మీయంగా పలకరిస్తుంటారు. ప్రజాసేవకు వయసు ఎలాంటి ఆటంకం కాదని రత్తమ్మ ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో నాలుగోసారి పోటీ చేస్తున్న తనను గ్రామస్థులే గెలిపించుకొంటారని ఆమె చెబుతున్నారు.

★

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచుబ్రోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి సోమవారం, 21 జనవరి 2019

శ్రీనరసింహ శతకము

సీ॥ అతివిద్య నేర్చుట - యన్న వస్త్రములకె
పశులనార్జించుట పాలకొఱకె
సతిని బెండ్లాడుట సంసార సుఖముకే
సుతులఁబోషించుట గతుల కొఱకె
సైన్యముల్ గూర్చుట శత్రు భయంబుకే
దానమిచ్చుటలు ముందటి సంచితమునకె
ఘనముగాఁ జదువుటల్ కడుపుకొఱకె
తే॥ ఇతరకామంబుఁ గోరక సతతముగను
భక్తినీయందు నిల్పుట ముక్తికొఱకె
భూషణవికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: నరసింహప్రభూ! తిండి గుడ్డలకోసమే ఎక్కువ చదువులు. పాలకోసమే పసుల్ని సంపాదించటం. సంసార సుఖం కోసమే పెళ్లాడటం. పుణ్యలోక ప్రాప్తికోసమే బిడ్డల్ని కనటం. శత్రు భయంతోనే సైన్య సమీకరణం. చావుకోసమే సాము గరిడీలు నేర్వడం. జన్మాంతర సుఖం కోసమే దానం చేయటం. కోటి విద్యలు కూటికోసమే. అన్ని కోర్కెలు మానుకొని నీయందే భక్తిని నిల్పటమంటే మోక్షం కోసమే గదా!



40 -గోపరాజు నాగేశ్వరరావు

"దేవరకేంటి కొచ్చింది, ఆగ్గరవ్?" నగ్గూరాం అడిగాడు.

"ఏంటికో తెలవదుగానీ, మొత్తానికి దేవరకి అగ్గరవొచ్చింది. మనమీద పగబట్టిండి.

పగబట్టినోడు పావుల్నే అంపిత్తాడో- పులుల్నే అంపిత్తాడో - సివాల్నే అంపిత్తాడో -సంపటవ్ మాత్తరవ్ ఖాయం" అన్నాడు రాగ్యా, భయంతో వొణికిపోతూ.

అడవి పుత్రుల ఆవేశం అంతా చప్పున చల్లారి పోయింది! దాని స్థానంలో ఆందోళన చోటుచేసుకుంది!

"దేవర నీకు సెప్పిండా?" రాగ్యాని కాళీచరణ్ అడిగాడు.

"డైరేట్టుగా సెప్పలేదు"

"మరి?"

"ఇన్‌డైరెట్టుగా సెప్పిండు"

"ఎట్టా..?"

"దేవర మయిమతో నల్లకొండ కాడ తెల్ల కాకులు వాల్నయ్యి"

"తెల్ల కాకులా" అడవి పుత్రులు ఆశ్చర్యపోయారు.

".. అయ్యి అర్సినాయంటే రగతవ్ గక్కి సత్తారంట"

వాళ్ళ మొహాలు రక్తంతో తోడి వేసినట్టు పాలిపోయాయి!

".. అట్టా రగతవ్ గక్కి సత్తారని కాలగ్గేనవ్లో రాసిండంట- పోతులూరి యీరబ్రెమ్మంగోరు!

"నిజవేనంటావా?" కాళీచరణ్ అడిగాడు.

"ఏది? యీరబ్రెమ్మంగోరు సెప్పిందా? కాకులు వాలిందా?"

"తెల్ల కాకులు వాలింది"

"నిజ్జవే! కావాల్నంటే సూపిత్తాను"

"వాయమ్మో" అన్నాడు భయపడుతూ నగ్గూరాం.

"అంతేగాదు" అన్నాడు రాగ్యా.

"తండావాళ్ళు అతని వైపు చూసారు.

"..నెమిలి గుట్టలో ఎర్ర నెమిళ్ళు కనిపిచ్చి నయ్యి"

"ఎర్రనెమిళ్ళా..?"'

అందరూ నిర్ఘాంతపోరు.

"కావాల్నంటే సూపిత్తా- పదండి" అన్నాడు రాగ్యా.

వాడి మాటలు నమ్మాలా? వొద్దా? అని వాళ్ళు కొంతసేపు ఆలోచించారు. తర్జనభర్జనలు పడ్డారు.. చివరికి-

"సూపియ్యకపోతే..?" అన్నాడు బాణావతు.

"ఆడ్నే సావగొట్టండి" అన్నాడు రాగ్యా.

అక్కడే తేలిపోయింది! రాగ్యా చెప్పింది నిజమే అయ్యుండాలి.

నిజం కాకపోతే అలా ఎందుకు అంటాడు రాగ్యా?


తనవెంట వస్తే తెల్ల కాకుల్నీ, ఎర్ర నెమళ్లనీ చూపిస్తానని, అలా చూపించకపోతే చావగొట్టమనీ ఎందుకు అంటాడూ!

రాగ్యా చెప్పింది నిజమే అన్న నిర్ధారణకి వచ్చారు చాలామంది.

గుండెలు అవిసిపోయాయి!

నవనాడులూ కృంగిపోయాయి!

అలా జరిగింది దేవర జాతరకే కావటం మరింత ఆందోళనకు గురిచేస్తున్నది.



అంత కోపం దేవరకెందుకు వచ్చినట్టు?

అడవి పుత్రులమీద ఎందుకలా ఆగ్రహించినట్టు?

తండావాళ్ళు మొహాలు చూసుకున్నారు! ఎవ్వరి మొహంలోనూ జీవకళ లేదు. భయం గూడు కట్టి పాలిపోయి కనిపిస్తున్నాయి!

ఏం చెయ్యలో? ఏం చేస్తే దేవర శాంతిస్తాడో- ఆలోచిస్తున్నారు!

కొడుకుమీద కాళీచరణ్‌కింకా నమ్మకం కుదరట్టుంది!

"దేవర మహత్తేనంటావా?" అని అడిగాడు సందేహిస్తూ.

"అట్టా సెయ్యటవ్ మడుసుల వల్లగాదు! ఇంత మందిని ఒకేపాలి భయపెట్టాల్నాంటే అందరికీ శాతగాదు! పెడితే మడుసుల్లో పోలీసోళ్ళూ, దేవుళ్లలో దేవరే బెట్టాల!"

"దేవర ఏంటి కట్టా శాత్తన్నాడంటవ్"

"దేవరే సెప్పాలి" అన్నాడు రాగ్యా.

బాణావతు, కాళీచరణ్, నగ్గూరాం మాట్లాడుకొని అప్పటికే ఒక నిర్ణయానికొచ్చారు!

"అరే.. రాగ్యా! గొర్లని, మేకల్ని బలిచ్చి- ఆటి రగతవ్ వణ్ణంలో గలిపి 'బలెన్నవ్' నేవీజ్జంగా వెడితే, ఎసువంటి మాటైనా యినుకుంటాడా కొండ దేవర!

అట్టా దేవర కోపవ్ సల్లారుత్తావు గానీ, ముందుగాల మాకు తెల్లకాకుల్నీ, ఎర్ర నెమిళ్ళనీ సూపియ్యి" అన్నాడు కాళీచరణ్.

అందరూ రాగ్యా వెంట బయల్దేరారు.

ఇప్పుడు వాళ్లకి రాగ్యా విషయమే గుర్తులేదు. చేతుల్లో ఆయుధాలున్న ధ్యాసే లేదు. చాంద్‌నీ విషయం గుర్తులేదు. పంచాయితీ ఊసే లేదు!

యాంత్రికంగా రాగ్యా వెంట నడుస్తున్నారే కానీ, వాళ్ళ ఆలోచనలన్నీ తెల్లకాకుల మీద, ఎర్ర నెమళ్ళ మీద, కోపగించిన దేవర మీద, దేవర శాంతించేందుకు సమర్పించుకోవాల్సిన మొక్కుల మీద వున్నాయి!

అడుగుముందుకు వేస్తున్నకొద్దీ మృత్యువు దాపులోకి వెళ్తున్నట్టు భయంతో కృంగిపోతోన్నారు వాళ్ళంతా!

చివరికి- నమ్ముకున్న దేవర కూడా అలా కోపగిస్తే ఏమైపోవాలి?

పోలీసుల భయం నాగరికుల భయం. క్రూరమృగాల భయం.

విష సర్పాల భయం. దళారీల భయం. బ్రతుకు తెరువు భయం..

బ్రతుకంతా భయం భయంగా ఎలా జీవించాలి?

అడవి పుత్రుల కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి..

కొంతమంది రహస్యంగా ఏడుస్తున్నారు.

కొంతమంది నల్లకొండ వైపుకు దణ్ణాలు పెడుతున్నారు.

సాధారణ అడవి పుత్రులకు స్వేచ్ఛగా ఏడ్చే అవకాశమైనా వుంది!

తండా పెద్దల్లా గౌరవించబడుతూ, అందరికీ ఆపదలలో ధైర్యం చెప్పాల్సిన పెద్దలు ఏడిస్తే ఎలా? అడవి పుత్రులు మరింత బెంగ పెట్టుకుంటారు.

ఏడ్చే స్వేచ్ఛకూడా తమకు లేనందుకు బాణావతు, నగ్గూరాం, కాళీచరణ్ లోలోపలే కుమిలిపోతున్నారు..

నడుస్తున్నారు..నల్లకొండ మరోవైపు అడవిలోకి వెళ్తున్నారు.

రాగ్యా దారి చూపిస్తున్నాడు.

"అయ్యిగో... తెల్లకాకులు"అంటూ రాజ్యా పెద్దగా అరిచాడు.

విస్ఫోటనం జరిగినట్టే అందరూ అటువైపు చూసారు!

చెట్ల కొమ్మలమీద వాలి, తెల్లకాకులు కనిపించాయి!!

గుండెలు అవిసిపోయి, ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఉద్ధృతమై పొంగివస్తోన్న దుఃఖాన్ని దిగమింగుకొంటూ, స్థాణువులై నిల్చుండిపోయారు.

సన్నగా రోదనలు వినిపిస్తున్నాయి.


వెక్కిళ్ళు పెడుతున్నారు.

వాతావరణం గంభీరంగా వుంది!

"నెమిళ్ళని సూద్దాంవు- పదండి"అన్నాడు బాణావతు.

(ఇంకా ఉంది)

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)** విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనవసర వ్యయ ప్రయాసలుంటాయి. ప్రయాణాలెక్కువ చేస్తారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)** ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది. ధననష్టాన్ని అధిగమించుటకు ఋణప్రయత్నం చేస్తారు. కుటుంబ విషయాల్లో మార్పులు వుంటాయి.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)** విందులు, వినోదాలకు దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. మానసికాందోళనతో ఉంటారు. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ప్రతి చిన్న విషయంలో ఆటంకాలెదురగును. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)** ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు. బంధు, మిత్రులను కలుస్తారు. క్రొత్త కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)** ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలు ఖరీదు చేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్నిరంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభిస్తారు. ఋణవిముక్తి లభిస్తుంది. మానసికానందం పొందుతారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)** బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగ రంగంలో అభివృద్ధి ఉంటుంది. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ప్రయత్న లోపం లేకున్నా పనులు పూర్తిచేసుకోలేకపోతారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)** కుటుంబ విషయాలపై అనాసక్తితో ఉంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. కొన్ని కార్యాలు విధిగా రేపటికి వాయిదా వేసుకుంటారు. స్త్రీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)** బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. అనవసర భయం ఆవహిస్తుంది.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)** మానసిక ఆందోళన తొలగుతుంది. ఆరోగ్యం గూర్చి జాగ్రత్త వహించాలి. ఆకస్మిక భయం దూరమవుతుంది. ప్రయాణాల్లో మెలకువ అవసరం. ప్రయత్న కార్యాల్లో ఇబ్బందులెదురవుతారు. విదేశయాన ప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి.


● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)** ప్రయత్న కార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణబాధలు తొలగిపోతాయి. ధైర్యసాహసాలతో ముందుకు వెళ్తారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)** ప్రయత్న కార్యాలలో దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి ప్రతిష్ఠలు పొందుతారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)** కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా వున్నాయి. వేళ ప్రకారం భుజించుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. పిల్లలపట్ల ఏ మాత్రం అశ్రద్ధ పనికి రాదు.

మాటాట

నిర్వహణ: సుధామ 1850



అడ్డం	ఆధారాలు	నిలువు
1. నేటి అవతరణ దినోత్సవపు మూడు రాష్ట్రాల్లో ఒకటి	1. భూమి	8. మాసము
3. భూమి	2. లక్ష్మి	9. బకము
6. శలభము	4. అగర్తలా రాజధానిగా గల రాష్ట్రం	10. దుడ్డుకఱ్ఱ
10. విలసన స్త్రీ	5. రక్షకుడు	11. లోటు, నాళము
12. పక్షి	7. పైకి తీయు, సడలించు	12. సూర్యుడు
14. ఇంఫాల్ రాజధానిగా గల ఈశాన్య రాష్ట్రం		13. కేరళలోని ఓ పర్వత ప్రాంత పట్టణం

అడ్డం	మాటాట-1849 సమాధానాలు		నిలువు
1. మత గురువు	9. కన్య	2. తప్పు	6. రేవతి
4. రిమ్మ	11. రతి	3. రుతము	8. నార
5. రీము. 7. గింజ	13. రెబల్	4. రిత్తిక	11. సెల్
8. నావ	14. భారము	5. రీజవ	12. రెంబ

ప్రతి గృహం నిత్యాగ్నిహోత్రమే

హోమం, యజ్ఞాలు ఒకప్పుడు దేవతలు చేసేవారు. ఆ తరువాత రాజ్యం సుభిక్షంగా ఉండటంకోసం రాజులు ప్రజలయొక్క మేలుకోరి, రాజ్యం సదా పచ్చగా పాడిపంటలతో ఉండాలని, కరువుకాటకాలు రాకూడదని చేసేవారు. రానురాను యజ్ఞయాగాదులు, హోమాలు నిర్వహించడం చాలా తక్కువయింది. ఎక్కువగా దేవాలయాల్లో పండుగలు, పుణ్యదినాల్లోనే చేయడం చూస్తున్నాము. హోమాలు, యజ్ఞయాగాదులంటే పెద్దఎత్తున వ్యయంతో కూడుకున్నవి. సాధారణ మానవుడు వీటిని చేయడం కొంచెం కష్టమే అయినప్పటికీ వారికున్నటువంటి కీడు తొలగిపోయి ఆయురారోగ్యాలతో, కీర్తి సంపదలతో విలసిల్లాలని కొంతమంది హోమాలు చేస్తున్నారు. ఇలా హోమాలు నిర్వహించినపుడు బ్రాహ్మణులతోపాటు నల్గురికి చుట్టాలు, బంధువులు, ఆత్మీయులు, అన్నార్థులకు భోజనం కడుపునిండా పెట్టడం ఆచారం. అన్నదానం చేయడం అనేది హోమాలు, యజ్ఞయాగాదులు చేసిన దానిలో సగం పుణ్యకార్యం. అందుకే "అన్నం పరబ్రహ్మ స్వరూపం"అంటాము. ప్రతి మనిషి కూడా ఆకలితో ఎదురుచూడకుండా ఏ పూటకాపూట (రెండు పూటలు) అన్నం తిన్నట్లయితే (దొరికినట్లయితే) జీవితంలో సగం ఇబ్బందులు తొలగి ఎంతోకొంత సాధించినట్లే. అంతటి ప్రాముఖ్యత, ప్రాధాన్యత, పవిత్రత అన్నప్రసాదానికుంటుంది. హోమాలు, యజ్ఞయాగాదులు జరిపించి అన్నదానాలు చేసినట్లయితే ఆ పరమాత్మునికి నైవేద్యం పెట్టి ఆయన ఆకలి తీర్చినట్లే.

ఇక చెప్పుకుంటూపోయినట్లయితే ప్రతి ఇల్లూ ఇక నిత్య అగ్నిహోత్రమే అవుతుంది. ఎందుకంటె నిత్యం ప్రతీ ఇంట్లో వంట చేయడానికి పొయ్యి వెలిగిస్తూనే ఉంటారు. అన్నదానం చెయ్యడం చాలా గొప్పదే అయితే ఒక స్త్రీ ప్రతిరోజూ వంటచేసి భర్తకు, పిల్లలకు, కుటుంబ సభ్యులకు, చుట్టాలు, బంధువులు, పండుగలు, పర్వదినాల్లో వచ్చే అతిథులకు, అన్నార్థులకు, సాధువులకు భోజనం వండిపెట్టే శక్తి స్త్రీకే ఉంటుంది. యజ్ఞయాగాదులు, హోమాలు చేసినంతటి పుణ్యం, వేద మంత్రోచ్ఛారణ చేసినంత పుణ్యం వస్తుంది. వంట చేసేప్పుడు శుచి, శుభ్రతలు పాటించాల్సి వుంటుంది. మైల అంటకూడదు. ఇంకా కొన్ని కుటుంబాల్లో మడికట్టుకుని మరీ వంటలు చేస్తుంటారు. మనం తినే ప్రతీది దైవప్రసాదమే. దైవప్రసాదంగానే భావించాలి. అలాంటి పవిత్రమయిన వంటను స్త్రీలు బహిష్ఠు సమయాల్లో చేయరాదు. చేసినప్పటికీ ఎవరికీ అంటే సాధువులు లాంటి వారికి పెట్టరాదు. వీలయితే మగవారు ఆ రోజుల్లో వంట చేస్తే మంచిది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో నూటికి అరవై నుంచి డెబ్భై శాతం మందికి వంటచేయక తప్పటం లేదు. ఇప్పటికీ ఉమ్మడి కుటుంబాల్లో పెద్దవారు బహిష్ఠువచ్చిన స్త్రీలను వంట చేయనివ్వరు. అలా చెయ్యడం కాస్త ఇబ్బందిగానే ఉంటుంది. కానీ ఆచారాలు, వ్యవహారాల పేరుతో అలవాటును మార్చుకోలేని పరిస్థితి.

అగ్ని అనేది పంచభూతాల్లో ఒకటి. అతి పవిత్రమయినది. కాబట్టి అంతటి మహత్తుగల అగ్నిని అపవిత్రం చేయడం ధర్మంకాదు. ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాలను కొన్ని కట్టుబాట్లు బ్రతికించగలవు. భారతదేశంలో హిందూ మతానికి సంబంధించి స్త్రీకి గొప్ప ప్రాధాన్యత ఉంది. ఇలాంటి విషయాల్లో స్త్రీని కించపరచటం కాదుగానీ, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడంలో భాగమేనని చెప్పుకోవడంలో అతిశయోక్తి ఎంతమాత్రంకాదు. కాబట్టి ప్రతీ ఇల్లు, ఇంట్లోని పొయ్యి ఒక అగ్నిహోత్రమే, అదే విధంగా వంటచేసే ప్రతీ స్త్రీ ఒక వేదమంత్రాలు చదివే ఒక సద్బ్రాహ్మణుడే. అంతటి గొప్పతనం స్త్రీది.

-శ్రీనివాస్ పర్వతాల

చిల్లరదేవుళ్ళు

-దాశరథి రంగాచార్య

తెలంగాణం జన్మనిచ్చిన గొప్ప సాహితీమూర్తులలో గణనీయులు ఈ అన్నదమ్ములు..

నా తెలంగాణ కోటి రతనాల వీణ అని పలవరించి ఆ గడ్డనేలిన నవాబు నెదిరించి పోరాడి, ఉద్యమాలలో పాల్గొని అనేక పాట్లు పడిన మహాకవి పద్య దాశరథి అన్నగారయితే, ఆ అన్నకు తగిన తమ్ముడీ గద్య దాశరథి రంగాచార్యులు. తెలుగు నవలా సాహితీ విహాయసంలో తళుకులీనే నవలా నక్షత్రాలను పొదిగిన ఉత్తమ రచయిత. ఉత్తమ రచయితకు- ముఖ్యంగా సామాజిక నవలా రచయితకు- తన సమకాలీన సమాజ జీవితమే- సమకాలీన చరిత్ర మాత్రమే- సమకాలీన సంఘటనా సముచ్ఛయమే- కథా వస్తువు. సామాజిక వాస్తవికత నవలా శరీరానికి ప్రాణవాయువు. రచయిత తన జీవలక్షణం కొద్దీ ఆ వాస్తవ ఇతివృత్తానికి నవలారూపం ఇస్తాడు. కొందరి రచనలలో నిర్మాణచాతురి ముఖ్యంగా కానవస్తుంది. ఈ లక్షణం మాలపల్లి వంటి నవలల్లో గమనించగలం. వాటిలో నిర్మాణచాతురి పాఠకులను అబ్బురపరుస్తుంది. మరొకరి రచనలలో కొంత కల్పనా చాతురి గమనించగలం. నోరి నరసింహశాస్త్రి, అడవిబాపిరాజు వంటి రచయితలలో ఈ కల్పనా చతురి పాఠకులను ఆకర్షిస్తుంది. మరికొందరు రచయితలు కథనక్రమంలో అక్కడక్కడ అందాలు అద్ది పాఠకులను అలరిస్తారు. పిలకా గణపతి శాస్త్రి వంటి వారీ కోకు చెందుతారు.

ఆధునిక కాలంలో రాజకీయ నవల అనీ, వాస్తవిక రాజకీయ నవల అనీ కొందరు పేర్కొంటున్న నవలల కోవకు చెందిన వాటిలో ఉత్తమశ్రేణికి చెందిన నవల దాశరథి రంగాచార్య రచించిన

వినమరుగైన..

పెద్దిభొట్ల సుబ్బరామయ్య

చిల్లరదేవుళ్లు. ఈ కోవకు చెందిన రచయితలకు వాస్తవమే- ఏ మాత్రమూ కల్తీలేని వాస్తవమే-అది ఎంత నిష్ఠురమైనదైనా సరే ఎంత కఠోరమైనదైనా సరే ఎంత ఆబాధాకరమైనదైనా సరే- అత్యంత ముఖ్యం. ఫక్తు వాస్తవ చరిత్రనే ఆధారంగా చేసుకుని ఇతివృత్తంగా గ్రహించి నవలా రూపం ఇస్తారు. నిజానికి ఇది కత్తిమీద సాము వంటి సాహస ప్రక్రియ. ఇందులో రచయిత కల్పన చాటున దాక్కునేందుకు వీలేలేదు. రచనాక్రమంలో అక్కడక్కడ సొంత గొంతు వినిపించక పోదు కాని మొత్తంమీద ఈకోవకు చెందిన రచనలలో త్రాటిమీద నడక వంటి అమిత జాగ్రత్త తప్పనిసరి.

ఉన్నవ వారి మాలపల్లి, అడవి బాపిరాజు గారి నారాయణరావు, కోనంగి, విశ్వనాథ వారి వేయిపడగలు వంటి నవలలో కూడా ఆనాటి సమకాలీన రాజకీయాలు సామాజిక సమస్యలు చోటుచేసుకోవడం చూడవచ్చు. కాని అవే అందులో ఇతివృత్తం కాదు. వాటిలో రచయితల దృష్టి స్పష్టం. కాని చిల్లరదేవుళ్లు నవలలో రచయిత సాధించింది వేరు. అందులో ఇతివృత్తమే ఆనాటి ఒక ప్రాంతపు జన జీవితం. దేశంలో ఆనాడు సాగుతున్న జాతీయోద్యమం, సంఘ సంస్కరణోద్యమం, స్వాతంత్ర్యోద్యమం. అన్ని భాషలలోని కవులనూ రచితలనూ కుదిపివేశాయి. వాటి నుంచి బాధ్యత నెరిగిన రచయితలెవరూ తప్పించుకోలేదు. అద్భుతమైన స్పృహతో స్ఫూర్తితో అక్షరోపాసన చేసి అమూల్య రచనలు సృష్టించారు. సరిగ్గా అప్పుడే రాజకీయ నవల లేక సమకాలీన వాస్తవిక నవల జన్మించిందని చెప్పాలి.

అప్పుడు తెలంగాణ ప్రసక్తి ప్రత్యేకంగా వస్తుంది. ఇది దేశంలోని అనేక ఇతర ప్రాంతాల వలె కాదు. అనేక ఇతర ప్రాంతాలలో బ్రిటిష్‌వారి పెత్తనం ఉండేది. ఇంకా అనేక సంస్థానాలలో రాజుల జమీందారుల పెత్తనం ఉండేది. కాని తెలంగాణ చరిత్రే వేరు. ఆ సంస్థానానికి సంబంధించిన వ్యవహారమే వేరు. అక్కడి ప్రజలు ఒక స్వాతంత్ర్య పోరాటమే కాక మరో పోరాటం చేయవలసిన పరిస్థితి. తెలంగాణకు అదొక బీభత్స కాలం. నిజాం క్రూర నిరంకుశ పద ఘట్టనల క్రింద నలుగుతున్న జన జీవితం వెలుతురులేని బ్రతుకులు.. తల ఎత్తేందుకు వీలులేని పరిస్థితులు. ఇక నోరెత్తడమే ఘోర నేరం. అటువంటి క్రూర పరిపాలనకు వ్యతిరేకంగానూ, తమ సొంత భాషా సంస్కృతుల పరిరక్షణ నిమిత్తమూ, రైతాంగ సమస్యల పరిష్కారం కోసమూ బహుముఖంగా జరిగిన పోరాటం యావద్భారత దేశాన్నీ ఆకర్షించింది. అక్షరాలా విప్లవమనదగిన పోరాటం అది. యావద్భారతంలోని మేధావులనూ, కవులనూ, రచయితలనూ ఆకర్షించిన పోరాటం అది. అపుడు తెలంగాణలో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో కుటుంబాలు చితికిపోయాయి. ఎంతో రక్తం చిందింది. ఎందరో కటకటాలపాలై బాధలుపడ్డారు. అయితే ఎల్లప్పుడూ ఇటువంటి పోరాటాలలో అంతిమ విజయం ప్రజా సమూహానిదే అనే సత్యం ఇక్కడ కూడా నిరూపించబడింది.

- సశేషం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన -
శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ తెలుగు అనువాదం:
డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

198

తద్యాస్యైవం విద్వాన్ వ్రాత్యోరాజ్ఞో- తిథిర్గృహానాగచ్ఛేత్॥
శ్రేయాంస మేనమాత్మనో మానయేత్తథా
క్షత్రాయ నావృశ్చతే తథా రాష్ట్రాయ నా వృశ్చతే॥

"అట్టి సత్యవ్రత నిష్ఠుడైన విద్వాంసుడు రాజు ఇంటికి వస్తే అది తనకు సౌభాగ్యదాయకమని భావించాలి." దయానందులు తమ సత్యార్థప్రకాశం 4వ సముల్లాసంలో అతిథిని గూర్చి ఇలా ప్రస్తావించారు.

"తిథిని పరిగణింపక గృహానికి వచ్చేవానిని అతిథి అంటారు. అంటే ధార్మికుడు, ధర్మోపదేశకుడు, సర్వజనోపకారార్థంగా సర్వదా సర్వత్ర సంచరిస్తూ హఠాత్తుగా గృహస్థుని ఇంటికి వచ్చేవాడని అర్థం."

అతిథులవలన ప్రయోజనాన్ని వివరిస్తూ దయానందులిలా వివరించారు. ఉత్తముడైన అతిథి లోకంలోనే లేకుంటే అభ్యున్నతి జగత్తుకు ఉంటుందా? వారు దేశ సంచారంచేస్తూ సత్యోపదేశం చేయకుంటే దేశంలో వేద విరుద్ధాచారం ప్రబలిపోతుంది. అట్టి అతిథుల వలన గృహస్థులలో సత్యస్వరూప విజ్ఞానం వ్యాపిస్తుంది. అంతేకాక మానవులలో ఒకే ధర్మ బుద్ధి నెలకొంటుంది. అతిథుల సాహచర్యంలోనే గృహస్థులకు సందేహనివృత్తి కలుగుతుంది. దానివలననే ధర్మాచరణ ఎడల దృఢ నిశ్చయమేర్పడుతుంది. దానివలననే సమాజం సుఖసంతోషాలను పొందుతుంది. సత్యార్థ ప్రకాశం 4వ సముల్లాసం.

⁂

విద్వాంసుల సహాయం

యే స్థా మనోర్యజ్ఞియాస్తే శ్రుణోతన యద్వో దేవా ఈమహే తద్దదాతన।

జైత్రం క్రతుం రయిమద్వీరవద్య శస్తద్దేవానామవో అద్యా వృణీమహే॥

భావం:- నీవు- సజ్జనులుగా మనోవైజ్ఞానికులుగా ఎవరు ప్రసిద్ధి వహించియున్నరో వారి మాటలను వినుము. విద్వాంసులారా! మీనుండి దేనిని అర్థిస్తున్నామో అది విజయశైలమై, ఐశ్వర్యప్రదాయకమై, వీరోచిత కర్మసహితమై కీర్తివహించే రీతిగా అనుగ్రహించండి. మేము ఈనాడే విద్వాంసులకు సంరక్షణ, సుఖసంతోషాలు కలగాలని కోరుకొంటున్నాం.

వివరణ:- లోకంలో విద్వాంసులందరకు రక్షణ, సుఖ-సంతోషాలు, దైవ సహాయం కలగాలనే ఆకాంక్ష ఈ మంత్రంలో ప్రధానంగా ప్రకటింపబడింది. విద్వాంసుడే అవిద్వాంసులకు సన్మార్గోపదేశాన్ని చేయగలడు. మరయితే ఆ విద్వాంసుడెట్టివాడై యుండాలి?" ఈ విషయాన్నే ప్రస్తుత మంత్రం వివరిస్తూ 'యే స్థా మనోర్యజియాస్తే శ్రుణోతన'

"ఎవరు మనోః= నిత్యదైవ చింతనపరులో జ్ఞానవంతులో, యాజ్ఞికులో అంటే మనోవైజ్ఞానిక సంపన్నులో వారి మాటలనే విను." ఎవరినుండి అయినా తమ సమస్యలకు పరిష్కారాన్ని తెలుసుకోవాలని భావిస్తే ప్రతి వ్యక్తి ఎదుట తమ మనోవ్యథనంతా వెళ్లబోసుకోవాలా? అలా ఎప్పటికి చేయరాదు. దానం చేసేవాడు దానగ్రహీత పాత్రను దానగ్రహీం దాతయోగ్యతను విరించుకొనే రీతిగా తమ మనోవ్యథను చెప్పుకొనేముందు దానిని వినేవాడికి యోగ్యత- సహృదయత ఉందా అని తప్పక విచారించుకోవాలి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొనియే ప్రస్తుత మంత్రం వినేవారు 'మనోర్యజ్ఞియాః'= మనస్తత్వవేత్త కావాలని సూచించింది. అంటే వారు మనుష్యుల మనస్తత్వం తెలిసి మానవత్వంగల మనుష్యులుగా చేయుటయందు, మనిషిని మనీషి (జ్ఞాని)గా చేయుటయందు సదా మనస్సులలో చింతనాపరులై తదేకదీక్షా తత్పరులై యుండాలని మంత్రసారం. లోకంలో అట్టి మహాపురుషులను గుర్తించేందుకు వారి లక్షణాలెలా ఉంటాయో ఋగ్వేదం ఇలా వివరించింది.

యే సవితుః సత్యసవస్య విశ్వే మిత్రస్య వ్రతే వరుణస్య దేవాః

"సత్యాన్నే యజ్ఞకర్మగా సదా ఆచరించేవారు, లోకాన్ని మంచిగా సంస్కరించేవారు; విశ్వకర్తయైన భగవంతుని ఆజ్ఞలను శ్రద్ధాసక్తులతో ఆచరించేవారు యథార్థమైన యాజ్ఞికులు. విద్వాంసులు. దేవతలు అంటే జగన్నియామకుడైన భగవంతుని ఆజ్ఞలను శిరసావహించి జీవిత పర్యంతమూ ఆచరిస్తూ తమ నడవడికను సంస్కరించుకొనే దివ్యగుణ సంపన్నతకలవారే యజ్ఞీయులు- విద్వాంసులు- దేవతలు అని భావం. అట్టి మహాపురుషులు ఏది అర్థించినా అది తప్పక సిద్ధిస్తుంది. అయితే దేనినర్థించాలి? 'జైక్షతం క్రతుమ్'= విజయ ప్రదాయకమైన కర్మ మరియు 'రయిమాన్ వీరవాన్ యశః' ధనసంపన్నత- వీరుల వీరకృత్యాలతో సిద్ధించిన కీర్తి వైభవం. ఈ రెండింటిని దయతో ప్రసాదించే 'మహదద్య మహతామా వృణీమహే- వో దేవానామ్.' "విద్వాంసులకు గొప్ప రక్షణ, దైవ సాహాయ్యం, సుఖసంతోషాలు కలగాలని కోరుకొంటున్నాం"అని ఒక అర్థార్థి ఆకాంక్షగా ఋగ్వేదం ప్రకటించింది. ఆ విధంగా విద్వాంసులు ప్రసాదించిన ఆ రెండింటివలన కలిగే ప్రయోజనమేమిటో 'యథా వసువీరజాతం నశామహై' వీరులను తయారుచేసే ధనం మాకు లభించేయు"అన్న ప్రార్థనలో ఋగ్వేదం ప్రకటించింది. ఇది ఎంత గొప్ప ఉదాత్త ప్రార్థన. సాధారణంగా ధనంవలన సుఖసంతోషాలు కలగాలని ఎవరైనా కోరుకొంటారు. కాని ఆ ధర్మం దేశోద్ధరణ మరియు దేశరక్షణ చేసే వీరులు తయారగుటకు సహాయపడేది కావాలని కోరుకోవడంలోని వైదిక భావన ఏ కాలానికైనా చెక్కుచెదరని ఆదర్శభావనయే. వేదంలోని ఈ ప్రస్తావనకు విని విద్వాంసులే అర్థించిన వెంటనే దయతో వారు అన్ని అనుగ్రహిస్తారు. ఇక మన మేమీ చేయనవసరంలేదని నిష్క్రియగా ఉండవచ్చునని వేదం అనుమతించినట్లుగా భావించరాదు అని ఋగ్వేదమే ఈ సందర్భంలో-

తే సౌభగం వీరవద్ గోమదప్నో దధాతన ద్రవిణం చిత్రమస్మే

"ఐశ్వర్యవంతమూ, వీర సమన్వితమూ, గవాది పశు సంపద యుతమూ, ధనసాధన సమేతమూ అయిన అద్భుత కర్మలలో వారు మమ్ము నియోగించురు గాక!" అని ఒక సదా సత్కర్మోత్సాహవంతుని అభ్యర్థన రూపంగా హెచ్చరించింది. కర్మలయందు నియోగించమన్నమాట కర్థమేమంటే ఆ కర్మలను సాధించే యుక్తిని ఎరుకలోనికి తెమ్మని మాత్రమే. ఈ మంత్ర సందర్భంలోనే కాదు వేదంలో మరెక్కడైనా కోరికలు సిద్ధింపచేయుమన్న అభ్యర్థనలోని కోరికలన్ని సాధింపచేసుకొనే కర్మకౌశాకౌశలాన్ని అనుగ్రహించమని కోరిన అభ్యర్థనగా భావించాలి.

ఇంకావుంది...

త్రిపురాసుర వృత్తాంతం



104 మహాభారతంలో ఉపాఖ్యానాలు

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

"మా పట్టణంలో ఒక బావి కావాలి. శస్త్ర ఘాతాలతో మరణించిన దానవులను అందులో వేస్తే వారు పునర్జీవితులు కావాలి". ఆ విధంగా బ్రహ్మ వరం పొంది హరి ఆ పురంలో మృతులను బ్రతికించే బావిని సృష్టించాడు. దైత్యుడు ఏ రూపంలో చనిపోతే అతన్ని బావిలో పడవేస్తే ఆ రూపంతో బతికేవాడు. ఈ బావిని పొందిన దైత్యులు ముల్లోకాలను హింసించేవారు. బావి వలన వారికి క్షయం లేదు. వారు అన్ని లోకాలను కొల్లగొట్టసాగారు. దేవతలకు ఇష్టమైన ఉద్యానవనాలు, పవిత్రమైన ఋషుల ఆశ్రమాలు, జానపదాలు నాశనం చేయసాగారు. దేవతలను, పితృదేవతలను, ఋషులను నిలువ నీడలేకుండా చేశారు. ఈ విధంగా అన్ని లోకాలు ఆ దైత్యుల చేత పీడింపబడడం చేత, దేవతలందరూ ఇంద్రునితో కలిసి ఆ మూడు పురాలనీ అన్ని వైపుల నుంచి దాడిచేసి యుద్ధం చేశారు. కాని బ్రహ్మదేవుడి వరాల వల్ల ఆ పురాలను ఛేదించలేకపోయారు. దానితో భయపడి ఇంద్రుడు దేవతలతో కలిసి రాక్షసులు చేసిన అక్రమాలను గురించి చెప్పడానికి బ్రహ్మ దగ్గరకు వెళ్లాడు. వారు జరిగినదంతా పితామహునికి చెప్పి రాక్షసుల వధకు ఉపాయం చెప్పుమని ప్రార్థించారు.

అప్పుడు బ్రహ్మదేవుడు వారితో ఇలా అన్నాడు. "దేవతలారా! మీకు అపకారం చేసినవాడు నాకూ శత్రువే. దానవులు దుర్మార్గులు. వారు ఎప్పుడూ ఇతరులకు కీడు చేస్తూ ఉంటారు. ధర్మ ద్రోహులను తప్పక సంహరించాలి. కాని ఆ మూడు కోటలను ఒకేబాణంతో కొట్టాలి. అది వారికి నేనిచ్చిన వరమే. పరమేశ్వరుడు తప్ప అలా ఒక్క బాణంతో మూడు పురాలను ఇంకొకడు కొట్టలేడు. ఈశ్వరుడు మహత్కార్యాలను సునాయాసంగా చేయగలడు. ఆ మహాదేవుని మీరు ప్రార్థించండి".

అతని మాటలు విన్న దేవతలు, బ్రహ్మను ముందు ఉంచుకుని పరమేశ్వరుని దగ్గరకు వెళ్ళి ప్రార్థించారు. తేజోరాశి మూర్తీభవించిన తపస్వరూపుడు, జ్ఞాన స్వరూపుని వారు దర్శించి స్తుతించారు. దేవతలు, బ్రహ్మర్షులు కూడా అతని ముందు సాష్టాంగ నమస్కారాలు చేశారు. శంకరుడు వారిని ఆశీర్వదించి వారు తన దగ్గరకు వచ్చిన కారణం అడిగాడు. అప్పుడు వారందరు స్వామితో ఇలా అన్నారు "దేవా! నీవు దేవదేవుడవు. విలుకాడివి. ప్రజాపతుల చేత స్తుతించబడేవాడివి. శుభస్వరూపుడవు, పాపులను రుద్రరూపంలో శిక్షిస్తావు. నిన్నెవరూ జయించలేరు. నిరంతరం తపోరతుడివి; సకల ప్రాణులకు అధిపతివి. సూర్యచంద్రాగ్నులే కన్నులుగా కలవాడివి. నిన్ను శరణు జొచ్చిన మమ్ము త్రిపురాసురుల బారి నుండి కాపాడి రక్షించు. అప్పుడు బ్రహ్మ శివునికి నమస్కరించి ఇలా అన్నాడు. "మహాదేవా! ప్రజాపతిగా ఉన్న నేను దానవులకు గొప్ప వరం ఇచ్చాను. ఆ వర ప్రభావం వల్ల అహంకరించి క్షితిలోకాలను పీడిస్తున్నారు. వాళ్ళను నీవు తప్ప ఇంకొకడు చంపలేడు. దేవా! మమ్ము కాపాడు. దానవులను శిక్షించు."

అప్పుడు శంకరుడు వారి ప్రార్థనలకు సంతుష్టుడై వారితో ఇలా అన్నాడు మీ కోసం శత్రువులను వధిస్తాను. కాని ఆ దేవద్వేషులు వర బలంతో ఉన్నారు కనుక నేను ఒక్కడినీ వారిని సంహరించలేను. కనుక మీరంతా కలసి నా సగం తేజస్సుతో పరిపుష్టులయి ఏకమైతే శత్రువులను జయించగలము".


అప్పుడు దేవతలు శివునితో ఇలా అన్నారు - "దేవా! మా బలం కంటే వారి బలం రెండు రెట్లు అధికం" అప్పుడు శంకరుడు వారితో ఇలా అన్నాడు. "మీకు ఇంత హాని చేసిన వారిని సంహరించ వలసిందే! నా తేజస్సు బలాల అర్థభాగంతో వారిని జయించండి." అప్పుడు దేవతలు ఇలా విన్నవించారు. 'మహాదేవా! నీ తేజోబలాన్ని మేము భరించలేము. మా అందరి



సగం బలంతో నీవే శత్రువులను వధించు." వారి మాటలకు సమ్మతించి శంకరుడు వారితో ఇలా అన్నాడు. 'నా సగం బలం మీరు భరించలేకపోతే నేనే మీ అందరి సగం బలం స్వీకరించి ఆ దైత్యులను సంహరిస్తాను" ఇలా చెప్పి అతను దేవతల సగం బలం గ్రహించి సర్వ దేవతలకన్నా బలవత్తరుడు అయ్యాడు. అతనికి మహాదేవుడు అన్న పేరు సార్థకం అయింది. తర్వాత అతను తన శక్తికి సరిపోయే ధనుస్సు, బాణాలు, రథాన్ని వెతికి తెమ్మని దేవతలను ఆదేశించాడు. అప్పుడు దేవతలు ఇలా చెప్పారు. "మహాదేవా! మేము మూడు లోకాల తేజస్సులను ఎక్కువగా ఏకం చేసి నీ కోసం ఒక తేజోమయమైన రథాన్ని తయారుచేస్తాము. దానిని విశ్వకర్మ నిర్మిస్తాడు. అలా అని ఆ దేవశ్రేష్ఠులు ఒక చక్కటి రథాన్ని కల్పించారు. విష్ణువును, చంద్రును, అగ్నిని కలిపి బాణంగా తయారు చేశారు. ఆ బాణానికి అగ్రభాగం చంద్రుడు అయ్యాడు. శృంగాకార భాగం అగ్ని అయ్యాడు. పర్వతాలతో, నదులతో ఉన్న భూదేవిని రథం చేశారు. ఆ రథానికి ముందర పర్వతం ఇరుసు అయింది. మహానది అయిన గంగ ఇరుసుకు ఆధారమైన కొయ్య అయింది. దిక్కులు, విదిక్కులు రథానికి ఆవరణం అయ్యాయి. కృతయుగం కాడి అయింది. సర్పరాజు వాసుకి కూబరం అయ్యాడు. హిమవంతం రథానికి వెనుక ఉండే కర్ర అయింది. దేవతలు ఉదయాస్తమయ పర్వతాలను ఆ రథ చక్రాలకు ఆధారమైన కర్రగా చేశారు. సముద్రం రథానికి కట్టే త్రాడు అయింది. సప్తర్షి మండలం రథ చక్రాల రక్షణకు ఏర్పరిచే సాధనం అయింది. గంగ, సింధు, సరస్వతి నదులు, ఆకాశం తొట్టెకు ముందు భాగం అయ్యాయి. ఆ రథానికి బంధన సామగ్రి జలమ్మ సర్వ నదులూ అయ్యాయి. గ్రహాలు, నక్షత్రాలు రథానికి రక్షకమయిన ఆవరణం అయ్యాయి. ధర్మార్థ కామాలను కలిపి రథంలోని ఆసనం చేశారు సూర్యచంద్రులు, హిమవద్వింధ్య పర్వతాలు రథానికి గల చక్రాలు అయినాయి. పదిమంది సర్పరాజులను ఈషాదండంలో భాగం చేశారు. ఇంకా పెద్ద సర్పాలను గుర్రాలను కట్టే త్రాళ్ళను చేశారు. కాల పృష్ఠం, నహుషుడు, కర్కోటకుడు, ధనంజయుడు ఇంకా తక్కిన సర్పాలను గుర్రాల జూలును కట్టే త్రాళ్ళను చేశారు. ఇంద్ర, వరుణ, యమ, కుబేరులు ఆ రథానికి గుర్రాలు అయ్యారు. సినీ వాలి, కుహువు, అనుమతి సువ్రత అనే దేవతలను గుర్రాలకు పగ్గాలను చేశారు. ధర్మం, సత్యం, తపస్సులను కళ్ళేలను చేశారు. రథానికి ఆధారభూమి మనస్సు అయింది. సరస్వతీ దేవి రదమార్గమయింది. గాయత్రి రథం పైభాగాన కట్టే త్రాడు అయింది. పూర్వం పరమేశ్వరుని యజ్ఞంలో నిర్మితమైన సంవత్సరం ధనుస్సు, సావిత్రి అల్లెత్రాడు అయ్యారు. మేరు పర్వతం జెండా కర్ర, మేఘాలు మెరుపులతో కలిసి పతాకాలు అయ్యాయి. సమస్త లోకతేజంతో నిర్మితమైన ఆ రథాన్ని చూసి దేవతలు సంతోషించి తమకు విజయం తథ్యమని భావించారు. రదం సిద్ధంగా ఉందని వారు శంకరునికి నివేదించారు. అతను తన ఆయుధాలను రథంలో ఉంచాడు. ధ్వజాన్ని ఆకాశంలోకి ఎగురవేసి దానిపై తన వాహనం అయిన నందిని ఉంచాడు. అథర్వంగీరసులు శివునికి చక్రరక్షకులయ్యారు. ఋగ్వేదం, సామవేదం, పురాణాలు ముందుండి రథం శోభను పెంచాయి. యజుర్వేదం, ఇతిహాసాలు వెనుకభాగాన్ని రక్షించేవి అయ్యాయి. ఓంకారం అగ్రభాగాన ఉండి శోభించింది. ఆరు ఋతువులతో కూడిన సంవత్సర కాలాన్ని ఒక విచిత్రమైన ధనుస్సును చేసి, శంకరుడు తన నీడనే అల్లె త్రాటిని చేశాడు. విష్ణువు అగ్ని చంద్రుడు కలిసి బాణ రూపం దాల్చారు. రుద్రుడు కాల స్వరూపుడు కనుక అతనికి సంవత్సరం ధనుస్సు అయింది.

-ఇంకావుంది

పరమహంస బోధామృతము



సత్త్వగుణ ప్రధానమగు విద్యామాయ శరణు జొచ్చితి మేని మనల నది ధర్మమార్గమున నడిపి భగవంతుని బొందించును. భగవత్సాక్షాత్కారము నొందినవాడే మాయారూపమైన సంసారసాగరమును దాటుచున్నాడు. భగవంతుడే కర్తయనియు స్వయముగా తాను అకర్తననియు అశక్తుడననియు గ్రహించునతడు జీవన్ముక్తుడగుచున్నాడు. అనగా ఈ శరీరమునుండగనే ముక్తుడగుచున్నాడు.

ముక్తునియందలి అహంకారము

129.అహంకారము ఎన్నడును పూర్తిగా నశింపదా? కాలపరిపాకమున కలువరేకులు రాలిపోవును. కాని వాని గురుతులు నిలిచియుండును. అటులనే ఈశ్వర సాక్షాత్కారము పొందునేని నరుని అహంకారము పూర్తిగా తొలగిపోవును, కాని దాని జాడలు మాత్రము నిలిచియుండును. ఐనను దాని వలన నెట్టి హాని గలుగదు.

130.భగవత్సాక్షాత్కారము నొందినవాడే నిజమైన జ్ఞాని. అతడు పసిబాలుడు బోలును. బాలునికి గూడా నొక వ్యక్తిత్వము ఉన్నటులే తోచును. కాని అది పైకి గాన్పించునదే కాని వాస్తవమైనది కాదు. వయసు వచ్చినవారి వ్యక్తిత్వ భావముతో- అహంకారముతో-బోల్చి చూచినయెడల పసివాని అహంకారము ఒక అహంకారమే కాదు.

131.సప్తమ భూమికను లేదా ఉత్తమమైన సమాధి స్థితిని బొంది బ్రహ్మ భావమున లయము గాంచిన మహాత్ములు కొందరు ఉందురు. వారు లోక శ్రేయముగల్గింప కరుణ కలవారై తమ మహోన్నత స్థితి నుండి దిగివత్తురు. అట్టివారు విద్యారూపమైన అహంకారమును- ఉత్తమాత్మభావమును నిలుపుకొనియే యుందురు. కానీ యీ అహంకారము పేరునకు మాత్రమే. ఇది నీటిమీద గీచిన గీతను బోలియుండును.

132.తగులబడిన త్రాటికి పూర్వపు ఆకారమున్నను అది దేనిని కట్టుటకు పనికిరాని చందమున జ్ఞానాగ్నిచే దగ్ధమైన అహంకారము (కర్మబంధమును గల్గింపశక్తిలేనిదై) ఉండును.

133.ఎవ్వడో తనను ఖండ ఖండములుగా నరికి వేయుటకై వచ్చుచున్నటుల ఒకడు కలగాంచును. అడలిపోయి మేల్కొనును. కన్నులు విప్పి చూడగా గదిలోపల గడియ వేయబడియే యుండును. గదిలో తాను తప్ప మరెవ్వరును ఉండరు. అయినను కొన్ని నిమిషముల వరకు వాని గుండెలు దడ దడ కొట్టుకొనుచునే యుండును. అటులనే మన అభిమానము లేదా అహంకారము మనలను వీడిచనునప్పుడు గూడా దాని వడి కొంతవరకు శేషించియే యుండును.

134.సమాధి స్థితిని బొందిన పిమ్మట కూడా భగవత్సేవకుడనను అహంకారముగాని, భగవద్భక్తుడనను అహంకారముగాని కొందరు నిలుపుకొందురు. శంకరాచార్యులు ఇతరులకు బోధించుటకై విద్యా రూపమగు నహంకారమును నిలుపుకొనిరి.

135. హనుమంతుడు భగవంతుని సాకారునిగను నిరాకారునిగను కూడా దర్శించు భాగ్యము పొందెను. ఐనను ఆతడు భగవత్సేవకుడనను అహంకారమును నిలుపుకొనెను. నారద సనక సనత్కుమారుల విషయము కూడా నిట్టిదే.

ఒక భక్తుడు: నారదాదులు బ్రహ్మజ్ఞానము బొందిన వారే. కాని వారు గలగలలాడుచు బ్రవహించు సెలయేటి చందనమున భగవద్గుణానుభవ కథనము స్తోత్రములను సాగించుచువచ్చిరి. తరుణోపాయమగు తత్త్వములను జనులకు బోధించుటకై విద్యారూపమైన యీ అహంకారమును- వ్యక్తిత్వపు జాడను- భగవంతుని నుండి తాము వేరను స్పృహ గలుగుటకై లేశమైన యీ అహంతను నిలుపుకొనిన వారని తెలియనగును.

ఇంకావుంది...

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల
శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము -
అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

సుందరకాండ

ఇటువంటి సమయాలలోనే సుందకాండ పనిచేస్తుంది. అలాగే. లౌకికమైన కార్యాన్ని ప్రారంభించిన వాడు కూడా. ఎంత తంటాలు పడ్డానండీ పనికాలేదు- అంటాడు. అలాకాక పని పూర్తయ్యే వరకు తంటాలు పడాలని తెలుసుకోవాలి. ఎందుకంటే- ఒక్కొక్కప్పుడు పని అయ్యే స్థితిలో మానేస్తాం. మనకు తెలియక. అలాగే- దైవానికి మన కేక వినబడే పరిస్థితి వచ్చేటప్పటికి జపాన్ని మానేస్తాం. ఇదంతా ఎందుకు వస్తుందంటే- నేను జపం చేస్తున్నాను. నేను కార్యం నడుపుతున్నాను- అని అనుకొనటం వలన అలాకాక ఇది నా పని. దాన్ని నేను నిర్వహిస్తున్నాను. అది నెరవేరే వరకు ఇలాగే చేస్తూ ఉంటాను. అని అనుకొంటే యిబ్బంది లేదు. కనుక పురుషకారం అహంకారం మూలకమవుతున్నది. సరే స్వామి ఆలోచిస్తున్నాడు.

క్షిప్ర ముత్పతతో మన్యే సీతామాదాయ రక్షసః
బిభ్యతో రామ బాణానామంతరా పతితా భవేత్.

దొంగిలించుకొని వస్తున్న రావణునికి మార్గమధ్యంలో జ్ఞాపకం వచ్చి ఆ సీతను సముద్రం లోనికి తోసి వేసేడేమో- కాకపోతే వాడి గమన వేగానికి తట్టుకోలేక ఆవిడే సముద్రంలోకి జారి పోయిందేమో- కాకుంటే ఈ దుష్ట రాక్షస స్త్రీలు తినేసేరేమో- లేకపోతే రామ విరహాన్ని భరించ లేక ఆమెయే ప్రాణ త్యాగం చేసిందేమో కనుక-

వినష్టావా ప్రాణష్టావా మృతావా జనకాత్మజా
రామస్య ప్రియభార్యస్య ననివేదయితుం క్షమమ్.

ఆమె ఎలా మరణించినా ఈ వార్తను రామచంద్రునకు నివేదించుటలో నేను సమర్థుణ్ణి కాను. అనుకొన్నాడు. ఇదీ అజ్ఞానం. అప్పుడే ఆమె చనిపోయిందని అనుకొన్నాడు. నేను సర్వం చూసేను అని అనుకొన్నాడు. సీతాన్వేషణ విషయంలో నా పని పూర్తి అయిందని అనుకొన్నాడు. ఈ దుఃఖ వార్తను రామచంద్రునకు ఎలా చెప్పను. చెప్పకుండా ఎలా ఉండను.

మానే దోష స్స్యా ద్దోష స్యాదని వేదనే.

చెబితే దోషం. చెప్పకపోతే దోషం. సోతను చూడకుండగా సుగ్రీ పట్టణం వెడితే నేనేమి సాధించినట్లు. సరే- వెడతాను.

గత్వాతు యది కాకుత్థ్సం వక్ష్యామి పరమప్రియం
సదృష్టేతి మయా సీతా తతస్త్య క్ష్యతి జీవితమ్

సీత కనబడలేదని చెబుతాను. అంతకుముందే మూడు దిక్కుల వారూ వచ్చి ఈ మాటనే చెబుతారు. నేను కూడా అలాగే చెబితే సీతా మరణవార్తను చెప్పినట్లవుతుంది.

వెంటనే శ్రీరాముడు జీవితాన్ని విడిచి పెడతాడు.

అతనితో సరిపోతుందా! రాముని యందు నిత్యానురక్షుడైన లక్ష్మణుడు మరణిస్తాడు. ఆ తరువాత సోదరుల మరణవార్తను విని భరతుడు మరణిస్తాడు. అది చూసి శత్రుఘ్నుడు మరణిస్తాడు. పుత్రమరణాలకు తట్టుకోలేక- కౌసల్య సుమిత్రా కైకేయీలు మరణిస్తారు. ఇదంతా చూసి-

అనిన మాటను నిలబెట్టుకోలేక పోయేనే అని దుఃఖంలో సత్యసంధుడైన మారాజు సుగ్రీవుడు మరణిస్తాడు. ఆ తరువాత భర్తృ వినియోగంతో మారాణి 'రుమ'మరణిస్తుంది. తరువాత తార మరణిస్తుంది. మాతాపితృ పితృవ్య వియోగంతో యువరాజు అంగదుడు మరణిస్తాడు. ప్రభు మరణాలను చూసిన మా వానరులు రాళ్ళతో తలలు బ్రద్దలుకొట్టుకొని మరణిస్తారు. ఆ తరువాత వారి భార్యాపుత్రులందరూ విషం త్రాగో ఉరిపోసికొనో బలవన్మరణాన్ని పొందుతారు- ఇలా

నేను వెళ్ళటం వలన అటు ఇక్ష్వాకుల కులం ఇటు వానర కులం సర్వనాశనమయిపోతాయి.

ఒక్క క్షణకాలంలో- స్వామి దృష్టిలో అటు రఘుకులం ఇటు వానర కులం సర్వనాశన మయిపోయేయి. స్వామి ఏకాకి అయి ఉన్నాడు.

విషాదయోగంలో ఉన్నాడు.

ఇంకావుంది...

అష్టావక్రగీత



ఏ ముని బాలకుని వలె కామనారహితుడై సర్వక్రియారంభముల యందు చరించునో అటువంటి పరిశుద్ధ స్వరూపునకు కర్మ చేయబడుచున్నది అయినప్పటికీ లోపము కలుగదు.

ఎవడు చూచుచు, వినుచు, తాకుచు, వాసన చూచుచు, తినుచు సమస్త భావములయందును సముడై ఆశారహితుడో వాడే ధన్యుడు, ఆత్మజ్ఞుడు.

ఎల్లప్పుడు ఆకాశము వలె సంకల్పరహితుడగు ధీరుడగు జ్ఞానికి సంసారము ఎక్కడ? దాని యొక్క భావము ఎక్కడ? సాధనములైన యజ్ఞాదులు ఎక్కడ?

ఎవనికి స్వాభావికమైన సమాధి పూర్ణ స్వరూపమునందు ఉంటున్నదో అటువంటి అర్థయుక్తుడగు సర్వసంగ పరిత్యాగి, పూర్ణానంద స్వరూపుడగు జ్ఞాని సర్వోత్కృష్టుడగుచున్నాడు.

ఈ విషయమై పెక్కు విధములు చెప్పుట చేత ఏమి ప్రయోజనము, తత్త్వము నెరిగినవానికి, భోగ మోక్షముల ఆశను విడిచిపెట్టినటువంటి జ్ఞాని ఎల్లప్పుడు ఎల్లయెడల రాగద్వేష రహితుడై ఉంటున్నాడు.

మహత్త్వము మొదలగు ద్వైత జగత్తు నామమాత్ర భిన్నమై యున్నది. దానిలో కల్పనను విడిచిపెట్టి శుద్ధ బుద్ధ స్వరూపునికి ఏమి కర్తవ్యము మిగులుచున్నది.

ఈ సమస్త ప్రపంచము, భ్రాంతి మూలము కొంచెమైనను లేనిది ఈ ప్రకారము నిశ్చయము కలిగినటువంటిన్ని, పరిశుద్ధుడైనటువంటిన్ని చైతన్యాత్మానుభవము గల జ్ఞాని స్వాభావికముగనే శాంతిని పొందుచున్నాడు.

దృశ్యభావమును చూడనటువంటి శుద్ధ స్ఫురణ, శుద్ధ ప్రకాశ స్వరూపుడు అగు జ్ఞానికి విహిత కర్మానుష్ఠాన రూపనిధి ఎక్కడ? వైరాగ్యం ఎక్కడ? త్యాగం ఎక్కడ? శమము ఎక్కడ?

అనంత రూపములతో ప్రకాశించు చున్నప్పటికీ మాయను జయించునటువంటి జ్ఞానికి బంధము ఎక్కడ? మోక్షము ఎక్కడ? సంతోషము ఎక్కడ? దుఃఖము ఎక్కడ? బుద్ధిపర్యంత సంసారము నందు మాయా విశిష్టమగు చైతన్యము ప్రపంచమును కల్పన చేయుచున్నది. జ్ఞాని మమతారహితుడను, అహంకార రహితుడును, కామరహితుడునై ప్రకాశించుచున్నాడు.

నాశరహితమైనటువంటిన్ని సంతాప రహితమైనటువంటి ఆత్మను చూచుచున్నటువంటి మునికి శాస్త్రము ఎక్కడ? ప్రపంచము ఎక్కడ? దేహము ఎక్కడ? నేను, నాది అనెడి భావము ఎక్కడ?

అజ్ఞాని చిత్తనిరోధము మొదలగు కర్మలను విడిచిపెట్టబడునట్టి వాడు అయినప్పటికీ కొంతసేపటికి కోరికలను సంభాషణలను చేయుటకు ప్రవృత్తుడగుచున్నాడు. మూర్ఖుడు ఆ ఆత్మ వస్తువును వినినప్పటికినీ మూఢత్వమును విడిచిపెట్టడు. వెలుపటి లోపల యత్నమువలన సంకల్పరహితుడు కాని లోపల విషయలాలసుడు అగుచున్నాడు. ఎవడు జ్ఞానము వలన నష్టమైన కర్మలు గలవాడై లోకదృష్టికి కర్మ చేయుచున్నవానివలె వున్నాడో అట్టివాడు కొంచెమైనను కూడా చేయుటకు గాని, మాట్లాడుటకు గాని అవకాశమును పొందడు. ఎల్లప్పుడు వికారరహితుడును, సంతాపభయాది రహితుడును నగు జ్ఞానికి తమస్సు ఎక్కడ? ప్రకాశము ఎక్కడ? త్యాగము (విడిచిపెట్టదగినది) కొంచెము కూడా లేని అనిర్వాచ్య స్వభావము కలిగినటువంటిన్ని, స్వభావ రహితుడైనటువంటి యోగికి ధీరత ఎక్కడ? వివేకత్వము ఎక్కడ? నిర్భయత్వము కూడా ఎక్కడ?

-గెంటేల వెంకటరమణ

..మహాలక్ష్మి ముగించింది

తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న దట్ఈజ్ మహాలక్ష్మి షూటింగ్ పూర్తిచేసుకుంది. సాధారణ యువతినుంచి అసాధారణ మహిళగా ఎలా మారుతుందనే కథతో దటీజ్ మహాలక్ష్మి సినిమా తెరకెక్కుతుంది. ఈమధ్యే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అమిత్ త్రివేది ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉంది. త్వరలోనే చిత్ర యూనిట్ విడుదల తేదీని ప్రకటించనున్నారు. మైఖెల్ ట్యాబ్యురియస్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. టైజాన్ ఖొరాకివాలా దటీజ్ మహాలక్ష్మి సినిమాను సమర్పిస్తున్నారు. మెడైంటే ఇంటర్నేషనల్ బ్యానర్‌పై మను కుమరన్ ప్రొడక్షన్‌లో ఈ చిత్రం వస్తుంది. తమన్నాను ప్రముఖ బాలీవుడ్ క్రిటిక్స్ రాజీవ్ మసంద్, అనుపమ్‌చోప్రా ఇంటర్వ్యూ చేసి సినిమా ప్రమోషన్‌ను ఘనంగా మొదలుపెట్టారు. నటి పరుల్‌యాదవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా ఉన్నారు.





నీడే వెంటాడితే..

మనిషి శత్రువుతో యుద్ధం చేస్తే గెలుస్తాడు. కానీ తన నీడతోనే యుద్ధం చేయాల్సివస్తే.. అలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న యువకుడు ఎలా బయటపడ్డాడు. ఎలా సక్సెస్ అయ్యాడు అనేది తెలుసుకోవాలంటే 'నిను వీడని నీడను నేనే' చూడాల్సిందే అంటున్నారు యువ కథానాయకుడు సందీప్ కిషన్. ఇదొక ఎమోషనల్ హారర్ ఎంటర్‌టైనర్. ఇప్పటివరకు ఎవరూ టచ్‌చేయని కథాంశంతో రాబోతోంది. వెంకటాద్రి టాకీస్, విస్తా డ్రీమ్ మర్చంట్స్ పతాకాలపై కార్తిక్‌రాజు దర్శకత్వంలో దయా పన్నెం, విజి సుబ్రహ్మణ్యన్ నిర్మాతలుగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న చిత్రం 'నిను వీడని నీడను నేనే'. ఎస్.ఎస్.తమన్ సంగీత సారథ్యం వహిస్తున్నారు. ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనీల్ సుంకర ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు కార్తీక్‌రాజు మాట్లాడుతూ 'కొత్త పాయింట్ తీసుకుని ఎమోషనల్ హారర్ ఎంటర్‌టైనర్ కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో, హైటెక్నికల్ వేల్యూస్‌తో రూపొందిస్తున్నాం. సందీప్ కిషన్ తొలిసారి నటిస్తోన్న హారర్ చిత్రమిది. ఫైనల్ షెడ్యూల్‌ను హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నాం. హీరోహీరోయిన్‌ల పై కొన్ని కీలక సన్నివేశాలు, ఒక ముఖ్యమైన పోరాట సన్నివేశం చిత్రీకరించటంతో సినిమా పూర్తవుతుంది' అన్నారు. నిర్మాత దయా పన్నెం మాట్లాడుతూ 'దర్శకుడు కార్తీక్ సినిమాను అనుకున్న ప్లానింగ్ ప్రకారం పూర్తిచేస్తున్నారు. ప్రస్తుతం ఫైనల్ షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అన్నారు.



రీమేక్‌లంటే ఇష్టం లేదు

కథాబలం ఉన్నా పాత్రల్లో నటిస్తూ బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా పేరుతెచ్చుకుంది విద్యాబాలన్. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీపైనా దృష్టి సారించింది. బాలకృష్ణతో ఎన్టీఆర్ బయోపిక్‌లో బసవతారకంగా కనిపించిన విద్య, తల అజిత్ నటించనున్న పింక్ రీమేక్‌లోనూ నటించనుందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ రీమేక్ సినిమాల్లో నటించడం ఇష్టం ఉండదని, కానీ బోనీకపూర్ పింక్ రీమేక్‌లో అతిధి పాత్రలో నటిస్తావా? అని అడిగేసరికి అతనితోవున్న ప్రత్యేక అనుబంధం కారణంగా కాదనలేకపోయానని చెప్పింది. ఖాకీఫేమ్ వినోత్ తెరకెక్కించనున్న ఈ చిత్రం ఫిబ్రవరిలో సెట్స్ మీదకు వెళ్లనుంది. ఇక ఈ చిత్రంతోపాటు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్‌లోనూ విద్యాబాలన్ నటించే అవకాశాలు ఉన్నాయని సమాచారం.



ఎమ్మెల్యేగా అనసూయ

యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి బుల్లితెర ప్రేక్షకులను ఆకట్టుకుని ఇటీవల సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది ప్రముఖ యాంకర్ అనసూయ. అందులో భాగంగా క్షణం, రంగస్థలంలాంటి చిత్రాల్లో తన నటనతో ఆకట్టుకుంది. ప్రస్తుతం అనసూయ ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న యాత్ర బయోపిక్‌లో నటిస్తుంది. ఈ చిత్రంలో ఆమె కర్నూల్ ఎమ్మెల్యే చరితారెడ్డి పాత్రలో కనిపించనుందట. పాదయాత్ర సమయంలో 2004లో కాంగ్రెస్ పార్టీ తరఫున నందికొట్కూరు నియోజకవర్గం నుండి పోటీచేసి చరితారెడ్డి ఏవిధంగా గెలిచింది, పార్టీకోసం ఆమె కష్టపడిన తీరును అనసూయ పాత్ర ద్వారా సినిమాలో చూపించనున్నారు. ఇక చిత్రంలో అనసూయ డీగ్లామరైజ్డ్‌గా కనిపించనుంది. మహి వి రాఘవ్ తెరకెక్కిస్తున్న చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ఫిబ్రవరి 8న తెలుగుతోపాటు మలయాళం, తమిళ భాషల్లో విడుదల కానుంది.



నవ్వుల పండుగే

విక్టరీ వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ హీరో హీరోయిన్లుగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'ఎఫ్-2' సక్సెస్‌మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో మెహరీన్ మాట్లాడుతూ సినిమాను హిట్ చేసి మేమే ది బెస్ట్ అని ప్రేక్షకులు ప్రూవ్ చేశారన్నారు. అనీల్‌తో రెండు సినిమాలు చేసే అవకాశం దక్కిందని, ఎస్‌విసిని హోం బ్యానర్‌లా ఫీల్ అవుతానంది. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ ఎఫ్-2 టైటిల్‌తో అనిల్ వీ 2(వెంకటేష్, వరుణ్‌తేజ్- విక్టరీ) సాధించాడన్నారు. మా బ్యానర్‌లో 31వ సినిమాగా ఎంటర్‌టైన్ చేసిన అనీల్‌కు థాంక్స్ చెప్పారు. కొంచెం నవ్విస్తే చాలు, బ్రహ్మరథం పడతారని ప్రేక్షకులు నిరూపించారన్నారు.

వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'సినిమాను పెద్ద సక్సెస్ చేసినందుకు థాంక్స్ చిన్నమాటే అవుతుంది. ఓ సినిమా చేయాలంటే 100/200 కష్టం ఉంటుంది. అందరం పాజిటివ్ మైండ్ సెట్‌తో సినిమాను స్టార్ట్ చేశాం. కామెడీ కోసం చిరంజీవి, వెంకటేష్ సినిమాలు చూసేవాడిని. చిరు సినిమాలతో ఇన్‌స్పైర్ అయితే.. వెంకటేష్‌తో వర్క్ ఇన్‌స్పైర్ పొందానన్నారు. త్వరలోనే ఎఫ్ 3 చేయబోతున్నాం. ఎఫ్ 2నే ఇలా ఉంటే ఎఫ్ 3 ఎలా ఉంటుందో ఆలోచించుకోండి. తెలుగు ప్రేక్షకులకు థాంక్స్' అన్నారు.

విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ 'సినిమాను హిట్, సూపర్‌హిట్ అనుకుంటే.. ప్రేక్షకులు సూపర్ డూపర్ హిట్ చేసేశారు. మనస్ఫూర్తిగా ప్రేక్షకుల కళ్ళలో ఆనందం చూసినప్పుడు.. పదేళ్ల తర్వాత థియేటర్‌కు వెళ్లి అక్కడ ఆడియెన్స్ రెస్పాన్స్ చూసినప్పుడు.. నాకు మాత్రం కళ్ళలో కన్నీళ్లు వచ్చేశాయి. మేం అందరం కష్టపడి పనిచేసినప్పుడు.. ప్రేక్షకులు బాగా ఆదరించినప్పుడు ఆ ఆనందమే వేరు. నాకు గణేష్, ప్రేమించుకుందాం రా, బొబ్బిలిరాజా, నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి ఇలా చాలా సినిమాలను నాకు సక్సెస్ చేశారు. చాలా ఏళ్ల తర్వాత ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చినందుకు ఆనందంగా ఉంది.

దిల్‌రాజు, శిరీష్, లక్ష్మణ్‌లకు ఇంత మంచి సినిమా ఇచ్చినందుకు థాంక్స్. వరుణ్ చాలామంచి నటనను కనపరిచాడు. తమన్నా, మెహరీన్‌లకు థాంక్స్. సినిమాటోగ్రాఫర్ సమీర్‌రెడ్డికి, అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చిన దేవిశ్రీ సహా ఎంటైర్ యూనిట్‌కు థాంక్స్. ఫ్యామిలీతో మళ్లీమళ్లీ సినిమా చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు.

అబ్బా ఈషా!

ముంబై భామలకంటే తెలుగు బ్యూటీలు ఏవిషయంలో తక్కువ? నటనలోనా లేక గ్లామర్‌లోన? తెలుగు అమ్మాయిలు ఎందులోనూ తక్కువ కాదని నిరూపించే ప్రయత్నాలు చేస్తుంది తెలుగుపిల్ల ఈషారెబ్బ! సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్లు ఇస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో సంక్రాంతి సందర్భంగా చక్కటి పసుపురంగు చీరలో తళుక్కున మెరిసింది. సంక్రాంతికి ట్రెడిషనల్ డ్రెస్‌వేసుకుని అందరినీ మెస్మరైజ్ చేసిన ఈ బ్యూటీ, తాజాగా మోడరన్ లుక్‌లో అదరగొట్టింది. మొన్న వచ్చిన 'సుబ్రహ్మణ్యపురం' బాక్స్‌ఆఫీస్ దగ్గర ఫ్లాపుగా నిలవడంతో ఒకింత వెనకపడిన ఈషా, రెండు మూడు కథలు చర్చల్లో ఉన్నాయని చెబుతోంది. వాటిని ఇంకా ఫైనలైజ్ చేయలేదంటోంది ఈషా.



'గేమర్'.. చాలా స్పీడు



బిజి వెంచర్స్ పతాకంపై నూతన నటీనటులతో రాజేష్ తడకల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమర్'. శ్రీనిత్‌రాజ్, కల్యాణి పటేల్, అనిరుధ్, నేహ ప్రధాన పాత్రలు. సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి ట్రైలర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తడకల రాజేష్ నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ ప్రేక్షకులకు నచ్చే చిత్రాన్ని తెరకెక్కించాడన్నారు. చిన్న సినిమాల దర్శక నిర్మాతలను ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, థియేటర్ల నుంచే సమస్య ఎదురవుతుందన్నారు. కొత్త టాలెంట్ రావాలంటే చిన్న దర్శక నిర్మాతలను ఎంకరేజ్ చేయాలన్నారు. హీరో హీరోయిన్స్ శ్రీనిత్‌రాజ్, కల్యాణికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. హీరో శ్రనీత్ మాట్లాడుతూ తన తల్లిదండ్రులవల్లే ఈ స్థాయికి చేరానని, ప్రధాన పాత్రనిచ్చిన దర్శకుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో క్లారిటీతో దర్శకుడు సినిమా తీశాడని, టీమ్ మొత్తం హార్డ్ వర్క్ చేశామన్నారు. తనకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతకు హీరోయిన్ కల్యాణి థాంక్స్ చెప్పింది. దర్శక నిర్మాత రాజేష్ మాట్లాడుతూ ఇది తనకు ఏడో చిత్రమని, ఈ సినిమాతో పరిచయమవుతోన్న శ్రనీత్‌రాజ్ పెర్ఫార్మెన్స్ బావుందన్నారు. అనిరుధ్, నరేందర్, అల్తాఫ్, సింధు నిహ ఇతర పాత్రలు పోషించారని, ప్రతీ సీన్ డిఫరెంట్‌గా ఆసక్తి రేపుతుందన్నారు. సెన్సార్ పూర్తి చేసుకుని ఫిబ్రవరి 1న విడుదల చేస్తున్నామని, ప్రేక్షకులు విజయాన్ని అందిస్తారని ఆశిస్తున్నాను' అన్నారు.



దోషం ఎవరికి?

రా మూవీ రిక్రియేషన్స్ పతాకంపై కిషోర్, సన హీరో హీరోయిన్లుగా రఘు గోపసాని స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దోషం' నాకా...! దేవుడికా...? ఇటీవలే పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తిచేసుకుని సెన్సార్‌కి రెడీ అవుతుంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత రఘు గోపసాని మాట్లాడుతూ 'వజ్రాన్ని వజ్రంతో కోసినట్లు, మనిషిని పట్టిపీడిస్తున్న దోషాల తలలను కోయడానికి త్రిశూలంగా ఈ చిత్రం దూసుకొస్తోందన్నారు. నెల్లూరులోని రామాపురం వాస్తవ్యులు ఈ చిత్రంలో చక్కటి పెర్ఫార్మెన్స్ ఇచ్చారని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విలన్‌గా నటించిన ప్రవీణ్ పున్నూరు ఆకట్టుకుంటాడని, ఫిబ్రవరి చివరిలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నామన్నారు.

ట్రైలర్‌లో 'కెఎస్ 100'

చంద్రశేఖర్ మూవీస్ పతాకంపై సమీర్‌ఖాన్, శైలజ, సునీల్‌పాండే, ఆశిరాయ్, శ్రద్ధ, అక్షత ప్రధాన పాత్రధారులుగా కె.వెంకట్‌రామ్‌రెడ్డి నిర్మించిన చిత్రం 'కె ఎస్ 100'. షేర్ దర్శకత్వం వహించిన చిత్రం ట్రైలర్ విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాత వెంకట్‌రామ్‌రెడ్డి మాట్లాడుతూ మంచి హర్రర్ థ్రిల్లర్ రొమాంటిక్ మూవీ చాలా బాగొచ్చిందని, అందరికీ నచ్చుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. హీరోయిన్ సునీతపాండే మాట్లాడుతూ భోజ్‌పూరి, పంజాబి భాషల్లో నటించిన తనకు తెలుగులో ఇదే మొదటి సినిమా అన్నారు. సౌత్‌లో వర్క్ చేయాలన్న ఆశ ఇలా నెరవేరిందన్నారు. హీరో సమీర్‌ఖాన్ మాట్లాడుతూ యాక్టర్ అవ్వాలనే కల ఈ చిత్రంతో నెరవేరుతోందని, మంచి సబ్జెక్టుతో పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. టీమ్ అంతా హార్డ్‌వర్క్‌చేసామన్నారు. దర్శకుడు షేర్ మాట్లాడుతూ సినిమాలో ఆర్టిస్టుల పెర్ఫార్మెన్స్ అద్భుతంగా ఉందని, చాలా అనుభవంతో చేశారన్నారు. ఈతరం అమ్మాయిలు ఏ విధంగా ఫాస్ట్‌కల్చర్‌ను అలవర్చుకుంటున్నారన్న కాన్సెప్ట్‌తో చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. కెఎస్ (కుమారస్వామి) హీరో పాత్ర పేరని, 100 అన్నది వాళ్ల స్నేహకాలన్నారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కించిన చిత్రం నచ్చుతుందన్న నమ్మకంతో ఉన్నామన్నారు.

